
జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || సోమవారం 02, సెప్టెంబర్ 2024

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ ||సోమవారం 02, సెప్టెంబర్ 2024|| ఎడిటర్ : మార్తి సుబ్రహ్మణ్యం



# బాబు.. ఒక భరోసా!



- సెక్యూరిటీ సూచనలు బాబు బేఖాతర్
- అర్ధరాత్రి మళ్లీ బోటులో సింగ్‌నగర్‌కు
- బస్సులో నిద్ర
- ఐదేళ్లలో ఒక్కసారీ బయటకు రాని జగన్
- హెలికాప్టర్, పరదా పర్యటనలే
- బాబు స్టైలే వేరప్పా

(మార్తి సుబ్రహ్మణ్యం)

విజయవాడను వర్షాలు ముంచెత్తిన నేపథ్యంలో జనం ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమని బతుకుతున్నారు. చుట్టూ నీళ్లు. ఇంట్లోకి వచ్చిన వర్షపు నీరు. ఇంకాసేపట్లో తాము బతుకుతామో లేదో తెలియని భయానక పరిస్థితి. సెల్‌ఫోన్‌లో మాట్లాడదామంటే చార్జింగ్‌కు క రెంటు లేదు. ఇంట్లో పసిపిల్లలు పాల



కోసం ఏడుపు. పిలిస్తే పలికే దిక్కు లేదు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ నెంబరు తెలిసిన వాళ్లు ఆమెకు ఫోన్ చేస్తుంటే, సహాయ బృందాలు వస్తాయన్న భరోసా వినిపిస్తోంది. అది తెలియని వారు సహాయ బృందాలు వచ్చేవరకూ చకోరపక్షుల్లా ఎదురుచూడాల్సిన పరిస్థితి.

ఈ పరిస్థితిని తన అనుభవంతో ముందే గ్రహించిన సీఎం చంద్రబాబునాయుడు అంతపెద్ద విపత్తులోనూ ప్రాణాలు లెక్కచేయకుండా.. నడుముకు బెల్టు, సేఫ్టీ జాకెట్ వేసుకుని కుర్రాడి మాదిరిగా పడవ ఎక్కిన ఓ ఏడుపదుల నాయకుడి సాహసం. నిండా మునిగిన సింగ్‌నగర్‌లో ఒకసారి మొత్తం బోట్‌లో తిరిగి, బాధితులకు నేనున్నానని భరోసా ఇచ్చారు. దానితో బాబు వచ్చారు.. ఇక నిశ్చింతగా ఉండవచ్చన్న భరోసా బాధితుల కళ్లలో స్పష్టంగా కనిపించిన వైనం.

ఒకసారి బోట్‌లో కలెక్టర్, జిల్లా అధికారులతో కలసి సింగ్‌నగర్‌లో పర్యటి ంచిన బాబు తర్వాత ఖాళీగా కూర్చోలేదు. పనయిపోయింది కదా.. మీడియా వచ్చింది కదా.. ఫొటోలు తీసుకున్నారు కదా అని ఇంటికి వెళ్లిపోలేదు. మళ్లీ కలెక్టరేట్‌కు వెళ్లి సహాయ కార్యక్రమాలపై అధికారులను పరుగులెత్తించారు.

ముందు తక్షణం బాధితులకు ఆహారం, మంచినీటి సరఫరాపై ఆగమేఘాలపై ఆదేశాలిచ్చారు. దుర్గగుడితో పాటు.. తన పార్టీ ఎంపి, ఎమ్మెల్యేలకు బాధితులకు ఆహారం తయారుచేసి అందించే బాధ్యత అప్పగించారు. తక్షణం సహాయ కార్యక్రమాల్లో దిగాలని ఆదేశించారు.

గతంలో విశాఖను ముంచేసిన హుద్‌హుద్ తుపాన్‌కు విశాఖవాసులు ప్రాణాలరచేతిలో పెట్టుకుని భీతిల్లితే.. నేనున్నానంటూ అక్కడే బస్సులో పడుకుని సహాయ కార్యక్రమాలు స్వయంగా పర్యవేక్షించిన కార్యదక్షుడు. విశాఖవాసులు మళ్లీ కోలుకునే వరకూ అక్కడే ఉన్న పనిరాక్షసుడు బాబు.

ఇప్పుడూ అంతే. నీటమునిగిన విజయవాడ వాసులకు భరోసా ఇచ్చేందుకు రంగంలోకి దిగిన బాబు.. రెండోసారి అర్ధరాత్రి కూడా సింగ్‌నగర్‌లో బోటుపై పర్యటించారు. కలెక్టరేట్ వద్ద ఆయన విశ్రమించేందుకు బస్సు వచ్చింది. అప్పుడు విశాఖ. ఇప్పుడు బెజవాడ. నగరాల పేర్లే మార్పు. మిగిలినదంతా సేమ్ టు సేమ్. సహాయ కార్యక్రమాలు ఎంతవరకూ వచ్చాయని స్వయంగా తెలుసుకోవడమే ఆయన పర్యటన లక్ష్యం.

నిజానికి చంద్రబాబు దక్షిణభారత దేశంలోనే అత్యంత భద్రత ఉన్న వీవీఐపి. ఆయన ఇలా అర్ధరాత్రి బయటకు వచ్చేందుకు భదత్రా అంశాలు అంగీకరించవు. అయినా సరే జనం ముందు అవన్నీ ఆయనకు దిగదుడుపే. జనం కష్టాల్లో ఉంటే బాబుకు కాలు ఓ పట్టాన ఆగదు. అక్కడికి వెళ్లి వారిని పరామర్శించి, నేనున్నానని ధైర్యం చెప్పాలన్నదే ఆయన తపన. దాన్ని పూర్తి చేసేవరకూ విశ్రమించరు. అది అధికారంలో ఉన్నా.. లేకపోయినా!

ఇప్పుడూ అదే చేశారు. అసలు ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి, అందులోనూ ఎన్‌ఎస్‌జీ రక్షణలో ఉన్న సీఎం.. భద్రతా హెచ్చరికలు లెక్కచేయకుండా, ప్రాణాలు పణంగా పెట్టి నిలువెత్తునీటిలో పర్యటించడం చరిత్రలో ఎప్పుడైనా విన్నామా? కన్నామా? ఇదంతా చంద్రబాబుకే చెల్లింది. అందుకే చంద్రబాబు ఒక ధైర్యం.. చంద్రబాబు ఒక భరోసా.. మొత్తంగా అందరికీ ఆత్మవిశ్వాసం.

జగన్ జమానాలో ఇలాంటి విపత్తులు వచ్చినా, ఆయన తాడేపల్లి నుంచి బయటకు రాని వైనం. పంటనీట మునిగితే ఒక వేదిక ఏర్పాటుచేసి, అక్కడి నుంచే పరిశీలించిన వైచిత్రి. ఎక్కడకు వెళ్లినా పరదాలు. అడుగువేస్తే పచ్చని చెట్లు కూలిపోవలసిందే. ఐదేళ్లలో ఒక్కసారి కూడా బాబు మాదిరిగా ఇలా ధైర్యం చేసి బోటు మీద ప్రయాణం చేసిన దాఖలాలు భూతద్దం వేసి వెతికినా కనిపించదు. అందుకే బాబంటే ఒక భరోసా.

మంత్రులందరినీ బెజవాడ వచ్చి, ఒక్కో డివిజన్‌కు ఒక్కోరిని బాధ్యతలు తీసుకోవాలని ఆదేశించారు. పనిమంతుల తీరు అలాగే ఉంటుంది మరి!

సహజంగా చంద్రబాబు ఒక పట్టాన సంతృప్తిపడే రకం కాదు. పైగా ఇలాంటి విపత్తుల్లో జనం ఎలాంటి బాధలు అనుభవిస్తారో.. ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం కోసం ఎదురుచూస్తారో ఆయనకు అనుభవమే.

## అర్ధరాత్రయినా.. అందుకే వెళ్లా

- సింగ్‌నగర్‌లో మీడియాతో సీఎం చంద్రబాబు

సింగ్‌నగర్ వరద ముంపు ప్రాంతాల్లో బాధితుల్లో ఆత్మ స్థైర్యం నింపి వారికి అందిస్తున్న సహాయక చర్యలు పరిశీలించేందుకు అర్ధరాత్రి ముఖ్యమంత్రి పర్యటించారు. స్వయంగా బాధితులతో మాట్లాడారు. అక్కడ నుంచి బయలుదేరి విజయవాడ కలెక్టరేట్ కు చేరుకున్నారు

కలెక్టరేట్ కు చేరుకున్న ముఖ్యమంత్రి మీడియాతో మాట్లాడుతూ... మీడియా సమావేశం అనంతరం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తామన్నారు.. అర్ధరాత్రి దాటినా అలుపెరగకుండా వరద ప్రాంతాల్లో పర్యటించి వారి కష్టాలను చూసి బాధితులకు అందుతున్న సౌకర్యాలను అడిగి

తెలుసుకున్నానన్నారు.

సెక్యూరిటీ రీజన్స్ ప్రకారం వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించ వద్దని చెప్పినా ప్రజలు ఇబ్బంది పడుతుంటే వారి దగ్గరికి వెళ్లకుండా ఎలా ఉంటామన్నారు. వరద ప్రాంతాల్లో తిరిగి బాధితులకు భరోసా ధైర్యం కల్పించిన ముఖ్యమంత్రి.. నేరుగా వరద బాధితులకు ముఖ్యమంత్రి ఆహారాన్ని అందజేసారు.

బాధల్లో ఉన్న ప్రజలకు ధైర్యం చెప్పాలనే అర్ధరాత్రి అయినా వెళ్ళానని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా తెలియజేశారు. బాధితుల ఆత్మస్థైర్యం దెబ్బతినకూడదని ఈ సందర్భంగా తెలిపారు. కొంతమంది రోగులు, వృద్ధులు కూడా ముంపులో చిక్కుకుని ఉండటం చూశానని అన్నారు.

సమయం కొంచెం ముందు వెనుక అయినా ప్రతీ ఒక్కరినీ రక్షించి తీరుతాం అని తెలిపారు రేపు ఉదయానికల్లా బోట్లు, హెలికాప్టర్ అందుబాటులోకి వస్తాయని ముఖ్యమంత్రిఈ సందర్భంగా తెలియజేశారు.

### బాబు పర్యటనలో హైలెట్స్..

- బాధితులకు అందుతున్న ఆహారం, సహాయ చర్యలను పర్యవేక్షిస్తున్న సీఎం
- ఇతర ప్రాంతాల నుంచి రావాల్సిన బోట్స్‌పై సీఎం చంద్రబాబు ఆరా
- ఏ విషయంలోనూ జాప్యం సహించేది లేదన్న సీఎం చంద్రబాబు
- అవసరమైతే కలెక్టర్లు జిల్లాల్లో వాహనాలు తీసుకుని బోట్స్ తరలించాలని సీఎం చంద్రబాబు



ఆదేశం
- ఆహారం సరఫరాలో జాప్యంపై ఉండకూడదన్న సీఎం చంద్రబాబు
- పార్టీ ఎంపీ, ఎమ్మెల్యేలు కేశినేని చిన్ని, యార్లగడ్డ వెంకట్రావుకు భోజనం తయారుచేసి తీసుకొచ్చే బాధ్యత అప్పగించిన సీఎం
- ఎంతమందికి అవసరమైతే అంతా ఇవ్వాలన్న సీఎం
- సహాయక చర్యల్లో పాల్గొనేందుకు మంత్రులు అందరినీ విజయవాడకు రావాలని చెప్పిన సీఎం చంద్రబాబు
- ఒక్కో డివిజన్‌కు మంత్రి సహా సీనియర్ అధికారికి బాధ్యతలు
- ఈ రాత్రికి 5 లక్షల వాటర్ బాటిల్స్ వస్తాయన్న అధికారులు

## కష్టాలు తీరే వరకు ఇక్కడే ఉంటా

- మీడియా సమావేశంలో సీఎం చంద్రబాబు నాయుడు

- ప్రజలను కాపాడటం, వారికి భరోసా ఇవ్వడం మా ప్రధాన లక్ష్యం. 1998 తర్వాత మళ్లీ ఆ స్థాయిలో వర్షాలు పడ్డాయి...విపత్తును ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం.
- వరద నష్టంపై కేంద్రాన్ని సాయం కోరుతాం.
- నేడు, రేపు విజయవాడ కలెక్టరేట్ లోనే ఉంటా.
- నిద్రహారాలు మానైనా ప్రజల్ని ఆదుకుంటామని హామీ.
- రాష్ట్రంలో ఎప్పుడూ లేని విధంగా వరదలు సంభవించాయి.
- బుడమేరుకు ఎక్కువగా వదర నీరు రావడంతో సింగ్ నగర్ ప్రాంతం ముంపునకు గురైంది.
- ఇంత పెద్ద ఇన్ ఫ్లో ఎప్పుడూ రాలేదు. 1998లో ఈ తరహా వరద వచ్చింది.
- 1998లో 9.24 లక్షల క్యూసెక్కులు వస్తే ఇప్పుడు ఇప్పుడు 9.70 లక్షల క్యూసెక్కులు వచ్చింది. గతం కంటే ఇప్పుడు 50 వేల క్యూసెక్కుల నీరు అధికంగా వచ్చింది.
- కృష్ణా బేసిన్‌లో అన్ని రిజర్వాయర్లు నిండాయి. బుడమేరుకు వరద ఎక్కువగా రావడంతో సింగ్ నగర్, కృష్ణలంక, ఇబ్రహీంపట్నంలోకి నీళ్లు వచ్చాయి.
- ఈ విపత్తును సమర్థవంతంగా ఎదుర్కొంటున్నాం. గుంటూరు, విజయవాడలో చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా వర్షం పడింది.
- గత ఐదేళ్ల పాటు సరిగా నిర్వహణ లేకపోవడంతో విజయ వాడలోకి నీళ్ల వచ్చి చేరాయి.
- సింగ్ నగర్‌కు బోట్‌లో వెళ్లి బాధితులను పరామర్శించాను.
- వారి కష్టాలు చూసి వెళ్లడం ఇష్టం లేక న్యాయం చేసి, నమ్మకం కలిగిచేందుకు కలెక్టర్ కార్యాలయంలోనే ఉండాలని నిర్ణయించుకున్నాను.
- రేపు ఇక్కడే ఉంటా. రాష్ట్రంలోని పరిస్థితిపై కేంద్ర హోం మంత్రితో కూడా మాట్లాడాను.
- 10 ఎన్డీఆర్ఎఫ్ టీమ్ లు రాష్ట్రానికి వస్తున్నాయి. 40 పవర్ బోట్లు కూడా రానున్నాయి. 10 హెలికాప్టర్‌లు కూడా వస్తాయి. ఎక్కడ ఇబ్బందులు ఎదుర్కొన్నా. వారిని ఎయిర్ లిఫ్ట్ చేస్తాం. అడిగిన వెంటనే కేంద్రం స్పందించింది.
- హోటల్స్ యజమానులను, అక్షయపాత్ర వాళ్లను సంప్రదించి ఆహారం తయారు చేయాలని కోరాం.
- ఈ రాత్రికే ప్రతి ఒక్కరికీ ఆహారం, పాలు, బిస్కెట్లు, నీళ్లు అందించేందుకు సిద్ధం చేశాం. ప్రతి ఒక్కరికీ చేరేలా ప్రయత్నిస్తున్నాం.
- సింగ్ నగరలో 16 డివిజన్లలో, 77 సచివాలయాలు ఉన్నాయి. డివిజన్‌కు ఒక సీనియర్ అధికారి, సచివాల యానికి ఒక జూనియర్ అధికారిని నియమిస్తాం.
- బాధితులు పూర్తిగా తేరుకున్న తర్వాతే ఇక్కడి నుండి వెళ్తాం.
- 1997లో తూర్పు గోదావరిలో హరికేన్ తుపాన్, 2014లో విశాఖలో హుద్ హుద్ తుపాన్ వచ్చినప్పుడు అక్కడే ఉండి పరిస్థితి చక్కదిద్దాం.
- ఇప్పుడు కూడా ప్రజలు పిలిస్తే పలికే విధంగా ఉండాలనే కలెక్టరేట్‌లో ఉన్నా వరద తగ్గే వరకు అన్ని జాగ్రత్తలు తీసుకుంటాం.
- వరద నష్టంపై కేంద్రాన్ని సాయం కోరతాం.
- మూడు నాలుగు రోజులు నిద్రలేకపోయినా పర్వాలేదు... ఇక్కడే ఉండి సాధారణ పరిస్థితి వచ్చే దాకా చక్కదిద్దుతాం.

జనం గుండె చప్పుడు


# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || సోమవారం 02, సెప్టెంబర్ 2024 || ఎడిటర్ : మార్తి సుబ్రహ్మణ్యం

## నేడు స్కూళ్ళకు సెలవు ఇవ్వండి

### - సీఎం చంద్రబాబు



అమరావతి, మహానాడు: రాష్ట్ర వ్యాప్తంగా స్కూళ్ళకు నేడు సెలవు ఇవ్వాలని సీఎం చంద్రబాబు అధికారం ఆదేశించారు. వర్షాలు వరదల్లో తొమ్మిది మంది చనిపోవడం బాధాకరం అని అన్నారు. ఇప్పటికే చాలా వరకు వర్షాలు తగ్గాయని, కానీ వరద ముప్పు ఉందని చెప్పారు. ఎల్లుండిలోగా వర్షాలు తగ్గుతాయని పేర్కొన్నారు. కృష్ణ, గుంటూరు జిల్లాలో అసాధారణ వర్షపాతం నమోదు అయిందని 37 సెం.మీవరకు వర్షం కురిసింది అని సీఎం తెలిపారు.

## ఆర్థిక శాఖలో

# మళ్లీ పాత మేస్త్రీనే!



- సత్యనారాయణకే మళ్లీ ఆర్థిక శాఖ బాధ్యతలు?
- అప్పుడు సెక్రటరీ..ఇప్పుడు ఓఎస్డీ పాత్రలో
- మాతృశాఖకు వెళ్లినా ఇంకా ఇక్కడే తిష్ట
- అనుభవం పేరిట తిరిగి తీసుకువచ్చిన వైనం
- తాజాగా 300 కోట్ల బిల్లుల విడుదలలో ఆయనదే పాత్ర?
- అందులో పులివెందుల వైసీపీ కాంట్రాక్టర్ల బిల్లులు క్లియర్
- నెల్లూరులో వైసీపీ కాంట్రాక్టర్ల బిల్లులు కూడా క్లియర్
- ఒకే హెడ్ కింద చూపి క్లియర్ చేశారట
- 300 కోట్ల వేర్వేరు బిల్లులను ఒకే హెడ్స్‌లో ఎలా చేర్చారు?
- టీడీపీ హయాం నాటి నీరు-చెట్టు, ఉపాధి హామీ పథకం బిల్లులకు మోక్షమేదీ?
- ఇంకా పెండింగ్‌లో 35 శాతం బిల్లులు
- లోకేష్ ప్రారంభించిన టూరిజం బిల్డింగ్ బిల్లు ఆపేసిన నాటి జగన్ సర్కారు
- బాసు బాధ్యతలు మోస్తున్న సత్యనారాయణ?

(మార్తి సుబ్రహ్మణ్యం)

చిత్ర విచిత్రాలకు ఏపీ ఆర్థిక శాఖ కేంద్రంగా మారింది. ఇటీవలే పులివెందుల-నెల్లూరు వైసీపీ కాంట్రాక్టర్ల బిల్లులు పెద్దమనసుతో క్లియర్ చేసి, తమ విశాల హృదయం చాటుకున్న వైనం ఇంకా కూటమి వర్గాల్లో చర్చ జరుగుతుండగా.. మరో అద్భుతం కూడా వెలుగుచూడటం పుండుమీద కారం చల్లినట్టయింది. జగన్ జమానాలో ఆర్థిక శాఖను వెలిగించిన నాటి కార్యదర్శి సత్యనారాయణ సేవలు, ఇంకా విజయవంతంగా కొనసాగుతున్న వైనం చర్చనీయాంశమయింది.

జగన్ ఐదేళ్ల పాలనలో నాటి ఆర్థిక శాఖ కార్యదర్శి కెవివి సత్యనారాయణ పేరు విననివారు బహు తక్కువ. వివిధ శాఖల్లో పనిచేసిన కాంట్రాక్టర్లకు ఎవరికి బిల్లులివ్వాలి? ఎంత ఇవ్వాలి? ఏ శాఖలోని భవనాలు, స్థలాలను తాకట్టు పెట్టి అప్పులు తీసుకురావాలన్న అంశంలో సత్యనారాయణ నిష్ణాతుడన్న విషయం తెలిసిందే. అసలు సచివాలయంలోని ఒక బ్లాకునే తాకట్టు పెట్టినప్పుడు గానీ.. సారు గారి ప్రతిభాపాటవాలు ఆసాంతం బయట ప్రపంచానికి తెలియలేదు. నిజానికి సత్తెన్న సారుకు ఇప్పటి ఓ మంత్రిగారే టీడీపీ సర్కారు ఉన్నప్పుడు అభిమానంతో 'కాపు'కాశారట.

నాటి సీఎంఓలో కార్యదర్శిగా ధనంజయరెడ్డి ఎవరికి బిల్లులు ఇవ్వాలని ఆదేశిస్తే, సత్యనారాయణ వారికి బిల్లులు ఇచ్చేవారు. ఆరకంగా జగన్ అస్మదీయ కంపెనీలు, బడా కాంట్రాక్టర్లకు సత్యనారాయణ చేసిన సేవలు అమోఘం. అద్భుతం. అనిర్వచనీయం. అనన్య సామాన్యం! బిల్లుల చెల్లింపులో సీఎంఓ నుంచి ఆర్థికశాఖ వరకూ కమిషన్లు నడిచేవని, అప్పట్లో టీడీపీ నేతలు ఆరోపణలు గుప్పించారు. బిల్లులపై 7 నుంచి 10 శాతం కమిషన్లు తీసుకునేవారని, హైదరాబాద్‌లోనే ఆ చెల్లింపులు జరిగేవన్న ఆరోపణలు అప్పట్లో వినిపించిన విషయం తెలిసిందే.

ఆర్థికశాఖ వ్యవహారాలను సచివాలయం నుంచి చక్కబెట్టాల్సి ఉన్నప్పటికీ.. మంగళగిరిలోని నిధిభవన్‌లని ఐదో అంతస్తు సెత్తనసారుకు ఐదేళ్లు అడ్డాగా ఉండేది. నిజానికి ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శులు పేరుకే తప్ప, పెత్తనమంతా సత్తెన్న సారుదే. గతంలో రావత్ సహా, ఆర్థిక శాఖ బాసులకు మంగళగిరి నిధిభవన్ అడ్డా అన్నది బహిరంగ రహస్యమే.

ప్రభుత్వం మారి కూటమి గద్దెనెక్కిన తర్వాత.. ఆర్థికశాఖను వెలిగించిన సత్యనారాయణ సారును కొత్త సర్కారు సాగనంపింది. ఆయననను అక్కడి నుంచి తప్పించింది. అంతకు ముందే.. మళ్లీ జగనన్న సర్కారే అధికారంలోకి వస్తుందన్న భరోసాతో, సత్తన్న తన మాతృ శాఖ రైల్వే నుంచి మరో రెండేళు పొడిగింపు తెచ్చుకున్నారు. కానీ ఆయన అదృష్టం బాగుండక, కూటమి సర్కారు అధికారంలోకి వచ్చింది.

దానితో రైల్వేకు వెళ్లి రిపోర్టు చేసిన సత్తెన్నను, కూటమి సర్కారు మళ్లీ వెనక్కి పిలిపించింది. అప్పటివరకూ ఆర్థిక శాఖ కార్యదర్శిగా హవా సాగించిన మిగతా.. 2లో






## నష్టపోయిన ప్రతి ఒక్కరికీ

# న్యాయం చేస్తాం..

- ఈ విపత్కర పరిస్థితుల్లో ప్రజల ప్రాణాలు కాపాడటమే ప్రభుత్వ తక్షణ కర్తవ్యం
- డ్రోన్లు, సీసీ కెమెరాల ద్వారా రియల్ టైంలో పరిస్థితిపై అధికార యంత్రాంగం స్పందించాలి
- వరద తగ్గిన వెంటనే పంట నష్టంపై వివరాలు సేకరించాలి
- కేంద్ర ప్రభుత్వానికి కూడా నష్టం అంచనా వేసి పంపాలి
- డ్రోన్ల ద్వారా దెబ్బతిన్న పంటలను అంచనా వేయాలి
- ఏ ఒక్కరైతుకూ అన్యాయం జరగకూడదు.. పంట నష్టపోయిన వారికి పరిహారం అందిస్తాం
- వరదల వల్ల 1,11, 259 హెక్టార్లో దెబ్బతిన్న వ్యవసాయ పంట, 7,360 హెక్టార్లో దెబ్బతిన్న హార్టి కల్చర్
- 107 క్యాంపులు ద్వారా 17,000కి పునరావాస సదుపాయం కల్పించాం
- రాష్ట్రవ్యాప్తంగా 28.5 సెం.మీ ల కన్నా అదనంగా వర్షపాతం నమోదు.. 3 జిల్లాల్లో 60 శాతం కన్నా ఎక్కువ వర్షపాతం, 19 జిల్లాల్లో 20- 50 శాతం ఎక్కువ వర్షపాతం నమోదు.. 4 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదు
- వరద ప్రాంతాల్లో బియ్యం, పప్పు,పంచదార, కూరగాయలు పంపిణీ చేస్తున్నాం
- ప్రజలకు ఎక్కడా చిన్న ఇబ్బంది కూడా కలగకూడదు
- భారీ వర్షాలతో నష్టపోయిన అన్ని వర్గాలను ఆదుకుంటాం
- రాష్ట్రంలో వరదలపై ఏపీ డిజాస్టర్ మేనేజ్ మెంట్ అథారిటీ కార్యాలయంలో అధికారులతో సమీక్షలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్ష

అమరావతి,మహానాడు: నష్టపోయిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తాం. ఈ విపత్కర పరిస్థితుల్లో ప్రజల ప్రాణాలు కాపాడటమే ప్రభుత్వ తక్షణ కర్తవ్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్రంలో వర్ష ప్రభావం, వాతావరణ పరిస్థితులపై హెూంమంత్రి, సిఎస్, ఉన్నతాధికారులతో ఆదివారం విజయవాడలోని ఏపీ డిజాస్టర్ మేనేజ్ మెంట్ అథారిటీ కార్యాలయంలో సీఎం చంద్రబాబు సమీక్షించారు.

ఈ సందర్భంగా తుఫాను ప్రభావం, వర్షపాతం నమోదు అంశాలు సీఎంకు సిఎస్ వివరించారు. వరద ఉధృతి ఎక్కడెక్కడ ఉందన్నదానిపై సీఎం ఆరా తీశారు. ప్రకాశం బ్యారేజీ దిగువ ప్రాంతాల్లో తీసుకున్న చర్యలపై వివరాలు తెలుసుకున్నారు. మిగతా..10లో





# తెలంగాణ ఆగమాగం

- హైదరాబాద్, ఖమ్మం, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల్లో బీభత్సం
- రోడ్లపై కూలిపోయిన భారీ వృక్షాలు
- ఖమ్మంలో రోడ్లపై పడవలు
- ప్రభుత్వ వైఫల్యంపై ధర్నాలు
- నీటమునిగిన హైదరాబాద్
- హాస్టళ్లలో పిల్లల ఆగమాగం
- అనేకచోట్ల కరెంట్ కట్
- పలు రైళ్లు రద్దు
- రోడ్డుపైనే డిప్యూటీ సీఎం భట్టి

(సుబ్బు)

భారీ వర్షాలకు తెలంగాణ జనం బతుకు ఆగమవుతోంది. గత రెండురోజుల నుంచి ఎడతె రపి లేకుండా కురుస్తున్న భారీ వ ర్షాలకు జనం బతుకు ఆగమవుతోంది. ప్రధానంగా తెలంగాణ జిల్లాల్లోని హాస్టళ్లలో చదువుకుంటున్న విద్యార్థులు మిగతా.. 2లో



## 24 గంటలు అప్రమత్తంగా ఉండాలి

- టెలి కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం



హైదరాబాద్, మహానాడు: రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలపై సీఎం రేవంత్ రెడ్డి అత్యవసర సమీక్ష జరిపారు. సీనియర్ మంత్రులు భట్టి, ఉత్తమ్, పొంగులేటి, తుమ్మల, దామోదర రాజనర్సింహ, జూపల్లి తదితరులతో ఫోన్లో రివ్యూ చేసి అప్ర మత్తం చేశారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ... సీఎస్, డీజీపీ, మున్సిపల్, కరెంట్, పంచాయతీ రాజ్, హైడ్రా, ఇరిగేషన్ అధికారులు 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని టెలి కాన్ఫరెన్స్‌లో ఆదేశించారు. ఇంకా.. ఆయన ఏమన్నా రంటే కలెక్టర్లు, ఎస్పీలు, రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు 24 గంటలు క్షేత్రస్థాయిలో పర్యటించాలి. అధికారులు సెలవులు పెట్టొద్దని, సెలవులు పెట్టిన వారు వెంటనే రద్దు చేసుకొని ఎప్పటికప్పుడు సమాచారాన్ని సీఎంఓ కార్యాలయానికి పంపాలని, ఆదేశం. వరద ఎఫెక్ట్ ఏరియాల్లో తక్షణ సహాయం కోసం చర్యలు చేపట్టాలి.




నేటి విజయవాడ వరదలు.. నాటి జగన్ రెడ్డి పాపాలు!

3లో



వరద సమస్య శాశ్వత పరిష్కారానికి ప్రణాళికలు

5లో



100 పునరావాస కేంద్రాలకు 13,227 మంది తరలింపు

8లో



ఇంటి నుంచి బయటకు రావద్దు

12లో

## గుడ్లవల్లేరు కాలేజీలో హిడెన్ కెమెరాల అసలు కథ ఇదీ!

- కెమెరాల్లేవు.. కాకరకాయలూ లేవు
- మంత్రి లోకేష్, ఎస్పీ చెప్పిందీ అదే

(రాజా రమేష్)



గత కొద్దిరోజుల నుంచి రాష్ట్రాన్ని అట్టుడికిస్తున్న గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీలో.. హిడెన్ కెమెరాల వ్యవహారం వెనుక, అసలు నిజాలు బయటకొస్తున్నాయి. కొందరు ప్రేమికుల మధ్య నడిచిన ఈ కథను రాష్ట్ర ప్రభుత్వ అసమర్థగా ముద్ర వేసేందుకు చేసిన ప్రయత్నాల వెనుక అసలు కథ ఇదేనని తేలింది. చివరాఖరకు హిడెన్ కెమెరాలపై మంత్రి లోకేష్, జిల్లా ఎస్పీ చెప్పిందే నిజమైంది.

అసలేం జరిగిందే.. కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలో సీక్రెట్ కెమెరాల వ్యవహారం వెనుక కథ మరో మలుపు తీసుకుంది. ఈ అంశంపై విద్యార్థినులు అర్ధరాత్రి కళాశాల ప్రాంగణంలో ఆందోళనకు దిగారు. బాలికల వసతి గృహంలోని బాత్‌రూమ్‌లలో రహస్య కెమెరాలు ఉంచారంటూ, సెల్‌ఫోన్

జనం గుండె చప్పుడు
మహానాడు 2
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || సోమవారం 02, సెప్టెంబర్ 2024

# గుడ్లవల్లేరు కాలేజీలో హిడెన్ కెమెరాల అసలు కథ ఇదీ!

(మొదటిపేజీ తరువాయి..)

టార్చ్‌లైట్లు వేస్తూ తమకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. వాస్తవానికి ఐదుగురు విద్యార్థుల మధ్య జరిగిన వ్యవహారం హిడెన్ కెమెరాల ప్రచారానికి దారి తీసినట్లు తెలుస్తోంది. అసలు కథ ఇదీ..

కృష్ణ–లిల్లీ ప్రేమికులు.

భారు– మంజు అన్నా చెల్లెళ్లు.

భారు–కృష్ణ స్నేహితులు.

జస్సు అనే వాడు లిల్లీకి వన్ సైడ్ లవర్. (విద్యార్థుల పేర్లు వాళ్ల ప్రైవసీ దృష్ట్యా బయటకు రాకుండా మార్చి ఇచ్చాం)

ఈ ఐదుగురు విద్యార్థుల కథలో వచ్చిన మలుపులే హిడెన్ కెమెరాల ప్రచారానికి దారి తీశాయి. కృష్ణ–లిల్లీలు ప్రేమలో ఉండి వీడియోకాల్స్ మాట్లాడుకున్నారు. ఆ సందర్భంలో కొన్ని స్క్రీన్ షాట్స్ తీసుకున్నారు.

ఈ విషయం కృష్ణ స్నేహితుడు భారుకు తెలిసింది. స్నేహితులు కావటంతో కృష్ణ భారు తరచూ ఒకరింటికి ఒకరు వెళ్లేవారు. అక్కడ భారు చెల్లెలు మంజు పరిచయం అవటం ఆమెతోనూ ప్రేమ వ్యవహారం నడిపాడు. లిల్లీ తరహాలోనే వీడియో కాల్స్ – స్క్రీన్ షాట్స్ వ్యవహారం కృష్ణ – మంజు మధ్య కూడా సాగింది. ఫలితంగా స్నేహితులైన భారు– కృష్ణ ల మధ్య




మనస్పర్థలు వచ్చాయి.

మాటా మాట పెరిగి లిల్లీతో మాట్లాడిన వీడియో కాల్ స్క్రీన్ షాట్ లు బయటపెడతా అని భారు కృష్ణని బెదిరించాడు. దీంతో కృష్ణ నీ చెల్లెలి వీడియో కాల్స్ రికార్డింగ్స్ కూడా నా దగ్గర ఉన్నాయ్ అవి నేనూ బయటపెడతా అనటంతో వివాదం ముదిరింది.

వ్యవహారం సీనియర్ విద్యార్థుల ముందు పంచాయితీకి వెళ్లింది. వన్ సైడ్ లవర్ అయిన జస్సు కోపంతో హిడెన్ కెమెరాలు అంటూ కళాశాలలో ప్రచారం చేశాడు. దీంతో వ్యవహారం గోల గోల అయింది. ఇదీ హిడెన్ కెమెరాల అసలు ముచ్చట. మీకు అర్థమవుతోందా?

# ఆర్థిక శాఖలో మళ్లీ పాత మేస్త్రీనే!

(మొదటిపేజీ తరువాయి..)

సత్తెన్నను.. ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి ఓఎస్డీగా నియమించారు. తొలుత కూటమి సర్కారు అధికారంలోకి వచ్చినందున, మొదటి నెలలో జీతాలు, పెన్షన్ల వ్యవహారాలు చూడాలంటూ ఆయనకు ఆ పని అప్పగించారు. ఇక అప్పటి నుంచీ సత్తెన్న విజయవంతంగా ఆర్థికశాఖలోనే మళ్లీ చక్రం తిప్పుతుండటం విశేషం.

కాగా ఇటీవల పులివెందులకు చెందిన వైసీపీ కాంట్రాక్టర్లు, జగన్ జమానాలో చేసిన 100 కోట్ల రూపాయల బిల్లులను ఆర్థికశాఖ క్లియర్ చేయటం టీడీపీ కార్యకర్తల ఆగ్రహానికి గురయింది. దానితోపాటు నెల్లూరు జిల్లాలో.. రెడ్డి సామాజిక వర్గానికి చెందిన మరికొందరు వైసీపీ కాంట్రాక్టర్ల బిల్లులు కూడా, పంచకల్యాణి గుర్రం సైతం ఈర్ష్యపడేంత స్థాయిలో వాయి వేగంతో క్లియర్ కావడం, తమ్ముళ్లకు పుండుమీద కారం చల్లినట్టయింది.

“రాష్ట్రంలో మనం అధికారంలో ఉన్నామా? జగన్ పార్టీ అధికారంలో ఉందా? ఇందుకోసమేనా మేం కేసులు పెట్టించుకుని మరీ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చింది?” అంటూ టీడీపీ సోషల్‌మీడియా సైనికులు అగ్గిరాముళ్లయ్యారు.

నిజానికి వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అంతకుముందు గ్రామాల్లో నీరు–చెట్టు, జాతీయ ఉపాధి హామీ పథకం కింద చేసిన పనులన్నీ జగన్ సర్కారు నిలిపివేసింది. దానితో టీడీపీ గ్రామ స్థాయి నాయకులు ఆర్థికంగా దారుణంగా నష్టపోయారు. ఆ తర్వాత కోర్టుకు వెళ్లిన వారికి అనుకూల తీర్పు ఇచ్చినప్పటికీ, జగన్ సర్కారు నామమాత్రంగానే బిల్లులు మంజూరు చేసింది. మళ్లీ దానిపై కోర్టు ధిక్కరణ కేసు వేసినా ఫలితం శూన్యం.

ఆ విధంగా టీడీపీ హయాంలో కాంట్రాక్టర్లు చేసిన అన్ని బిల్లులనూ జగన్ సర్కారు నిలిపివేసింది. అయితే తర్వాత కొంతకాలానికి కమ్మ వర్గానికి చెందిన కాంట్రాక్టర్లకు మినహా, మిగిలిన వారికి కమిషన్లు తీసుకుని బిల్లులు మంజూరు చేసిందనేది బహిరంగమే. ఆ ప్రకారంగా ఇప్పటికి ఇంకా 35 శాతం బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయట. దీనిపై ఇటీవల కొందరు నీటిపారుదల శాఖ మంత్రి రామానాయుడును కలసి చర్చించిన నేపథ్యంలో, దీనిని సీఎం దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చినట్లు సమాచారం.

ఇంకా ఆశ్చర్యం ఏమిటంటే.. అప్పటి సర్కారులో మంత్రిగా పనిచేసిన లోకేష్ ఎన్నికల కోడ్‌కు ముందు, పాలకొల్లు నియోజకవర్గం సీతంపేట ఐటిడిఏలో టూరిజం గెస్ట్ హౌస్‌ను ప్రారంభించారు. దానిని టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొట్టిముక్కల కోటేశ్వరరావు నిర్మించారు. ఎన్నికల్లో టీడీపీ ఓడిపోయిన నేపథ్యంలో.. ఆ నిర్మాణంలో అక్రమాలు జరిగాయంటూ, నాటి వైసీపీ ఎమ్మెల్యే ఫిర్యాదు చేయటంతో దాని బిల్లు ఆగిపోయింది.

ఇప్పటికీ దానికి సంబంధించిన 16 లక్షల రూపాయల బిల్లు కోసం, సదరు టీడీపీ నేత కాళ్లకు బలపాలు చుట్టుకుని అధికారుల చుట్టూ తిరుగుతున్నారట. చివరాఖరకు తేలిందేమిటంటే.. పనికి సంబంధించిన బిల్లు ఇచ్చేందుకు అభ్యంతరం లేదు గానీ.. జీవో తెచ్చుకోమని అధికారులు చావు కబురు చల్లగా చెప్పారట. ఇంకా ఇలాంటి గాథలు రాస్తే రామాయణం. చెబితే భారతమే అవుతుంది. ఈ క్రమంలో టీడీపీ అధికార ంలోకి వచ్చినప్పటికీ.. వైసీపీ కాంట్రాక్టర్ల బిల్లులు పంచకల్యాణి గుర్రం కూడా ఈర్ష్యపడేంత వాయువేగంతో క్లియర్ కావడం, టీడీపీ వర్గాలను విస్మయపడేందుకు కారణమవుతోంది.

అయితే.. తాజాగా ఆర్థికశాఖ క్లియర్ చేసిన 300 కోట్ల రూపాయల్లో పులివెందుల–నెల్లూరు వైసీపీ కాంట్రాక్టర్ల బిల్లులన్నీ వ్యూహాత్మకంగా క్లియర్ చేశారన్న ప్రచారం జరుగుతోంది. 300 కోట్ల బిల్లులన్నీ ఒకే హెడ్ కింద చూపించి క్లియర్ చేశారని చెబుతున్నారు. నిజానికి ఏ హెడ్స్‌కు సంబంధించి ఆ హెడ్స్ బిల్లులు పెట్టి క్లియర్ చేయడం ఆర్థికశాఖలో ఒక ఆనవాయితీ.

అయితే అన్ని పనులూ ఒకే హెడ్స్ కింద పెట్టి క్లియర్ చేయడంపై ఆశ్చర్యం వ్యక్తమవుతోంది. ఈ వ్యవహారం మీడియాలోకి వచ్చిన తర్వాత.. అన్నీ ఒకే హెడ్స్ కింద ఉన్నందున, తాము పులివెందుల బిల్లులు చూడలేదని సీఎంఓకు వివరణ ఇచ్చుకున్నారట. తానే వాటిని పాస్ చేశానని ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి అంగీకరించి, ఇకపై అలా జరగకుండా చూస్తానని వివరణ ఇచ్చుకున్నారట. పోనీ కాసేపు వారి వాదనే నిజమనుకుంటే.. బిల్లులు అప్‌లోడ్ చేసేముందు, హెడ్స్ వారీగా బిల్లులు తనిఖీ చేస్తారు. తర్వాతనే వాటిని క్లియర్ చేస్తుంటారు.

మరి పులివెందుల బిల్లులంటే.. అవి వైసీపీ నేతలకు చెందినవేనన్న విషయం మెడపై తల ఉన్న ఎవరికైనా అర్థమవుతుంది. అలాంటిది ఆర్థిక శాఖ అధికారులకు తెలియకపోవడమే వింత. పులివెందుల బిల్లులు కాబట్టి, దానిని సీఎంఓ దృష్టికి తీసుకువెళ్లాలన్న స్పృహ కూడా లేకపోవడం ఆశ్చర్యం.

విచిత్రంగా.. జగన్ జమానాలో పీఏసీ చైర్మన్‌గా ఉన్న పయ్యావుల కేశవ్.. బిల్లుల చెల్లింపులో అడ్డగోలు విధానం అమలుచేస్తున్నారని, బిల్లుల చెల్లింపులో మొదట వచ్చిన వారికి మొదట చెల్లించాలన్న (ఫిఫో) విధానం పాటించడం లేదని ధ్వజమెత్తారు. ఇప్పుడు అదే కేశవ్ ఆర్థికమంత్రిగా ఉన్నప్పుడే.. అదే ఫిఫోను అధికారులు విజయవంతంగా ఉల్లంఘించడమే ఆశ్చర్యం. అంతకుముందు పెండింగ్‌లో ఉన్న లక్షన్నరకోట్ల పెండింగ్ బిలులలు కాదని, వైసీపీకి చెందిన కాంట్రాక్టర్లకు 100 కోట్లు ఎలా క్లియర్ చేశారన్నదే టీడీపీ వర్గాల్లో రగులుతున్న ఆగ్రహం.

విశ్వసనీయ సమాచారం ప్రకారం.. ఈ బిల్లులను సత్య నారాయణ క్లియర్ చేశారని ఆర్థికశాఖ వర్గాలు చెబుతున్నాయి. ఆయన తిరిగి శాఖలో చేరిన తర్వాత, మళ్లీ పాత పనులే అప్పగించార ంటున్నారు. ప్రస్తుత కార్యదర్శి కార్యాలయంలో ఎక్కువసేపు ఉండటం లేదని, సీఎంఓ– ఆర్థికమంత్రితో సమావేశాలు, ఇతర అధికార పనుల కోసం వెళుతున్నారని చెబుతున్నారు. అందుకే బిల్లుల క్లియరెన్స్ పార్‌వర్డ్ కూడా సత్తెన్న చేతికే ఇవ్వడంతోపాటు, పాత పనులే తిరిగి పురమాయిస్తున్నా రన్న ప్రచారం జరుగుతోంది. విచిత్రంగా సత్యనారాయణ గతంలో మాదిరిగా, ఇప్పుడు కూడా అప్పుల పనిమీద రెగ్యులర్‌గా ముంబయిలోరి ఆర్‌బీఐకి వెళుతున్నారంటున్నారు. రేపు తాజాగా కొత్త మరో నాలుగువేల కోట్ల అప్పు కోసం కూడా సత్తన్న వెళుతున్నట్లు సమాచారం.

# మహిళలకు 45 నుంచి 50 సంవత్సరాల మధ్య జీవితం కీలకం

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి

**విజయవాడ,మహానాడు:** మహిళలకు 45 నుంచి 50 సంవత్సరాల మధ్య జీవితం ఎంతో కీలకమైందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి అన్నారు. పీరియడ్స్ ఆగిపోయిన క్రమంలో ఒత్తిళ్ళకు లోనవుతారని, ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యంగా ఉండటం వలన ప్రాణాంతక మైన వ్యాధుల బారిన పడతారని పేర్కొన్నారు. వాటిని అధిగమించేందుకు వైద్యుల సలహాలు సూచనలు పాటించాల్సిన అవసరముందన్నారు.

విజయవాడ మెనోపాజ్ సొసైటీ, విజయవాడ అబ్స్టెట్రిక్స్ గైనకాలజీ సొసైటీ ఆధ్వర్యంలో నగరంలోని ఎంబీవీకే భవన్ లో ఎస్.జె ఇమ్ స్కాన్ 2024 ను నిర్వహించారు. శని ఆదివారాలు రెండు రోజులపాటు జరిగిన సమావేశాలలో పలు అంశాలపై చర్చలు జరిగాయి. కార్యక్రమానికి ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి, టీడీపీ నాయకురాలు గద్దె అనురాధ హజరయ్యారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెలసరి ఆగిపోయే సమయంలో మహిళలు ఆరోగ్య పరంగా అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. శరీరంలో హార్మోన్లు తగ్గడం వలన ఒత్తిడికి లోనవుతారని, గుండెకు సంబందించిన సమస్యలు కూడా




వస్తాయన్నారు. అటువంటి సమయంలో వైద్యుల సలహాలు సూచనలు తీసుకోవడం ద్వారా మెనోపాజ్ దశను అధిగమించేందుకు ఉపయోగపడతాయన్నారు.

దీనిపై అవగాహన కల్పించేందుకు మెనోపాజ్ సొసైటీ చేస్తున్న కార్యక్రమాలు అభినందనీయమని చెప్పారు. అయితే గ్రామీణ స్థాయిలో మహిళలకు ఈ దశపై అవగాహన కల్పించేలా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రభుత్వంపై కూడా బాధ్యత ఉంటుందని, మహిళల కోసం అవగాహన కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరముందన్నారు.



# తెలంగాణ అగమాగం

(మొదటిపేజీ తరువాయి..)

బిక్కుబిక్కుమంటున్నారు. వారిని ఇళ్లకు పంపిస్తున్న పరిస్థితి. ఇక ఆంధ్ర–తెలంగాణ సరిహద్దు బీభత్సంగా మారింది. నల్లగొండ జిల్లా భీతావహంగా కనిపిస్తోంది. రాకపోకలు దాదాపు బందయ్యాయి. రోడ్లపై భారీ వృక్షాలు కూలిపోయి కనిపిస్తున్నాయి. అనేకచోట్ల విద్యుత్ స్తంభాలు నేలకూలిపోయాయి. ఖమ్మం జిల్లాలో అయితే ట్రాన్స్‌ఫార్మర్లు కూడా మునిగిన దృశ్యాలు కనిపిస్తున్నాయి.

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సమాచారశాఖమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న ఖమ్మం జిల్లాను భారీ వర్షం ముంచెత్తింది. రోడ్లకు అడ్డంగా కూలిపోయిన చెట్లతో రవాణా వ్యవస్థ స్తంభించింది. వరద నీరు ఇళ్లలోకి రావడంతో జనం హాహాకారాలు చేస్తూ రోడ్లపైకి వస్తున్నారు. తొలిసారిగా ఖమ్మంలో రోడ్లపైకి పడవలు వచ్చిన పరిస్థితి. డిప్యూటీ సీఎం







భట్టి శనివారం రాత్రి నుంచి అహర్నిశలు రోడ్డుపైనే పనిచేస్తున్నారు. రాజధాని నగరమైన హైదరాబాద్ యధా విధిగా నీటితో మునిగిపోయింది. ఫలితంగా గంటలపాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. శివారు ప్రాంతాలు ఇంకా నీటిలోనే మునిగిపోతూ కనిపిస్తున్నాయి.

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 33 గ్రామాలకు వెళ్లే రహదారులు దెబ్బతినగా.. కరీంనగర్‌లో 20 గ్రామాల రోడ్లు ధ్వంసమయ్యాయి. 20 గ్రామాలకు సంబంధాలు కట్ అయ్యాయి. మహబూబాద్లో 30గ్రామాలు, ఉమ్మడి మెదక్‌లో 8 గ్రామాలకు, నిజామాబాద్‌లో 7 గ్రామాలకు, నల్గొండలో 4 గ్రామాలకు వెళ్లే రహదారులు కొట్టుకపోయాయి. 117 గ్రామాలకు రాకపోకలు పూర్తి స్థాయిలో నిలిచిపోయాయి.

భారీ వర్షానికి ఇల్లు కూలడంతో తల్లీకూతుళ్లు మృతి చెందిన ఘటన నారాయణపేట జిల్లా కొత్తపల్లి మండలం ఎక్కమేడ్ గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకున్నది. ఖమ్మం జిల్లాలో ఎడతెరిపి లేని వర్షాలు కురుస్తున్నాయి. వర్షాలకు వరదగా వరద పోటెత్తుత్తున్నది. మున్నేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. దాంతో వాగు పరివాహకంలోని 15 కాలనీలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. రాజీవ్ గృహకల్ప, వెంకటేశ్వర్‌నగర్, మోతీనగర్, బొక్కలగడ్డ కాలనీతో పాటు పలు ప్రాంతాల్లోకి వరద పోటెత్తింది. కాలనీలో నీటమునగడంతో బాధితులు ఇండ్లపైకి చేరుకున్నారు. వరద చుట్టుముట్టడంతో బయటకు వెళ్లేందుకు అవకాశం లేకుండాపోయింది. ఇండ్లపై నుంచే రక్షించాలంటూ వరద బాధితులు ఆర్తనాదాలు చేస్తున్నారు.

ప్రభుత్వం బాధితులను ఆదుకోవడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపిస్తూ ఖమ్మం కాలువ ఒడ్డు వద్ద త్రీ టౌన్ ప్రాంత ప్రజలు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ములుగు జిల్లాలో గాలివాన బీభత్సం సృష్టించింది. రెండు రోజులుగా ఎడతెరిపిలేపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగి పొర్లు తున్నాయి. చెరువులు, కుంటలు అలుగు దుంకుతున్నాయి. పలు చోట్ల చెట్లు విరిగిపడి, కరెంట్ స్తంభాలు నేలకూడలంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వర్షాల కారణంగా తాడ్వాయి మండలం మేడారం రోడ్డులో ఆదివారం తెల్లవారుజామున వీచిన భారీ గాలులతో 33 కేవీ ఫీడర్‌కు వెళ్లే 11 కేవీ విద్యుత్తు లైన్లో 16 విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి.

భారీ వర్షాలకు సూర్యాపేట జిల్లా జాజిరెడ్డి గూడెం మండలం అర్వపల్లిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం జల దిగ్బంధమైంది. పాఠశాల ఆవరణ మొత్తం నడుం లోతు వరకు నీళ్లు నిలిచాయి. సుమారు 200 మంది విద్యార్థులు, ఉపాధ్యా యులు అడుగు బయటపెట్టలేని పరిస్థితి నెలకొనడంతో అధికారులతో ఆదేశాలతో తాత్కాలింగా విద్యార్థు లను అక్కడ నుంచి తరలించి శ్రీరామ ఫంక్షన్ హాల్‌లో సర్దుబాటు చేశారు. తల్లిదండ్రులకు సమాచారం అందించి కొందరిని ఇంటికి పంపించారు.

తెలంగాణ – ఏపీ మధ్య నిలిచిన వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. తెలంగాణ – ఏపీ సరిహద్దు రామాపురం వద్ద చిమిర్యాల వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. కోదాడ నుంచి వరదనీరు దిగువకు ప్రవహిస్తుంది. నల్లబండగూడెం వద్ద జాతీయ రహదారిపైకి నీరు చేరడంతో అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద భారీగా వాహనాలు నిలిచిపోయాయి.

ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం ఐతవరం గ్రామం వద్ద జాతీయ రహదారిపై మున్నేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. హైవేపై మోకాళ్ల లోతు వరద ఉండడంతో వాహనాల రాకపోకలను నిలిపివేశారు.

హైదరాబాద్‌లో ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తున్నది. నగరంలోని అనేక ప్రాంతాల్లో జోరుగా వర్షాలు పడుతున్నాయి. శనివారం ఉదయం నుంచి ఆగకుండా వవాన పడుతున్నది. సికింద్రాబాద్, బోయిన్‌పల్లి, అల్వాల్, తిరుమలగిరి, చిలుకల గూడ, మారేడుపల్లి, ప్యాట్నీ, ప్యారడైజ్, బేగంపేట, బొల్లారం, జవహర్‌నగర్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజాగుట్ట, ఖైరతాబాద్, అమీర్‌పేట, ఎస్ఆర్ నగర్, కూకట్‌పల్లి, కొండాపూర్, కొంపల్లి, హైదర్‌నగర్, ఆల్విన్ కాలనీ, నిజాంపేట, హైదర్‌నగర్, ఆల్విన్‌కాలనీ, మెహిదీ పట్నం, నాంపల్లి, మలక్‌పేట, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్, వనస్థలిపురం, హయత్‌నగర్, బీఎన్‌రెడ్డి, ఉప్పల్, ఈసీఎల్, సరూర్‌నగర్, సైదాబాద్, చంపాపేట్, మలక్‌పేట్‌లో భారీగా వర్షం పడుతున్నది. ఇక రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీపట్నం, మంచాల, యాచారంలో వాన కురుస్తున్నది. వర్షాలకు ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. చంపాపేట, రెడ్డి కాలనీతోపాటు పలు కాలనీల్లో రోడ్లపై వర్షపు నీరు నిలిచిపోయాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జంట జలాశయాలు ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్‌కు భారీగా వరద నీరు వచ్చి చేరుతున్నది. మూసీ నదికి వరద పోటెత్తింది.

మూసారంబాగ్ బ్రిడ్జిని తాకుతూ వరద ప్రవహిస్తున్నది. హుస్సేన్ సాగర్‌లోకి పెద్దఎత్తున వరద వచ్చి చేరుతున్నది. దీంతో అధికారులు గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. కూకట్‌పల్లి, అల్లాపూర్ ప్రాంతాల్లో 20 ఇండ్లు నీటి మునిగాయి. వానకు తోడు బలంగా వీచిన గాలులతో గ్రేటర్ వ్యాప్తంగా 115 చోట్ల చెట్లు విరిగిపడ్డాయి.

మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం తాళ్లపూసపల్లి, ఇంటికన్నె మధ్య రైల్వేట్రాక్ కింద మట్టి కోతకు గురైంది. పట్టాల కింద నుంచి భారీగా వరద ప్రవహిస్తున్నది. ఈ క్రమంలో ఆ మార్గంలో అధికారులు రైళ్ల రాకపోకలను నిలిపివేశారు. వర్షాల నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే పరిధిలో దాదాపు 40 రైళ్లు వరకు రద్దయ్యాయి. అదే సమయంలో పెద్ద ఎత్తున రైళ్లను అధికారులు దారి మళ్లించారు.



3
జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ ‖ సోమవారం 02, సెప్టెంబర్ 2024

## ఎమ్మెల్యే తాతయ్య చొరవతో
# బయటపడ్డ విద్యుత్ శాఖ సిబ్బంది



జగ్గయ్యపేట,మహానాడు:

గత రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఏర్పడిన విద్యుత్ అంతరాయాన్ని మెరుగు పరచడానికి వెళ్లిన విద్యుత్ శాఖ సిబ్బందిని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య చొరవతో బయటకు తీసుకురడం జరిగింది.

ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట నియోజకవర్గం, వత్సవాయి మండలం లింగాల గ్రామం వద్ద మునేర్ వరదకు విద్యుత్ అంతరాయం ఏర్పడడంతో విద్యుత్ శాఖ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మరమ్మతులు చేపట్టారు. ఇదే సమయంలో మునేరు వరద పెరగటంతో లింగాల చిట్యాల గ్రామాల మధ్యలో ఇరుక్కుపోవడం జరిగింది.

స్థానికులు విషయాన్ని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్యకి తెలపడంతో తాతయ్య హుటాహుటిన సంఘటనా స్థలాన్ని చేరుకుని, తమ ట్రాన్స్పోర్ట్ నుండి లారీని పంపించి జగ్గయ్యపేట మండలం రావిరాల గ్రామానికి చెందిన పడవ మరియు గజ ఈతగాళ్లను రప్పించారు వారితో పాటు ఫైర్ సిబ్బంది కలిసి పడవ ద్వారా మున్నేరులో ఇరుక్కుపోయిన విద్యుత్ శాఖ సిబ్బందిని తీసుకురావడం జరిగింది.

మునేర్ వరదలో ఇరుక్కుపోయిన విద్యుత్ శాఖ సిబ్బందిని బయటకు తీసుకు రావటంలో చొరవ చూపిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్యకి స్థానికులు, విద్యుత్ శాఖ సిబ్బంది ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# వర్షాలు తగ్గిన తదుపరి పూర్తి స్థాయిలో ఇసుక సరఫరా

- రాష్ట్రంలో అందుబాటులో ఉన్న ఇసుక 15,03,603 మెట్రిక్ టన్నులు
- భారీ వర్షాల కారణంగా ఇసుక సరఫరాలో అంతరాయం
- గనులు, అబ్కారీ శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా



అమరావతి,మహానాడు:

రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలు, వరదనీటి కారణంగా ఇసుక సరఫరాలో నెలకొన్న అంతరాయాన్ని అతి త్వరలో పునరుద్దరిస్తామని వాణిజ్య పన్నుల శాఖ ఛీఫ్ కమీషనర్, గనులు, అబ్కారీ శాఖ ముఖ్య కార్యదర్శి, ముఖేష్ కుమార్ మీనా తెలిపారు. వివిధ రీచ్‌ల నుండి సరఫరా నిలిచి పోయిందని, వర్షాలు తగ్గుముఖం పట్టి, రవాణా పరిస్థితులు మెరుగైన తురువాత పూర్తి స్థాయిలో ఇసుక సరఫరా కొనసాగుతుందన్నారు.

సోమవారం నాటికి 39 ఇసుక నిల్వ కేంద్రాలలో 15,03,603 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందన్నారు. అదివారం 7,305 మెట్రిక్ టన్నుల ఇసుక కోసం రాష్ట్ర వ్యాప్తంగా 566 ధరఖాస్తులు అందాయన్నారు. వీరిలో ఐదుగురు మినహా, 561 ధరఖాస్తుదారులకు 7,275 మెట్రిక్ టన్నుల ఇసుకను సరఫరా చేసామన్నారు. పలు చోట్ల రహదారులు దెబ్బతిన్న పరిస్థితిలో వినియోగదారులు తమవంతు సహకారం అందించాలని ముఖేష్ కుమార్ మీనా తెలిపారు

# 50 మంది కాపరులు,
# 3,501 జీవాలను కాపాడిన అధికార యంత్రాంగం

- ప్రాణాల మీదకు తెచ్చిన బ్రతుకుతెరువు
- నెలల తరబడి లంకల్లో జీవాలను మేపుకునే కాపరులు
- రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో లంకలు ముంపుకు గురయ్యే పరిస్థితి
- బిక్కుబిక్కుమంటున్న వారిని సురక్షిత ప్రాంతాలకు చెరవేత

పల్నాడు జిల్లా,మహానాడు:


అమరావతి, వైకుంఠపురం, గిడుగు, పొందుగల, మునుగోడు, పల్నాడు జిల్లా, అమరావతి మండలంలో కృష్ణా నది ఒడ్డున ఈ గ్రామాల లంకలు పచ్చని బయల్లకు ప్రసిద్ధి. బోట్లలో వందల సంఖ్యలో లంకల్లోకి జీవాలను తోలుకు వెళ్లి నెలల తరబడి అక్కడే నివాసం ఏర్పరుచుకుని జీవనం సాగించే కుటుంబాలకు ఆ గ్రామాలు నెలవుగా మారాయి. బ్రతుకుదెరువులో భాగమైన ఆ అలవాటే వారి ప్రాణాల మీదకు తెచ్చింది.

20 రోజుల కిందట ఈ గ్రామాలకు చెందిన 36 మంది 1500 జీవాలను తోలుకుని లంకలకు చేరి అక్కడే వంటా వార్పు చేసుకుంటూ గడుపుతున్నారు. అయితే రెండు రోజుల ఎడతెరిపిలేని వర్షాలతో క్రమ క్రమంగా నీటి మట్టం పెరిగింది. 7 లక్షల క్యూసెక్కుల నుంచి 8 లక్షల క్యూసెక్కుల స్థాయికి నీరు చేరింది. మరో రెండు రోజులు వర్షాలు భారీ వర్షాలున్నాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. ఈ పరిస్థితుల్లో వారిలో భయం మొదలైంది.

అచ్చంపేట మండలం కొనూరు, కస్తాల, చామ్రు గ్రామాలకు చెందిన 14 మంది కాపరులు, 2001 జీవాలది కూడా ఇదే పరిస్థితి. విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు, ఎస్పీ శ్రీనివాస రావు, పెదకూర పాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ లు రంగంలోకి దిగారు. స్థానికంగా అమరావతి బోట్ సెంటర్, అచ్చంపేట కస్తాల మరియు కృష్ణా జిల్లా గనత్ పూర్ బోట్ సెంటర్ల నుంచి 22 బోట్లను సమీకరించారు. ఒక్కోసారి 30 నుంచి 50 జీవాలను మాత్రమే తీసుకు రాగలిగే అవకాశం ఉండగా ఒక బోటు ఇటు వెళ్లి అటు రావడానికి కనీసం 2 గంటలు పడుతుంది. జీవాలను బోటులో ఎక్కించే సమయం, ప్రయాస అదనం. సగటున ఒక్కో బోటును 4 ట్రిప్పులు నడిపి, 10 గంటలకు పైగా పర్యవేక్షిస్తూ అందరినీ సురక్షిత ప్రాంతాల్లోకి తీసుకు రావడం జరిగింది.

# పంట నష్టం అంచనా వేయండి

- పంట నష్టం అదుపు చేసేందుకు ప్రత్యేక చర్యలు వేగవంతం చేయండి
- డ్రెయిన్ కాలువలు క్లియర్ చేసి నీటి నిల్వలు మళ్లించండి
- పశువులు మృత్యువాత పడకుండా అధికారులు, సిబ్బంది మందులతో అందుబాటులో ఉండాలి
- వ్యవసాయ, పశుసంవర్ధక, మత్స్య శాఖల కాల్ సెంటర్లు కొనసాగించండి
- వ్యవసాయ అనుబంధ శాఖల సిబ్బంది సెలవులు పెట్టకండి
- రాష్ట్ర వ్యవసాయ శాఖామాత్యులు కింజరాపు అచ్చెన్నాయుడు



అమరావతి,మహానాడు:

రాష్ట్ర వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల వల్ల ఏర్పడే పంట నష్టం అంచనా వేయాలని, పంట నష్టం అదుపు చేసేందుకు ప్రత్యేక చర్యలు వేగవంతం చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు.

ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు మార్లు వ్యవసాయ, పశుసంవర్ధక, మత్స్య శాఖల అధికారులతో మంత్రి అచ్చెన్నాయుడు అత్యవసర సమీక్షలు నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ డ్రెయిన్ కాలువలు క్లియర్ చేసి నీటినిల్వలు మళ్లించాలని, వరద కారణంగా మృతి చెందిన పశు ససంపద నష్టం అంచనా వేయాలని పేర్కొన్నారు.

వర్షాలకు ప్రాథమిక అంచనా ప్రకారం రాష్ట్రంలో గేదెలు, ఆవులు - 14, కోళ్లు- 5000, గొర్రెలు ,మేకలు-4 మృతి చెందినట్లు అధికారులు మంత్రి అచ్చెన్నాయుడు గారికి తెలియచేశారు. పశువులు మృత్యువాత పడకుండా అవసరం మేరకు అధికారులు, సిబ్బంది మందులతో వరద ప్రాంతాల్లో అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

ఏలూరు, పల్నాడు జిల్లాలో కొంత మేర ఇన్ లాండ్ చెరువులకు, పడవలు, నెట్ లకు నష్టం వాటిల్లిందని మత్స్య అధికారులు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 29,259 పడవలు సముద్రంలో వేటకు వెళ్లకుండా ఒడ్డునే ఉన్నాయని వెల్లడించారు.

ఈ నేపథ్యంలో వ్యవసాయ, పశుసంవర్ధక, మత్స్య శాఖల కాల్ సెంటర్లు కొనసాగించాలని, ఆయా జిల్లాల కాల్ సెంటర్ల ద్వారా ఎప్పటికప్పుడు రైతులకు, మత్స్యకారులను సూచనలు ఇవ్వాలని, నష్టం అదుపు చేసేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు.

పరిస్థితి అదుపులోకి వచ్చే వరకు వ్యవసాయ అనుబంధ శాఖల సిబ్బంది సెలవులు పెట్టకుండా రైతులకు అండగా నిలవాలని కోరారు. ముంపునకు గురయిన పంటల పునరుద్ధరణకు పంట సలహాలు మరియు తెగుళ్లు & వ్యాధుల సూచనాత్మక నియంత్రణ చర్యలు చేపట్టవలసినదిగా ఆదేశాలు జారీ చేశారు.

రైతు సేవా కేంద్రం (గ్రామం), మండల, జిల్లా స్థాయి అధికారులు పంట క్షేత్రాలను పరిశీలించాలన్నారు. పొలాల్లోని అదనపు నీటిని బయటకు తీయడానికి మరియు పంట నష్టాన్ని తగ్గించడానికి దారులను సిద్ధం చేయాలని, ముంపు ప్రాంతాల్లో అత్యవసర సేవల్లో అవసరం మేరకు ఇతర శాఖలకు వ్యవసాయ అనుబంధ శాఖల సిబ్బంది సహాయ సహకారాలు అందించాలని సూచించారు.

# చరిత్ర ఉన్నంతవరకూ నిలిచే నేత చంద్రబాబు

- తెలంగాణ టీడీపీ నేతల అభినందన

హైదరాబాద్,మహానాడు:

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు 1995 సెప్టెంబర్ 1వ తేదిన మొట్టమొదటిసారిగా ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసి 29 సంవత్సరాలు పూర్తి చేసుకుని 30వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన సదర్భంగా తెలుగు ప్రజలకు శుభాకాంక్షలను తెలియజేస్తూ - ఎన్‌టిఆర్ భవన్‌లో తెలంగాణ తెలుగుదేశం పార్టీ నాయకులు వేడుకను నిర్వహించారు.

ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు కేక్‌ను కట్ చేశారు.

ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న పొలిట్‌బ్యూరో సభ్యులు, జాతీయ పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు మాట్లాడుతూ... తెలుగు రాష్ట్రాలలో ఎక్కువ కాలం ముఖ్యమంత్రిగా పరిపాలించిన ఏకైక నాయకుడు చంద్రబాబు . సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్నప్పటికీ చంద్రబాబు గారు ఇంకా నిత్యవిద్యార్థే. ఇదే ఆయన గొప్పతనం.

ముఖ్యమంత్రిగా, ప్రతిపక్ష నాయకునిగా, చంద్రబాబు అనేక కష్టాలను మోసారని అన్నారు. మహాత్మాగాంధి దేశంలో గ్రామ స్వరాజ్యం వచ్చిన నాడే దేశం సుభిక్షంగా ఉంటుందని అన్నారు. సచివాలయాన్ని గ్రామ ప్రజల గుమ్మముందుకు తీసుకెళ్లిన నాయకుడు చంద్రబాబు నాయుడు . జన్మభూమి, ప్రజల వద్దకు పాలన, శ్రమదానం వంటి ఎన్నో కార్యక్రమాలను తీసుకొచ్చారు. మహాత్మాగాంధీ విగ్రహాన్ని శాసనసభలో పెట్టించిన ఘనత చంద్రబాబుది.

బ్రిటిష్ వారు సికింద్రాబాద్‌ను నిర్మిస్తే చంద్రబాబు ఆర్థిక నగరంగా సైబరాబాద్‌ను నిర్మించారు. పూడిక తీసే కార్యక్రమం ద్వారా చెరువులను బాగు చేసిన మహనీయుడు చంద్రబాబు. లక్షా 25 వేల పెండిరగ్ ఫైళ్ళను పరిష్కరించిన పాలకుడిగా చంద్రబాబు ఖ్యాతి గడిరచారు అని అన్నారు. పున్నయ్య కమిషన్‌ను వేసి ఆ కమిషన్ సిఫారసు చేసిన 42 అంశాలను చంద్రబాబు కాబినెట్ ఆమోదించింది.

వీటి అమలులో భాగంగా మెదక్ జిల్లాలోని పెద్దిరెడ్డిపేటలో దేశంలోనే మొట్ట మొదటిసారిగా అంటరానితనం నిర్మూలన కార్యక్రమాన్ని అమలు చేశారని అన్నారు. ఎబిసిడి వర్గీకరణ అమలుకు మూలం చంద్రబాబు అని అన్నారు. ఈ వర్గీకరణను ఇటీవల సుప్రీం కోర్టు క్లియర్ చేసిందని అన్నారు.

రాబోయే రోజులలో అందరం సభ్యత్వ కార్యక్రమంపై దృష్టి పెట్టి విజయవంతం చేద్దాం అని అన్నారు.

జాతీయపార్టీ అధికార ప్రతినిధి, నన్నూరి నర్సిరెడ్డి మాట్లాడుతూ... చంద్రబాబు విద్యార్థిగా, విద్యార్థి నాయకునిగా, గోల్డ్ మెడలిస్ట్‌గా, ఎమ్మెల్యేగా, మంత్రిగా, ప్రతిపక్షనాయకుడిగా, ముఖ్యమంత్రిగా చరిత్ర సృష్టించిన నాయకుడు నారా చంద్రబాబు నాయుడు. ఆరోగ్య రంగంలో, ఫార్మా రంగంలో, అభివృద్ధిలో,



ఇంటర్నెట్‌లో, ఐటిలో,ఈ రాష్ట్రం అగ్రగామిగా నిలబడుతున్నదంటే అది చంద్రబాబు గతంలో చేసిన కృషి ఫలితమే అని అన్నారు.

మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర పార్టీ నాయకురాలు, కాట్రగడ్డ ప్రసూన మాట్లాడుతూ...ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో, ఇప్పుడు నవ్యాంధ్ర ప్రదేశ్‌లో ముఖ్యమంత్రిగా, అలాగే జాతీయ రాజకీయాలలో తన కంటూ ఒక ప్రత్యేక ముద్రను వేసిన నాయకుడు చంద్రబాబు అని అన్నారు. ఆయన నిగర్వి, పేదరిక నిర్మూలన కొరకు పాటు పడుతున్న వ్యక్తి. ఆయన ప్రతికల ఈ దేశంకోసం, ప్రజలకోసం అని అన్నారు. ఆయన ఆయురారోగ్యాలతో మరిన్ని సంవత్సరాలు ప్రజలకు సేవ చేయాలని ఆ భగవంతున్ని ప్రార్థిస్తున్నానని అన్నారు.

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు, సామా భూపాల్ రెడ్డి మాట్లాడుతూ... చంద్రబాబు పాలనను ముక్కోటి దేవతలు దీవిస్తున్నారని అన్నారు. చంద్రబాబు చరిత్ర, ఆయన నాయకత్వం గురించిఎంత చెప్పినా తరగదని అన్నారు. బావి తరాలకు బాటలు వేసే విధంగా చంద్రబాబు పని చేస్తారని అన్నారు. ఆయన చేసిన అభివృద్ధి ఫలాలను ఇప్పుడు మనం అనుభవిస్తున్నామని అన్నారు. ఏ తరం వారికైనా అయినా ఆదర్శ పాలనగా చంద్రబాబు పాలన నిలుస్తుందని అని అన్నారు.

ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు భవనం షకీలా రెడ్డి, అజ్మీరా రాజునాయక్, నెల్లూరి దుర్గ ప్రసాద్, మ్యాడం రామేశ్వర్‌రావు, శ్రీనివాసా నాయుడు, సూర్యదేవర లత, వేజెండ్ల కిషోర్ బాబు, సుజాత, శ్రీశ్శైలం మహానంది, శ్రీపతి సతీష్ కుమార్, పోలంపల్లి అశోక్, కుందారపు కృష్ణా చారి, కందికంటి అశోక్ కుమార్‌గౌడ్ లు పాల్గొని ప్రసంగించారు. నాయుడు కోటేశ్వర రావు, కొడగండ్ల మోహన్ రెడ్డి, రాధిక, వాసిరెడ్డి స్వేత, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# విపత్తుపై కేంద్రంతో సీఎం సంప్రదింపులు

- హెూం మంత్రి అమిత్ షాతో మాట్లాడిన చంద్రబాబు
- నేటినుంచి రంగంలోకి హెలికాప్టర్లు, ఎన్డీఆర్ఎఫ్ టీమ్‌లు



అమరావతి, మహానాడు:

భారీ వర్షాలు, వరదలు రాష్ట్రాన్ని అల్లకల్లోలం చేస్తున్న తరుణంలో సాయానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదివారం కేంద్రంతో సంప్రదింపులు జరిపారు. ఇందులో భాగంగా హెూం మంత్రి అమిత్ షాతో మాట్లాడారు. అనంతరం కేంద్ర హెూం సెక్రటరీతో చర్చించారు. వరద ప్రాంతాల్లో సహాయక చర్యల కోసం అత్యవసరంగా పవర్ బోట్లు రాష్ట్రానికి తెప్పించే అంశంపై మాట్లాడారు. ఆరు ఎన్డీఆర్ఎఫ్ టీమ్ లు ఇతర రాష్ట్రాల నుండి తక్షణమే ఏపీకి పంపుతున్నట్టు హెూం సెక్రటరీ తెలిపారు. ఒక్కో ఎన్డీఆర్ఎఫ్ టీమ్ లో 25 మంది సిబ్బంది, ఒక్కో టీమ్ కు నాలుగు పవర్ బోట్లు ఉంటాయని సీఎంకు తెలిపారు. ఇవన్నీ సోమవారం ఉదయంలోపు విజయవాడకు చేరుకుంటాయని హెూం సెక్రటరీ తెలిపారు. మొత్తం 40 పవర్ బోట్లు రాష్ట్రానికి పంపుతున్నట్టు చెప్పారు. వాయు మార్గంలో మరో నాలుగు ఎన్డీఆర్ఎఫ్ టీమ్‌లను రాష్ట్రానికి పంపుతున్నట్టు, సహాయక చర్యలకు ఆరు హెలికాప్టర్లు పంపుతున్నట్టు హెూం సెక్రటరీ తెలిపారు. దీంతో నేటి నుంచి రంగంలోకి హెలికాప్టర్లు, ఎన్డీఆర్ఎఫ్ టీమ్ లు దిగనున్నాయి.

# నేటి విజయవాడ వరదలు.. నాటి జగన్ రెడ్డి పాపాలు!

(రమణ, మచిలీపట్నం)

విజయవాడలో ఈ స్థాయి వరదలు గతంలో రాలేదు.. గత 5 ఏళ్ళ జగన్ రెడ్డి పాలనలో వర్షాలే లేవు కాబట్టి, ఇబ్బందులు తెలియ లేదు. ఈ సారి వర్షాలు బాగా పడటంతో, గత 5 ఏళ్ళలో జగన్ రెడ్డి చేసిన బాగోతాలు బయటపడ్డాయి. ఈ రోజు విజయవాడలో ఈ స్థాయి వరదలకు రెండు కారణాలు.. ఒకటి సరైన అండర్ గ్రౌండ్ డ్రైన్స్ లేకపోవటం, రెండు బుడమేర కట్ట తెగటం.. విజయవాడ నగరంలో మూడు కాలువలు ఉంటాయి.. వాటి నిర్వహణ గత 5 ఏళ్ళలో చేసింది లేదు. గత టీడీపీ హయాంలో విజయవాడలో ఎల్ అండ్ టీ సహకారంతో స్టార్మ్ వాటర్ డ్రైన్ ప్రాజెక్ట్ మొదలు పెట్టారు. పనులు దాదాపుగా 50% అయ్యాయి. పనులు సగంలో ఉండగానే జగన్ రెడ్డి వచ్చారు, ఎక్కడ పనులు అక్కడ ఆపేయమని ఆదేశాలు ఇచ్చారు.

రహదారులు, డ్రెయిన్లు వర్షపునీటితో ఏకమయ్యాయి. పలు ప్రాంతాల్లో వర్షపునీరు 2-6 అగుడుల ఎత్తున నిలిచిపోయింది. శివారు ప్రాంతాలు, కాలనీలు పూర్తిగా నీటమునిగాయి. అనేక ఇళ్ళల్లోకి వర్షం నీరు చేరడంతో పలు కుటుంబాలు ఖాళీచేసి బంధువులు, స్నేహితుల ఇళ్ళలో తలదాచుకునే పరిస్థితులు నెలకొన్నాయి. సమస్య తీవ్రతకు అనేక లోపాలు కొట్టొచ్చినట్టు కనిపిస్తుండగా, పరిష్కరించేందుకు పాలకులు, అధికారులు ఏమాత్రం ప్రయత్నాలు చేయడం లేదు. వారికి నచ్చిన ప్రాంతాల్లో సాధారణ నిధులతో కొంత చేపట్టినా, ఇప్పటికీ అసంపూర్తిగా మిలిగి సమస్యను అధికం చేస్తున్నాయి. భూగర్భ డ్రెయినేజీ అస్తవ్యస్తంగా ఉంది. అవుట్‌ఫాల్ డ్రెయిన్లు సక్రమంగా లేవు. అంతర్గ డ్రెయిన్లు ధ్వంసమయ్యాయి. ఫలితంగానే వర్షపునీరు ముందుకు సాగని పరిస్థితి నెలకొంది.

ఇక రెండోది బుడమేరు .. నగరం వెంట పారుదలయ్యే



బుడమేరు గత 5 ఏళ్ళుగా ఆక్రమణలకు గురయ్యింది. ఇష్టం వచ్చినట్టు కాలువ కబ్జా చేసి, వైసీపీ నేతలు అమ్ముకున్నారు. బుడమేరు కుంచించుకుని పోయింది. ఫలితంగానే, ఈ రోజు విజయవాడకు ఈ స్థాయి వరద.

జగన్ రెడ్డి పాపాలు, భావితరలాకు శాపాలుగా మారాయి. ఇప్పుడున్న ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకొకపోతే , ఇక ప్రతి వర్షా కాలం, ఇలాగే హైదరాబాద్ లా ఇబ్బందులు పడాల్సిందే..

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
4
డిజిటల్ న్యూస్ పేపర్ ‖ సోమవారం 02, సెప్టెంబర్ 2024

## గుడ్లవల్లేరు విద్యార్థినులతో కోడూరు ఎస్ఐ అనుచిత ప్రవర్తన


- సీఎం ఆగ్రహం
- ఆమెను వీఆర్‌కు పంపిన అధికారులు

**అమరావతి, మహానాడు:**

గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజ్‌లో రహస్య కెమేరాల అంశంపై విచారణ జరుగుతోంది. ఈ విచారణను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయంగా ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు. ఎస్పీ, కలెక్టర్‌లతో మాట్లాడి విచారణపై సమీక్ష చేస్తున్నారు. ఈ ఘటనపై ఇన్ వెస్టిగేషన్ ఆఫీసర్‌గా సిఐ రమణమ్మను ఎస్పీ నియమించారు.

ఆమె నేతృత్వంలో విచారణ జరుగుతుండగా....బందోబస్తు కోసం పలు ప్రాంతాల నుంచి మహిళా పోలీసు అధికారులను, సిబ్బందిని నియమించారు. ఈ సమయంలో కోడూరు ఎస్ఐ శిరీష విద్యార్థినులతో అనుచితంగా ప్రవర్తించిన వీడియో వెలుగు చూసింది. ఆ పోలీసు అధికారి తీరుపై ముఖ్యమంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. బాధలో, ఆందోళనలో ఉన్న విద్యార్థినులతో అధికారులు దురుసుగా ప్రవర్తించడం మంచిది కాదని... ఇలాంటి పోకడలను సహించేదిలేదన్నారు. ఘటనపై పోలీసు ఉన్నతాధికారలు నుంచి వివరణ కోరారు.

దర్యాప్తు బృందంలో ఎస్ఐ శిరీష లేరని...బందోబస్తు కోసం పిలిపించామని అధికారులు వివరించారు. ఆమెను ఆ ప్రాంతంలో బందోబస్తు విధుల నుంచి ఇప్పటికే తప్పించామని



తెలిపారు.

కోడూరు ఎస్ఐగా ఉన్న శిరీషను వీఆర్‌కు పంపు తున్నట్టు ఉన్నతాధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. స్టూడెంట్స్ ఆవేదనను అర్థం చేసుకుని...వారికి భరోసా ఇచ్చేలా అధికారులు వ్యవహరించాలని ముఖ్యమంత్రి సూచించారు.

## 'నూజివీడు' ఫుడ్ కాంట్రాక్టర్లపై క్రిమినల్ చర్యలు

- ఫుడ్ కోర్టు మూసివేత
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి
- విద్యాశాఖ మంత్రి లోకేష్ ఆదేశాలు

**అమరావతి, మహానాడు:**

కలుషితాహారం ఘటనపై విచారణ కమిటీ సిఫారసుల మేరకు నూజివీడు ట్రిపుల్ ఐటిలో ప్రస్తుతం కేటరింగ్ సేవలు అందిస్తున్న M/S. ఫైన్ క్యాటరింగ్ సర్వీసెస్, M/S. అనూష హాస్పటాలిటీ సేవలను తక్షణమే రద్దుచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వారిపై క్రిమినల్ చర్యలకు విద్య, ఐటి శాఖ మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఆ సంస్థలు రాష్ట్రవ్యాప్తంగా మరే ఇతర టెండర్లలో పాల్గొనకుండా బ్లాక్ లిస్టు చేయాలని నిర్ణయించింది. కొత్త కాంట్రాక్టర్లను నియమించే వరకు విద్యార్థులందరికీ ఆహారాన్ని అందించడానికి తాత్కాలికంగా M/S KMK క్యాటరింగ్ సేవలను ఉపయోగించుకోవాలని నూజివీడు ట్రిపుల్ ఐటి అధికారులకు ప్రభుత్వం సూచించింది.



క్యాటరింగ్ కోసం కొత్త టెండర్ల ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని ప్రభుత్వం పేర్కొంది. కమిటీ సిఫారసు మేరకు నూజివీడు ట్రిపుల్ ఐటిలోని ఫుడ్‌కోర్టును తక్షణమే మూసివేయాలని ప్రభుత్వం ఆదేశించింది. పెండింగ్‌లో ఉన్నఫుడ్ కోర్టు అద్దెను రెండు వారాల్లోగా ఏజెన్సీ నుంచి వసూలు చేయాలని, చెల్లించని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని బయటి ఆహారాన్ని క్యాంపస్‌లోకి అనుమతించవద్దని మంత్రి లోకేష్ ట్రిపుల్ ఐటి అధికారులను ఆదేశించారు.

ఫుడ్ కోర్టుకు సంబంధించిన కొత్త టెండర్ల ప్రక్రియను వారం రోజుల్లో ప్రారంభించాలని మంత్రి అధికారులకు సూచించారు. అప్పటి వరకు రాష్ట్రంలోని ప్రముఖ ఫుడ్ చెయిన్ల నుంచి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని మంత్రి లోకేష్



పేర్కొన్నారు.

### విచారణ కమిటీ నివేదికలో కీలకాంశాలు

నూజివీడు ట్రిపుల్ ఐటిలో కలుషితాహారం తిని పెద్దసంఖ్యలో విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనపై ప్రభుత్వం నియమించిన విచారణ కమిటీ ప్రాథమిక నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. కమిటీ సభ్యులు మెస్, హాస్టల్ ప్రాంగణాలను తనిఖీలు చేశారు. ట్రిపుల్ ఐటిలో క్యాటరింగ్ సేవలు నిర్వ హిస్తున్న M/S. ఫైన్ కేటరింగ్ సర్వీసెస్, M/S.అనూష హాస్పటల్ సర్వీసెస్ సంస్థలు కళాశాలలో ఆరు డైనింగ్ హాళ్ళలో ఆహారాన్ని అందిస్తుండగా, వారిపై గతంలోనే పలు ఫిర్యాదులు అందాయి. ఇప్పటికే ఆహార నాణ్యతపై M/s ఫైన్ క్యాటరర్స్‌కు మూడు నోటీ సులు జారీ చేసినా తీరు మారలేదు. మెస్ కమిటీలు సూచించిన లోపాలను వెంటనే సరిదిద్దాలని ఆదేశించినా నిర్వాహకులు వాటిని పెడచెవిన పెట్టారు.


### నిరంతర పర్యవేక్షణకు ఆదేశాలు

నూజివీడు ట్రిపుల్ ఐటిలో పరిస్థితులు చక్కపడేవరకూ ఆర్డీవో నిరంతరం పర్యవేక్షణ చేయాలని, విద్యార్థులతో నిత్యం మాట్లాడుతూ ఎటువంటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి లోకేష్ ఆదేశాలు జారీ చేశారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు జరగకుండా విద్యార్థుల అస్వస్థత కు కారణం అయిన క్యాటరింగ్ సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని లోకేష్ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.

## భారీ వర్షాలు.. డిప్యూటీ సీఎం పర్యటన అర్ధాంతరంగా ముగింపు

**హైదరాబాద్, మహానాడు:**

రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాల నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కరీంనగర్ జిల్లా పర్యటనను అర్ధాంతరంగా ముగించుకున్నారు. అక్కడ నుంచి హుటాహుటిన బయలు దేరిన



శనివారం అర్ధరాత్రి మధిర నియోజకవర్గం చేరుకున్నారు.

అర్ధరాత్రి 2 గంటల సమయంలో మధిర మండలం వంగవీడు గ్రామం బుగ్గ వాగు వద్దకు చేరుకున్న ఉప ముఖ్యమంత్రి.. బుగ్గ వాగు మధ్యలో వరద నీటిలో చిక్కుకున్న వెంకటేశ్వర్లను బయటకు తీసుకువచ్చే సహాయకార్యక్రమాలను దగ్గరుండి మరీ పర్యవేక్షించారు. అధికారులకు ఎప్పటికప్పుడు తగిన సూచనలు చేస్తూ.. వెంకటేశ్వర్లును వరద నీటి నుంచి రక్షించారు.

భారీ వర్షాల నేపథ్యంలో మధిర నియోజకవర్గంలో పరిస్థితులను ఎప్పటికప్పుడు ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తూ తీసుకోవాల్సిన జాగ్రత్తలు తగిన సూచనలను అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఉదయం నుంచి వివిధ అధికారిక కార్యక్రమాల్లో పాల్గొన్నా.. ఎక్కడా ఒకింత అలసట లేకుండా, విశ్రాంతి తీసుకోకుండా.. అర్ధ రాత్రి కూడా వరద ప్రాంతాల్లో ఉప ముఖ్యమంత్రి పర్యటించి ప్రజల బాగోగులు తెలుసుకున్నారు. అర్ధరాత్రి మూడు గంటల సమయంలో వరద ప్రభావిత ప్రజల కోసం ఏర్పాటు చేసిన క్యాంప్‌ను పరిశీలించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క. క్యాంపులో ఉన్న ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు.



### తీగలేరు వాగు ఉధృతిని పరిశీలించిన ఎరిక్షన్ బాబు

చిన్నదోర్నాల గ్రామంలోని తీగలేరు వాగును యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు పరిశీలించారు. రాకపోకలకు స్పంభించాయని తహసీల్దార్ తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వాగును ఎవరు దాటకుండా చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. 24 గంటలు అధికారులు పర్యవేక్షణ చేస్తుండాలని ఎరిక్షన్ బాబు అధికారులను కోరారు.

### పార్టీ ముఖ్యనేతలు, మంత్రులు, ఎంపీలు, గ్రామస్థాయి కార్యకర్తలతో


## సీఎం చంద్రబాబు నాయుడు టెలీకాన్ఫరెన్స్

- వరద బాధితులకు సాయం అందించాలని పార్టీ శ్రేణులకు బాబు పిలుపు

**అమరావతి, మహానాడు:**

తెలుగుదేశం పార్టీ(టీడీపీ) ముఖ్యనేతలు, మంత్రులు, ఎంపీలు, గ్రామస్థాయి కార్యకర్తలతో సీఎం చంద్రబాబు నాయుడు ఆదివారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద బాధితులకు సాయం అందించాలని పార్టీ శ్రేణులకు బాబు పిలుపునిచ్చారు. ఇంకా.. సీఎం ఏమన్నారంటే.. తుపాను ప్రభావంతో పెద్ద ఎత్తున వర్షాలు పడ్డాయి. ఊహించని విధంగా వరదలు సంభవించాయి. ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంతో ప్రాణనష్టం తగ్గించగలిగాం.

- ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా సొంత డబ్బులు ఖర్చు చేసి ప్రజలకు సాయం అందించాం. మన పార్టీ ఎప్పుడు అధికారంలో ఉన్నా ప్రజలకు ఇబ్బంది లేకుండా చేశాం. పార్టీ శ్రేణులు కూడా సహాయక చర్యల్లో పాల్గొనాలి.
- విపత్తులను అంచనా వేసి ముందుగానే సన్నద్ధం చేసేందుకు 2014-19 మధ్య ఏర్పాటు చేసిన పటిష్ఠమైన వ్యవస్థను గత ప్రభుత్వం ధ్వంసం చేసింది. దెబ్బతిన్న వ్యవస్థలను కూడా మళ్లీ నిర్మించాల్సి ఉంది.
- కృష్ణానది పరివాహకంలో ఉన్నవారంతా ప్రజలకు అండగా ఉండాలి. ప్రభుత్వం నుండి సాయం అవసరమైతే సమాచారం అందించాలి.
- పభుత్వం అందించే సహాయక కార్యక్రమాల్లోనూ శ్రేణులు భాగస్వాములు కావాలి.
- మంత్రులు, ఎంపీలు కూడా క్షేత్రస్థాయిలో ఉండాలి. మీరు ఎలాంటి కార్యక్రమాలు చేపట్టారో కూడా సమీక్ష చేస్తాం. ఎమ్మెల్యేలు కూడా ప్రజల వద్దకు వెళ్లాలి.
- అధికారంలో ఉన్నప్పుడు మనం సమర్థవంతంగా పని చేస్తే ప్రజల్లో మనపట్ల, మన ప్రభుత్వం పట్ల సానుకూల



భావన కలుగుతుంది.

- హుదుద్ తుఫాన్ సమయంలో విశాఖలో వారం రోజులు ఉండి పరిస్థితులు చక్కదిద్దాం. దీంతో వారు 2019 ఎన్నికల్లో నాలుగు సీట్లు గెలిపించారు. మనపై నమ్మకంతోనే మొన్నటి ఎన్నికల్లో పెద్ద మెజారిటీలు ఇచ్చారు.
- నేడు నుండి మూడు రోజుల పాటు పార్టీ శ్రేణులు సహాయక చర్యలు చేపట్టాలి.
- 30 ఏళ్ల క్రితం నేను ఇదే రోజున ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశాను...ఈ 30 ఏళ్లలో ఎన్నో సానుకూల, ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొన్నాం.
- కార్యకర్తలు, నాయకుల త్యాగాలను గుర్తించేందుకు వర్కవుట్ చేస్తున్నాం. మనమంతా సమిష్టిగా పనిచేసి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకొద్దాం.
- ప్రజలకు, పార్టీ శ్రేణులకు ప్రజాప్రతినిధులు అందుబాటులో ఉండాలి. ప్రజల్ని పట్టించుకోని వైసీపీ గతి ఏమైందో మొన్నటి ఎన్నికల్లో చూశాం.
- వర్షం ప్రభావం ఉన్నా 93 శాతం పెన్షన్లు పంపిణీ చేయడం సంతోషకర విషయం.

## నిత్యం ప్రజా పక్షంగానే ఉన్న ప్రజానేత.. చంద్రబాబు!

- మంత్రి అనగాని సత్యప్రసాద్

**అమరావతి, మహానాడు:**

ముఖ్యమంత్రిగా మొదటిసారి ప్రమాణస్వీకారం చేసి, 30వ ఏడాదిలోకి ప్రవేశించిన తెలుగుదేశం పార్టీ(టీడీపీ) అధినేత నారా చంద్రబాబు నాయుడుకి హార్థిక శుభాకాంక్షలు తెలుపుతున్నట్టు మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే.. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా, 15 ఏళ్లు ప్రధాన ప్రతిపక్ష నేతగా సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎల్లప్పుడూ ప్రజా పక్షంగానే వ్యవహరించిన ప్రజా నేత చంద్రబాబు. ప్రజల వద్దకే పాలనను తీసుకొచ్చిన తొలి ముఖ్యమంత్రి. తన పాలనా దక్షతతో సీఎం కాదు సీఇవో అంటూ అంతర్జాతీయ సమాజంచే అభినందనలు అందుకున్న నేత. అనాడు విజన్ 2020 పేరుతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ను, నేడు విజన్ 2047 పేరుతో నవ్యాంధ్రను ప్రగతి పట్టాలపై పరుగులు పెట్టించిన విజనరీ. తన దార్శినికతతో హైదరాబాద్ ను ఐటి రంగంలో మేటి నగరంగా తీర్చిదిద్దిన పాలకుడు.

ముఖ్యమంత్రిగా ఉన్నా, ప్రతిపక్ష నేతగా ఉన్నా ఎప్పుడూ ప్రజల్లో ఉంటూ వారి కుటుంబంలో ఒక్కడిగా వారి సమస్యలను తీర్చే నేత. గత ఎన్నికల్లో అసాధారణ విజయంతో



నాలుగోసారి ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించి ప్రగతిని, సంక్షేమాన్ని సమాన పాళ్లలో ముందుకు తీసుకెళ్తున్న సమర్థవంతమైన పాలకుడు. 74 ఏళ్ల వయస్సులో ప్రజా శ్రేయస్సు కోసం అవిశ్రాంతంగా కష్టపడుతున్న చంద్రబాబు రానున్న రోజుల్లో మరింత కాలం ప్రజల సేవలో ఉండాలని రాష్ట్ర ప్రజల కోరిక. డైనమిక్, విజనరీ, హార్డవర్కర్ అయిన చంద్రబాబు నాయకత్వంలో పని చేయడం మా అందరికీ గర్వకారణం.

## గుడ్లవల్లేరు కాలేజిలో
## హిడెన్ కెమెరాలు బ్లూమీడియా సృష్టే!

- కుంభకోణాల నుంచి పక్కదారి పట్టించేందుకే లేనిపోని ఆరోపణలు
- రాష్ట్రంలోని విద్యార్థులంతా నా బిడ్డల్లాంటివారే... వారి బాధ్యత నాదే
- జగన్ మాదిరి తల్లీ, చెల్లిని రోడ్లపైకి గెంటేసే రకం నేను కాదు
- మంగళగిరి నియోజకవర్గ పర్యటనలో మంత్రి నారా లోకేష్

**మంగళగిరి, మహానాడు:**

గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల బాత్రూమ్ లలో హిడెన్ కెమెరాలు బ్లూమీడియా సృష్టి మాత్రమేనని, అక్కడ కెమెరాలు ఉన్నట్టు ఎటువంటి ఆధారాలు లభించలేదని రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో ముంపు ప్రాంతాలను పరిశీలించిన అనంతరం కార్పొరేషన్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ... వైసీపీ నేతల సినీనటి వేధింపుల కేసు, మద్యం కుంభకోణం, భూ అక్రమాలు వరుసగా బయల్పడుతుండటంతో వాటినుంచి ప్రజల దృష్టి మళ్ళించేందుకే హిడెన్ కెమెరాల నాటకానికి తెరలేపారని మండిపడ్డారు. విద్యాశాఖ మంత్రిగా రాష్ట్రంలో చదివే విద్యార్థులంతా నా బిడ్డల్లాంటి వారేనని, వారిని క్షేమంగా కాపాడుకునే బాధ్యత పూర్తిగా తమదేనని అన్నారు.

- గుడ్లవల్లేరులో నలుగురు విద్యార్థుల మధ్య జరిగిన ఒక వ్యక్తిగత అంశం ఈ గొడవకు కారణమైందని, సంబంధిత విద్యార్థిని డీటెయిన్ చేసి ఇప్పటికే అదుపులోకి తీసుకున్నామని చెప్పారు.

- నూజివీడు ట్రిపుల్ ఐటిలో ఆహారం కలుషితమైందని తెలిసిన వెంటనే డైరక్టర్‌ను విధులనుంచి తొలగించామని, ముగ్గురుఉన్నతాధికారులతో పర్యవేక్షక కమిటీని నియమించామని తెలిపారు.



- జగన్మోహన్ రెడ్డి మాదిరిగా తాను తల్లీ, చెల్లిని రోడ్లపైకి గెంటేసే రకం కాదని, విద్యార్థినులను తన తోబుట్టువులుగా భావించి కంటికి రెప్పలా కాపాడతానని స్పష్టంచేశారు. నాడు-నేడు పేరుతో జగన్ ప్రభుత్వం వేలకోట్ల ఖర్చుచేసినట్టు తప్పుడు లెక్కలు చెబుతోందని, అదే నిజమైతే రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో గత అయిదేళ్లలో 10లక్షల మంది విద్యార్థులు ఎందుకు తగ్గారని నిలదీశారు.

- డిజిటల్ క్లాస్ రూమ్‌లు జగన్ కొత్తగా ఏమీ కనిపెట్టలేదని, అవి అంతకుముందే ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించకుండా రంగులు వేసి వందలకోట్లు దిగమింగారని దుయ్యబట్టారు.

- విద్యార్థులకు సరఫరాచేసే గుడ్లు, చిక్కీలు, ఆయాల జీతాలు కూడా బకాయి పెట్టి వెళ్లారని, వాటన్నింటినీ ఒక్కొక్కటిగా తాము విడుదల చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో ప్రైవేటు స్కూళ్లకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని, ఆ లక్ష్యాన్ని చేరుకునేందుకు ప్రణాళికాబద్ధంగా కృషిచేస్తామని మంత్రి నారా లోకేష్ స్పష్టంచేశారు.




విజయవాడలో వర్షాలు వల్ల జలమయమైన ప్రాంతాలను పరిశీలించిన బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి



జగ్గయ్యపేట పట్టణంలో వరద ముంపు ప్రాంతాలను స్థానిక నేతలతో కలిసి పరిశీలించి వారి సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కారం చేస్తున్న శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య

5

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || సోమవారం 02, సెప్టెంబర్ 2024

# అధైర్యపడొద్దు - అండగా ఉంటాం!

- వసరమైన ప్రాంతాల్లో రోడ్లు, డ్రెయిన్లు నిర్మిస్తాం
- గుంటూరులోని నీట మునిగిన ప్రాంతాల్లో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని పర్యటన
- మోకాళ్ల లోతు నీళ్లలో ఇంటింటికీ వెళ్ళి బాధితులకు పరామర్శ

**గుంటూరు,మహానాడు:**

కాలనీలు చూస్తుంటే బాధ కలుగుతోంది. 50 ఏళ్ళలో ఎన్నడూలేని విధంగా వర్షాలు కురిశాయి. ఇంటింటికీ వెళ్లి ప్రజల బాధలను విన్నాం. వారికి అవసరమైన పునరావాస ఏర్పాట్లు చేశాం. డ్రెయిన్లు, రోడ్లు సరిగా లేనందున ఇళ్లలోకి సైతం నీళ్లు వచ్చాయి. పక్కా ప్రణాళికతో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి చర్యలు చేపడతాం. అవసరమైన వారికి పక్కా గృహాలు నిర్మిస్తాం. బాధితులు అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం.' అని గ్రామీణాభివృద్ధి,



కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు.

భారీ వర్షాలకు గుంటూరులో నీట మునిగిన ప్రగతి నగర్, జిమ్మి షహీద్ నగర్ ప్రాంతాల్లో స్థానిక ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్ తో కలిసి పెమ్మసాని ఆదివారం పర్యటించారు. మోకాళ్ల లోతు నీళ్లలో ప్రతి ఇంటికీ వెళ్లి బాధితుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

అనంతరం మున్సిపల్ కమిషనర్ తో మాట్లాడి ఈ ప్రాంత వాసులకు మంచినీటి కుళాయి కనెక్షన్ ఇప్పించాలని, రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు.

గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని జిమ్మిషహీద్ నగర్ లో నీట మునిగిన ప్రాంతాలను పెమ్మసాని పరిశీలించారు. చిన్న చిన్న వీధుల్లో నుంచి వెళ్లి స్థానికుల



బాధలను అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రాంతంలోని నివాసాలు అనధికార లే-అవుట్లలో ఉండడంతో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని గుర్తించారు. ఈ ప్రాంత ప్రజలకు పక్కా ఇళ్లు నిర్మాణానికి చర్యలు చేపడతామని చెప్పారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని, భారీ వర్షాల కారణంగా నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లోని ప్రజలకు ఏ అవసరమొచ్చినా అందుబాటులో ఉండాలని అధికారులకు పెమ్మసాని గారు సూచించారు. ప్రజలకు ఏ ఇబ్బంది వచ్చినా వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. కార్యక్రమంలో జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు, తహసీల్దార్ నగేష్, ఇరిగేషన్, ఆర్ అండ్ బీ ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

### వృద్ధులకు భరోసా

- పర్యటనలో భాగంగా శకుంతల అని వృద్ధురాలి ఇంటికి వెళ్లి మరి పెమసాని పరామర్శించారు వరద నీటిలో చిక్కుకున్న ఆమె ఇంటి పరిస్థితిని స్వయంగా పరిశీలించారు.
- షేక్ ఖుతూబ్ అనే వృద్ధురాలి ఇంటికి వెళ్లగా ఆమె కన్నీటి పర్యంతమయ్యారు. తమకు ఏ దిక్కులేదని ఆదుకోవాలని కోరగా.. పెమ్మసాని ఆర్థిక సాయం అందించి స్థానిక సమస్యలకు శాశ్వతపరిష్కారం చూపిస్తామని భరోసా కల్పించారు.





# వరద సమస్య శాశ్వత పరిష్కారానికి ప్రణాళికలు

- ముంపు ప్రాంతాల్లో పర్యటన, బాధితులకు మంత్రి లోకేష్ హామీ

**మంగళగిరి, మహానాడు:**

మంగళగిరి నియోజకవర్గంలోని భారీ వర్షాలతో ముంపునకు గురైన ప్రాంతాల్లో విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ ఆదివారం పర్యటించారు. తాడేపల్లి టౌన్ నులకపేట క్వారీ ప్రాంతాన్ని పరిశీలించారు. ముంపుకి గురైన ఇళ్ళను చూసి, బాధితులకు భరోసా ఇచ్చారు. నీటిని వీలై నంత త్వరగా బయటకు తోడేందుకు చేసిన ఏర్పాట్ల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుండి అందుతున్న సాయం, ప్రస్తుతం ఉన్న ఇబ్బందులు గురించి బాధితులను ఆరా తీశారు.



కొత్తపేటలో కొండచరియలు విరిగిపడి దెబ్బతిన్న ఇంటిని పరిశీలించారు. రత్నాల చెరువు ప్రాంతంలో పర్యటించారు. ప్రభుత్వ సాయం అందరికీ అందుతుందా అంటూ బాధి తులను అడిగి తెలుసుకున్న మంత్రి. అధికారులు, పార్టీ శ్రేణులు నిన్నటి నుండి అందుబాటులో ఉండి సహాయక కార్యక్రమాల్లో పాల్గొన్నారు అని లోకేష్‌కి బాధితులు చెప్పారు. రత్నాల చెరువులో మోకాటి లోతు నీళ్ళలో దిగి ముంపునకు గురైన గురైన ఇళ్లను పరిశీలించిన మంత్రి లోకేష్. మసీదు లైన్లో చేనేత కార్మికుని ఇంటికి వెళ్లి నీట మునిగిన మగ్గాన్ని పరిశీలించారు. ఇళ్ళ మధ్య నిలిచిన నీటిని మోటార్లతో తోడించాలని అధికారులకు ఆదేశం. ముంపు ప్రాంతాల వాసులకు ఆహారం, మంచినీరు అందించాలని సూచన. మంగళగిరి రూరల్ చినకాకాని డిడి నగర్ లోనూ పర్యటించారు.



డిడి నగర్‌లోని కాలనీల్లోకి చేరిన నీటిని బయటకి వీలైనంత త్వరగా పంపింగ్ చేయాలని అధికారులను ఆదేశించారు. వాటర్ పంపింగ్ కోసం చేపడుతున్న చర్యలు,



డిడి నగర్ లో అందిస్తున్న సహాయక చర్యలు గురించి లోకేష్ కు వివరించిన అధికారులు. మంత్రి లోకేష్ బాధితులతో మాట్లాడి సమస్యల అడిగి తెలుసుకున్నారు. ఎన్నో ఏళ్లుగా వర్షా కాలం ఇబ్బందులు పడుతున్నాం. శాశ్వత పరిష్కారం చూపాలని లోకేష్ ను బాధితులు కోరారు. కాలనీల్లో నీరు చేరకుండా శాశ్వత పరిష్కారం కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. మంగళగిరి టౌన్ లోని టిడ్కో గృహాలను



మంత్రి పరిశీలించారు.

మున్సిపల్ సిబ్బంది, పార్టీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సహాయ కార్యక్రమాలపై ఆరా తీశారు. గతంలో ఎటువంటి ప్రణాళికతో టిడ్కోఇళ్లు నిర్మించామో ఆ పనులు అన్ని పూర్తి చేసి సమస్యలు శాశ్వతంగా పరిష్కరిస్తాం అని బాధితులకు మంత్రి లోకేష్ హామీ ఇచ్చారు.

## జగనాసురుడిపై 'బెంగళూరు టీడీపీ'

# పోరాటం అనిర్వచనీయం

- మంత్రి సవిత

**బెంగళూరు, మహానాడు:**

జగనాసురుడిపై బెంగళూరు టీడీపీ ఫోరం చేసిన పోరాటం అనిర్వచనీయమని, బెంగళూరు టీడీపీ ఫోరం రాజకీయాలే కాకుండా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కూడా కల్పించిందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత అభినందించారు. బెంగళూరులో ఆదివారం బెంగళూరు టీడీపీ ఫోరం నిర్వహించిన 'నవశకం-మంచిరోజులు వచ్చాయి' కార్యక్రమంలో పాల్గొని మంత్రి మాట్లాడారు. ఆమె ఏమన్నారంటే... ఎన్నికల్లో బీసీ బిడ్డయిన తన వెనక బెంగళూరు టీడీపీ ఫోరం సభ్యులు నిలబడ్డారు. స్వచ్ఛందంగా వారంతా నా తరఫున ఎన్నికల్లో పనిచేసినందుకు ధన్యవాదాలు. గడిచిన 5 ఏళ్లు రాష్ట్రంలో రాజారెడ్డి రాజ్యాంగం నడిచింది. దోచుకోవడం...దాచుకోవడమే లక్ష్యం జగన్ పాలించారు.

టీడీపీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు వేసి వేధించారు...జైల్లో పెట్టారు. ప్రజలు సైతం భయం భయంతో కాలం గడిపారు. మద్యం, మైనింగ్, భూ కబ్జాల దందాలు చేశారు. ప్రజల ఆస్తులను సైతం కొట్టేయడానికి చీకటి చట్టం ల్యాండ్ టైటిల్ యాక్టు చట్టం తీసుకొచ్చారు. రాక్షస పాలనను భరించలేక...ప్రజలంతా మూకుమ్మడిగా చంద్రబాబు ఓటేసి గెలిపించుకున్నారు. ప్రజలపై తను ఉంచి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పెన్షన్లను పెంచి అందజేశారు.

పేదోడికి మూడు పూటలా కడుపునింపడానికి అన్న క్యాంటీన్లు



పెట్టారు. రాష్ట్రంలో చేనేత పరిశ్రమను జగన్ రెడ్డి పూర్తిగా నిర్వీర్యశం చేశాడు. 2014లో నేతన్నలకు చంద్రబాబు అమలు చేసిన పథకాలన్నింటినీ రద్దు చేశారు జగన్. ఇపుడు మళ్లీ చంద్రబాబు అధికారంలోకి వచ్చారు...చేనేతకు మళ్లీ మంచి రోజులు వచ్చాయి. వారానికి ఒక్కసారైనా ప్రజలంతా చేనేత వస్త్రాలు ధరించాలని పిలుపునిచ్చిన మంత్రి సవిత.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, అలిమినేని సురేంద్రబాబు, ఎమ్మెల్సీలు భూమిరెడ్డి రామ్ గోపాల్ రెడ్డి, కంచర్ల శ్రీకాంత్, టీడీపీ నాయకులు డాక్టర్ సురేశ్, రావి రామ్మోహన్ చౌదరి, బి. గోపాల్, బెంగళూరు టీడీపీ ఫోరం సభ్యులు, చెన్నై టీడీపీ ఫోరమ్ సభ్యులు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పంపిణీ వ్యవస్థను మెరుగుపరుస్తాం...

- ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు

**నరసరావుపేట, మహానాడు:**

పేదల ఆకలి తీర్చే ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత పటిష్ఠ పరిచి, ప్రతి ఒక్కరికీ సరుకులు అందేలా చర్యలు తీసుకుంటామని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదరవాడ అరవింద బాబు అన్నారు. పట్టణంలోనీ ఆరో వార్డులోని రేషన్ షాపుని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సరుకుల కోసం రేషన్ షాపుకు వచ్చిన ప్రజలను సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో కార్డు దారులకు ఎనిమిది రకాల సరుకులు అందిస్తే జగన్ రెడ్డి మొత్తం నాశనం చేశారని విమర్శించారు. కందిపప్పు, పంచదార లాంటి సరుకులు అన్ని ఎత్తేసి కేవలం బియ్యానికి పరిమితమయ్యారన్నారు. చివరికి రేషన్ సరుకుల ధరలు పెంచి ప్రజల నడ్డి విరిచారని, ఇళ్ళ వద్దకే బియ్యమని హడావుడి చేసి వాహనాల



కొనుగోలు జేబులు నింపుకున్నారని ఆరోపించారు.

మళ్ళీ సరుకులన్నీ అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం... పేదల ఆకలి తీర్చడమే ప్రభుత్వం తక్షణ కర్తవ్యంగా పనిచేస్తోందని ఎమ్మెల్యే అరవింద బాబు అన్నారు.

ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పూడికతీతలు, ఆక్రమణల తొలగింపుతోనే

# ముంపు సమస్యకు పరిష్కారం

- ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

**చిలకలూరిపేట, మహానాడు:**

జనావాసాల్లో చోటుచేసుకున్న ఆక్రమణల తొలగింపు, డ్రెయినేజీల్లో పూడిక తీతతోనే భారీవర్షాల సమయంలో ముంపు సమస్యల నుంచి శాశ్వత పరిష్కారం లభిస్తుందని మాజీమంత్రి, తెలుగుదేశం పార్టీ చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. చిలకలూరిపేట పట్టణంలో సాధించిన ఫలితాలే అందుకు నిదర్శమన్నారు. గత నెల



రోజులుగా ఆక్రమణలు తొలగిస్తుంటే అభ్యంతరాలు చెప్పిన వారే ఇప్పుడు ఫలితాలు చూసి అభినందిస్తున్నారని ఆనందం వ్యక్తం చేశారాయన.

కుండపోత కారణంగా చిలకలూరిపేటలో వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పర్యటించారు. గడియార స్తంభం సెంటర్, కళామందిర్ సెంటర్, మార్కెట్ సెంటర్‌లో వరదనీరు నిల్వ ఉన్న ప్రాంతాలు, డ్రైనేజీలు పరిశీలించి మున్సిపల్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం మాట్లాడిన ఆయన 50 ఏళ్లలో ఎప్పుడూ ఇంత వర్షపాతం నమోదు కాలేదన్నారు. వాటికి తోడు గత పాలకుల నిర్లక్ష్యం, పట్టణాల అభివృద్ధిని గాలికి వదిలేయడంతో ఎక్కడి నీరు అక్కడ నిలిచిపోతోందన్నారు. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం, పూడికతీత చేపట్టకపోవడం, డ్రైనేజీ వ్యవస్థను నిర్లక్ష్యం చేయడం వల్లనే రాష్ట్రమంతా కొన్ని ప్రాంతాలు నీట మునిగాయన్నారు.

రెండు నెలలుగా సీఎం చంద్రబాబు, పురపాలక మంత్రి నారాయణ చొరవతో పూడికతీతల కోసమే మున్సిపాలిటీలకు నిధులు కేటాయించడం, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పంచాయతీలకు కొంత నిధులు ఇవ్వడంతో పనులు జరిగి కొన్నిప్రాంతాల్లో ముంపు బారి నుంచి తప్పించుకున్నామన్నారు. చిలకలూరిపేటలో 2 నెలలుగా మున్సిపల్ కమిషనర్ గోవిందరావు, సిబ్బంది డ్రైన్లలో పూడికతీయడం పనులు చేపట్టారని... వారిని అభినందించారు. డ్రైన్లలో పూడికతీత, ఆక్రమణల్లో ఉన్నవారు ఎవరికి వారు స్వచ్ఛందంగా కొన్ని ప్రాంతాల్లో పూడికతీయడం, కొన్ని ప్రాంతాల్లో ఆక్రమణలను తొలగించి పూడికతీసినట్టు తెలిపారు.

రోడ్లకు ఇరువైపు కాస్త వెనక్కి జరిగితే ఎంత సౌకర్యంగా ఉంటుందో కూడా ఇప్పుడు ప్రజలందరికీ అర్థం అవుతోందన్నారు. ఆక్రమణల తొలగింపుతో పట్టణంలో కొంతమంది బాధపడ్డా మెజార్టీ ప్రజలు సంతోషాన్ని వ్యక్తపరుస్తున్నారని తెలిపారు. దీనిపై కూడా కొంతమంది తనపై దుష్ప్రచారం చేశారని, బాధతో మాట్లాడినవారు ఉన్నారని, వీటన్నింటినీ అర్థం చేసుకోవాలని కోరారు. మూడ్రోజులుగా కురిసిన వర్షాలకు పట్టణంలో ఏ ఒక్కరూ ఇబ్బందిపడలేదంటే పట్టణ ప్రజల సహకారమే దీనికి ప్రధాన కారణమని, డ్రైనేజీల్లో పూడికతీయడం వల్లనే ఎక్కడా చుక్క నీరు నిలబడకుండా బయటకు వెళ్లిపోయిందన్నారు.

పట్టణంలో నీరు నిలబడిందని మీడియా తరపున గానీ ప్రజల నుంచి గానీ తనకు ఒక్క ఫోన్ కాల్ కూడా రాలేదన్నారు. ఏ డ్రైనేజీ చూసినా బ్రహ్మాండంగా పారుతుందన్నారు. దీనికి సహకరించిన పట్టణ ప్రజలను అభినందిస్తున్నానని, ఎవరూ నష్టపోవడానికి వీల్లేదని, జీవనోపాధి పొందడానికి అందరికీ సహకారం ఉంటుందన్నారు.

6

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || సోమవారం 02, సెప్టెంబర్ 2024

















**విజయవాడ సింగ్ నగర్‌లోని బుడమేరు వరద ప్రభావిత ప్రాంతంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన**















జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || సోమవారం 02, సెప్టెంబర్ 2024

# ఉద్యోగులు, సిబ్బందికి సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు

హైదరాబాద్,మహానాడు: రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్నా, వరదల వల్ల చాలా చోట్ల ఇబ్బందికర పరిస్థితులు తలెత్తినా ప్రజానీకానికి అత్యవసర సేవలు అందించడంలో అహర్నిశలు శ్రమిస్తోన్న ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బందికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు.

విద్యుత్ పునరుద్దరణ పనుల్లో సిబ్బంది నిమగ్నమైన కొన్ని ఫోటోలను షేర్ చేస్తూ "భారీ వర్షంలో విరిగిన చెట్టు కొమ్మల మధ్య ప్రాణాలను పణంగా పెట్టి రాష్ట్రానికి వెలుగులు పంచేందుకు రాజీలేని విధి నిర్వహణకు అంకితమైన విద్యుత్ ఉద్యోగులు, సిబ్బందికి, పోలీస్, మున్సిపల్ సిబ్బందికి నా అభినందనలు" అని ముఖ్యమంత్రి ఎక్స్ లో పేర్కొన్నారు.







## గుంటూరులో గంజాయి మాట
# వినపడకూడదు

- పోలీసు అధికారులతో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

గుంటూరు, మహానాడు: గుంటూరులో ఎక్కడా గంజాయి అనే మాట వినపడకూడదు. గంజాయిపై ఉక్కుపాదం మోపండి అని గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఆదేశించారు. భారీ వర్షాల కారణంగా గుంటూరు తూర్పు నియోజకవర్గంలో నీట మునిగిన ప్రాంతాల్లో డాక్టర్ పెమ్మసాని ఆదివారం పర్యటించారు. ఈ క్రమంలో సుద్దపల్లి డొంక ప్రియాంక గార్డెన్స్ ప్రాంతంలో మహిళలు పెమ్మసాని వద్దకు వచ్చి తమ గోడు వెళ్లబోసుకున్నారు. తమ ప్రాంతంలో ఆకతాయిల ఆగడాలు ఎక్కవయ్యాయని, గంజాయి తాగుతూ, తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఎన్నిసార్లు చెప్పినా వినకుండా తమపై దౌర్జన్యం చేస్తున్నారని వివరించారు. వెంటనే స్పందించిన పెమ్మసాని స్థానిక సీ.ఐ వీర సోమయ్యను పిలిచి మాట్లాడారు. తాను మళ్ళీ వస్తానని, గంజాయి మాట మళ్ళీ గుంటూరులో వినపడకూడదని ఆదేశించారు.



# నాగరత్నమ్మ కుటుంబానికి రూ.5లక్షల పరిహారం పంపిణీ

- ఘన నివాళులర్పించిన మంత్రి లోకేష్

గుంటూరు, మహానాడు: జిల్లాలో భారీ వర్షాల కారణంగా మంగళగిరి పట్టణం కొత్తపేటలో కొండచరియలు విరిగిపడి మృతి చెందిన నాగరత్నమ్మ(88) భౌతిక కాయానికి ఆదివారం ఉదయం రాష్ట్ర మానవ వనరులు, ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్, ఆర్టిజి శాఖల మంత్రి నారా లోకేష్ నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రభుత్వం తరపున రూ.5 లక్షల



పరిహారం అందించారు. అనంతరం శనివారం కొండ చరియలు విరిగిపడి దెబ్బతిన్న ఇంటిని మంత్రి పరిశీలించారు.

ఈ కార్యక్రమంలో గుంటూరు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, తెనాలి సబ్ కలెక్టర్ ప్రకార్ జైన్, మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కమిషనర్ అలీం భాష, మంగళగిరి తహశీల్దార్ సుభాని, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



సత్తెనపల్లి, మహానాడు: తుపాను ప్రభావం ఇంకా ఉన్న నేపథ్యంలో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, రేషన్ సకాలంలో అందించాలని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కన్నా మాట్లాడుతూ.. ప్రజలను పునరావాస కేంద్రాలకు రావాలని సూచించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని శానిటైజేషన్ రేషన్ సకాలంలో అందించాలని అధికారులకు సూచించారు. ఈ రాత్రికి వరద పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని అధికారులకు సూచించారు. ప్రజలు అంత అప్రమత్తంగా ఉండాలన్నారు. పార్టీ శ్రేణులు కూడా వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎలాంటి సంఘటనలు జరగకుండా క్యాడర్ మొత్తంగా ఉండాలని సూచించారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు అధికారులంతా అలర్ట్‌గా ఉండి ప్రజలకు ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా చూడాలని సూచించారు.



# పడవలో సురక్షిత ప్రాంతానికి తరలింపు

తుళ్లూరు,మహానాడు: కృష్ణా నది ఉద్ధృతంగా ప్రవహిస్తుండడంతో లంక గ్రామాలు వరద ముంపులో చిక్కుకున్నాయి. రాజధాని గ్రామం ఉద్దండరాయుని పాలెం లంకలో నివసిస్తున్న గృహస్థుల వద్ద పడవలో వెళ్ళిన అధికారులు, సిబ్బంది.. అక్కడి నుంచి వారిని ఖాళీ చేయించి, పునరావాస కేంద్రాలకు తరలించారు. ఈ కార్యక్రమంలో తుళ్లూరు తహశీల్దార్ జి.సుజాత, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

# సముద్రంలో చిన్నగంజాం మత్స్యకారుల గల్లంతు!

విశాఖపట్నం, మహానాడు: సముద్రంలో వేటకు వెళ్ళిన చిన్నగంజాం మత్స్యకారులు తప్పిపోయారు. చెన్నై నుండి విశాఖపట్నంకు చేపల వేటకు బోట్లో మత్స్యకారులు వెళ్ళారు. విశాఖపట్నం సముద్ర తీరంలో చిక్కుకున్నారు. ఎమ్మెల్యే ఏలూరి వారిని రక్షించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. హోంమంత్రి అనిత, రెవెన్యూ అనగాని, కలెక్టర్ వెంకట మురళీ దృష్టికి సమస్య తీసుకువెళ్ళారు. అధికార యంత్రాంగం అప్రమత్తమై కాపాడేందుకు చర్యలు చేపట్టారు. అలాగే ఎమ్మెల్యే ఏలూరి సెంట్రల్ కమాండ్ ను అప్రమత్తం చేశారు.

కోస్ట్ గార్డ్స్ విశాఖ సముద్ర తీరంలో గాలింపు చర్యలు చేపట్టారు.

# నేడు 'ప్రజా వేదిక' రద్దు

మంగళగిరి, మహానాడు: మంగళగిరి ఎన్టీఆర్ భవన్‌లో నేడు జరగాల్సిన 'ప్రజా వేదిక' కార్యక్రమం రద్దయింది. భారీ వర్షాలు, వరదలు ఉండడంతో పాటు వరద సహాయక చర్యల్లో అధికారులందరూ నిమగ్నమైయున్నారు. ఈ దృష్ట్యా మంగళగిరి తెలుగుదేశం పార్టీ(టీడీపీ) కేంద్ర కార్యాలయంలో సోమవారం జరగాల్సిన 'ప్రజా వేదిక' కార్యక్రమం రద్దు అయింది. ఎటువంటి గ్రీవెన్స్ ఉండదు. తెలుగుదేశం పార్టీ శ్రేణులు, ప్రజలు గమనించాలని టీడీపీ శాసనమండలి సభ్యులు, కేంద్ర కార్యాలయం కార్యదర్శి పర్చూరి అశోక్ బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

## ముంపు ప్రాంతాల్లో
# ఎమ్మెల్యే గద్దె పర్యటన

విజయవాడ, మహానాడు: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ముంపు గురైన ప్రాంతాల్లో ఎమ్మెల్యే గద్దె రామమోహన్ స్థానిక కార్పొరేటర్ జాస్తి సాంబశివరావుతో కలిసి శనివారం ఉదయం పర్యటించారు. 4వ డివిజన్



పరిధిలోని శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీ, భారతీనగర్, సి.టి.ఓ కాలనీ, వెంకటేశ్వరనగర్, అంబేద్కర్ నగర్, సెంట్రల్ ఎక్సైజ్ కాలనీ, గుణదల హరిజన వాడలతో పాటు పలు ప్రాంతాల్లో పర్యటించి అక్కడున్న పరిస్థితులపై స్థానిక నాయకులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తూమాటి ప్రేమనాథ్, మిక్కిలినేని బుజ్జి, యలమంచలి రాజా, కె.వెంకటేశ్వరరావు, కోనేరు సురేష్, మండవ వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

## తెలంగాణలో
# రేపు స్కూళ్లకు సెలవు

హైదరాబాద్,మహానాడు: భారీ వర్షాల నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని విద్యా సంస్థలకు ప్రభుత్వం సోమవారం సెలవు ప్రకటించింది. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలు తప్పనిసరిగా సెలవు ఇవ్వాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇదే సమయంలో అన్ని ప్రభుత్వ విభాగాలకు ప్రభుత్వం సెలవులు రద్దు చేసింది.



## లంక ప్రజలను పునరావాస
# కేంద్రాలకు తరలించండి

- అధికారులకు ఎమ్మెల్యే ఆనందబాబు ఆదేశం

బాపట్ల, మహానాడు: వేమూరు నియోజకవర్గం కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లోని వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాలను, కొల్లూరు దగ్గర గల అరవింద్ వారధి వరద ప్రభావిత ప్రాంతాలను మాజీ మంత్రి, వేమూరు శాసనసభ్యుడు నక్కా ఆనందబాబు ఆదివారం పరిశీలించారు. ప్రకాశం బ్యారేజ్ నుంచి 7 లక్షల క్యూసెక్కుల దాటి వరద ప్రవహిస్తూ ఉండటంతో కొల్లూరు మండలం, భట్టిప్రోలు మండలం లోని లంక గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఏమన్నారంటే.. లంక గ్రామాల ప్రజలను పునరావాస కేంద్రాలకు రావాలని సూచించారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని శానిటైజేషన్ రేషన్ సకాలంలో అందించాలని అధికారులకు సూచించారు.

ఈ రాత్రికి 10 లక్షల వరకు పెరిగే అవకాశం ఉన్నందున వరద పెరిగితే లంక గ్రామాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని అధికారులకు సూచించారు. ప్రజలు అంత అప్రమత్తంగా ఉండాలన్నారు. పార్టీ శ్రేణులు కూడా వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎలాంటి సంఘటనలు జరగకుండా క్యాడర్ మొత్తం గా ఉండాలని సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు అధికారులంతా అలర్ట్ గా ఉండి ప్రజలకు ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా చూడాలని సూచించారు.

# శ్రీశైలానికి రాకపోకలు నిలిపివేత

శ్రీశైలం, మహానాడు: భారీ వర్షాల కారణంగా ఘాట్ రోడ్లో కొండచరియలు పడుతున్న నేపథ్యంలో మన్ననూరు చెక్ పోస్ట్ నుంచి శ్రీశైలానికి వాహన రాకపోకలు నిలిపివేశారు. ఈ మేరకు అచ్చంపేట డిఎస్పీ శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. ప్రస్తుతానికి శ్రీశైలం-హైదరాబాద్ మధ్య రాకపోకలు సాగించే ప్రయాణికులు వాయిదా వేసుకోవాలని సూచించారు. యాత్రికులు ఈ విషయాన్ని గమనించి



పోలీస్ శాఖకు సహకరించాలన్నారు. కాగా, అల్ప పీడనం కారణంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో పలు చోట్ల ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. పలు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. కొన్ని చోట్ల పొలాలు నీట మునిగాయి. మరికొన్ని చోట్ల వాగులు పొంగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. మరోవైపు శ్రీశైలంలోని శ్రీగిరి కాలనీ,కొత్తపేట ఏరియాలో రోడ్లన్నీ జలమయమై వాగులను తలపిస్తున్నాయి. ప్రజలు ఇళ్ల నుంచి బయటికి రాలేని పరిస్థితి నెలకొంది. సున్నిపెంటల ఓ రెండు గృహాలపై భారీ వేపచెట్టు కూలి గృహాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. తెల్లవారుజామున జరిగిన ఘటనలో ఇంట్లో నిద్రిస్తున్న వారికి ప్రాణాపాయం తప్పింది.

# నాగార్జునసాగర్ ఎడమ కాలువకు భారీ గండి

సూర్యాపేట, మహానాడు: సూర్యాపేట జిల్లా పరిధిలోని నాగార్జునసాగర్ ఎడమ కాలువకు భారీ గండి పడింది. నడిగూడెం మండలం కాగిత రామచంద్రపురం వద్ద సాగర్ ఎడమ కాలువ తెగడం తో వరద చుట్టుపక్కల గ్రామంలోని పంట పొలాల్లోకి



ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. దీంతో వందలాది ఎకరాల్లో పొలాలు నీటి మునిగాయి. గ్రామంలో వరద పెరగడంతో ఊరు ఖాళీ చేసేందుకు ప్రజలు ప్రయత్నం చేస్తున్నారు. మరోవైపు నాగార్జునసాగర్ ప్రాజెక్టు అధికారులు హుటాహుటిన ఎడమ కాలువకు నీటి విడుదలను ఆపివేశారు.

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ | సోమవారం 02, సెప్టెంబర్ 2024

## భారీ వర్షాలపై గంటగంటకూ మంత్రి లోకేష్ సమీక్ష

**మంగళగిరి, మహానాడు:**
మంగళగిరి నియోజకవర్గంలో ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ ఎప్పటికపుడు అధికారులతో పరిస్థితిని సమీక్షిస్తున్నారు. పార్టీ కార్యాలయ కంట్రోల్ రూమ్ ద్వారా గంటగంటకూ పరిస్థితులను వాకబు చేస్తూ సహాయ చర్యలపై అధికారులకు సూచనలు ఇస్తున్నారు. వరద ముంపునకు గురైన రత్నాల చెరువు ప్రాంత వాసులకు తక్షణమే సహాయం అందించాలని ఆదేశించారు.

భారీవర్షం కారణంగా బ్లాక్ అయిన రోడ్లను వెంటనే క్లియర్ చేసి రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాల్సిందిగా సూచించారు. అదేవిధంగా నియోజకవర్గంలో విద్యుత్ సరఫరాకు ఎటువంటి ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలని ఎలక్ట్రిసిటీ అధికారులను ఆదేశించారు. వరద ముంపు ప్రాంతాల్లో ప్రజలకు ఆహారం, మంచినీరు అందిస్తూ సహాయ కార్యక్రమాల్లో



పాల్గొనాల్సిందిగా పార్టీ శ్రేణులను కోరారు. తుపాను తీవ్రరూపం దాల్చుతున్నందున అధికారులంతా 24/7 అందుబాటులో ఉండాలని, అవసరాన్ని బట్టి పునరావాస శిబిరాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

## అర్ధరాత్రి వేళ ముంచెత్తిన రామిలేరు వరద!

- **ప్రజలను అప్రమత్తం చేసిన ఎమ్మెల్యే చింతమనేని**

**దెందులూరు, మహానాడు:**
అర్ధరాత్రి వేళ రామిలేరు వరద ముంచెత్తింది. ముంచుకొస్తున్న వరద నుంచి ప్రజలను కాపాడటానికి దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ వేకువజామున రెండు గంటలకు స్వయంగా రంగంలోకి దిగారు. 'అమ్మా వరద వచ్చేస్తుంది... నిద్ర లేవండి... నేను పడవలు తెప్పిస్తాను... ఈలోపు డాబాల పైకి



వెళ్ళండి' అంటూ రామిలేరువాగు వరద ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలను స్వయంగా అప్రమత్తం చేశారు.

తాళ్ళమూడి సహా పలు గ్రామాల్లోని జనావాస ప్రాంతాల్లోకి వరద నీరు ముంచెత్తుతుండటంతో నిద్ర మత్తులో ఉన్న ప్రజలను




వరద గురించి హెచ్చరించారు. ఎమ్మెల్యే చింతమనేని హెచ్చరికలతో అప్రమత్తమై ప్రజలు తమ ఇంటి డాబాలపైకి చేరుకున్నారు. ఈ నేపథ్యంలో ఏలూరు కలెక్టర్ వెట్రీ సెల్వీతో ఫోన్లో మాట్లాడిన ఎమ్మెల్యే రామిలేరు వాగు వరద తీవ్రతను వివరించారు. ఎటువంటి ప్రాణ ఆస్తి నష్టం కలగకుండా తక్షణమే అన్ని రకాల చర్యలు చేపట్టాలని, దిగువన ఉన్న లాకులు తెరవటం వంటి సత్వర చర్యల ద్వారా వరద ప్రవాహ తీవ్రతను జనావాసాల వైపు తగ్గించేలా చర్యలు చేపట్టాలని, పడవల ద్వారా లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించేలా తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆదేశాలతో రెస్క్యూ బృందాలు రంగంలోకి దిగాయి.

## ఏలూరు జిల్లాలో వర్ష పరిస్థితిపై ముఖ్యమంత్రి ఆరా!

- **నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని మంత్రికి ఆదేశం**

**ఏలూరు, మహానాడు:**
ఏలూరు జిల్లాలో వర్ష పరిస్థితిపై రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథిని టెలిఫోన్ ద్వారా ప్రత్యేకంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అడిగి తెలుసుకున్నారు. జిల్లా యంత్రాంగాన్ని అపప్రమత్తం చేసి ఎటువంటి నష్టం సంభవించకుండా పటిష్ఠ చర్యలు తీసుకున్నామని ముఖ్యమంత్రికి మంత్రి వివరించారు. జిల్లాలో ప్రస్తుత పరిస్థితిని ముఖ్యమంత్రికి మంత్రి పార్థసారధి తెలియజేస్తూ జిల్లాలో ఎటువంటి ప్రాణ, ఆస్థి నష్టాలు కలగకుండా చర్యలు తీసుకున్నామని, ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉందని మంత్రి చెప్పారు. అధికారులను ముందుగానే అప్రమత్తం చేయడంతో నష్టం జరగకుండా చూడగలిగామని ఈ సందర్భంగా మంత్రి ముఖ్యమంత్రికి తెలిపారు.

జిల్లా, డివిజన్, మండల స్థాయి రెవిన్యూ కార్యాలయాలలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి, పరిస్థితిని ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షిస్తున్నామని, కాజ్ వే వద్ద ఎటువంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకున్నామని మంత్రి వివరించారు. మండల ప్రత్యేక అధికారులు సంబంధిత మండలంల్లోనే బస ఉండి, ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. నూజివీడు మండలంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించామన్నారు.

రాష్ట్ర విపత్తు నివారణ దళాన్ని కూడా నూజివీడు ప్రాంతంలో సిద్ధం చేశామని, 200 మందిని నూజివీడులో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు తరలించి, భోజన, వసతి సౌకర్యాలు కల్పించామన్నారు.

భద్రాచలం వద్ద గోదావరి వరద నీటి మట్టం, నాగిరెడ్డిగూడెం వద్ద తమ్మిలేరు నీటి మట్టం పెరుగుతున్న దృష్ట్యా ఆయా తీర ప్రాంతంలోని ప్రజలను అపప్రమత్తం చేశామని, ముంపునకు గురయ్యే ప్రాంతాలను ముందుగానే గుర్తించి ఆ ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నామన్నారు. జిల్లాలో పరిస్థితిని ఎప్పటికప్పుడు తనకు తెలియజేయాలని ముఖ్యమంత్రి మంత్రి పార్థసారథి కి సూచించారు.

## ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి

- **టీడీపీ 'దర్శి' ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి**

**దర్శి, మహానాడు:**
తుపాను దృష్ట్యా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా వృద్ధులు, చిన్న పిల్లలను ఆయా కుటుంబాల వారు జాగ్రత్తగా చూసుకోవాలని తెలుగుదేశం పార్టీ(టీడీపీ) దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి సూచించారు. మరికొన్ని జాగ్రత్తలను ఆమె సూచించారు.

- పాత ఇండ్లల్లో, పాత గోడల మధ్య ఉండవద్దు.
- వర్షం పడేటప్పుడు విద్యుత్ మరమ్మతులు చేయవద్దు.
- చిన్న పిల్లలు ఇంటి నుంచి బయటికెళ్లకుండా జాగ్రత్తపడాలి.
- ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్ళవద్దు.
- వర్షం పడుతున్నప్పుడు రోడ్ల మీద, చెట్లకిందా ఉండకూడదు.
- రోడ్ల మీద వాహనాలపై వేగంగా వెళ్ళకూడదు.
- గోరు వెచ్చని నీళ్లు తాగుతూ ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలి



గుండ్లకమ్మ నది పరివాహక ప్రాంతాల ప్రజలు, వాగుల పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తతో వ్యవహరించాలని కోరారు. ముఖ్యంగా రైతులు, పశువుల కాపర్లు, చిన్నపిల్లలు, వృద్ధులు, యువకులు, మహిళలు చెరువుల వైపు వాగులు వంకలు దాటే ప్రయత్నం చేయవద్దని కాలువల వైపు వెళ్ళద్దని విజ్ఞప్తి చేశారు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు కూడా గ్రామాల సచివాలయ సిబ్బంది సహకారంతో ప్రజలను అప్రమత్తత చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని డాక్టర్ లక్ష్మి కోరారు. విద్యుత్ తీగల స్తంభాలు ఉన్న ప్రాంతాలలో కూడా తగిన జాగ్రత్తలు వహించాలని సూచించారు. అధికార యంత్రాంగంతో తాను ఎప్పటికప్పుడు మాట్లాడుతున్నట్లు తెలిపారు. ప్రజలకు ఏ అవసరం వచ్చినా తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులు, అధికారులు అందుబాటులో ఉంటారని లక్ష్మి తెలిపారు.




## వైసీపీ నేత పేర్ని నాని, ఇంటూరి రవికిరణ్‌పై కోడిగుడ్లతో దాడి!

**గుడివాడ, మహానాడు:**
మహిళలు, తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకుల ఫోటోలు మార్ఫింగ్ చేసినట్టు అభియోగాలు ఎదుర్కొంటున్న ఇంటూరి రవికిరణ్ అనే వ్యక్తిని గుడివాడ పోలీసులు అదుపులోకి తీసుకోగా స్టేషన్ బెయిల్‌పై బయటకు వచ్చారు.

అతని కోసం మాజీ మంత్రి పేర్ని నాని వెళ్ళారు. ఈ విషయం తెలుసుకున్న ప్రజలు వారిద్దరిపై కోడిగుడ్లతో దాడి చేసి తరిమి కొట్టారు.

ఇటువంటి వారికి ప్రజాకోర్టులోనే గుణపాఠం నేర్పాలని మహిళలు డిమాండ్ చేశారు.

## నీట మునిగి ముగ్గురు విద్యార్థుల మృతి

- **పెద్దారవీడు మండలంలో విషాదం**

**ప్రకాశం, మహానాడు:**
ప్రకాశం జిల్లా పెద్దారవీడు మండలం, కొత్తపల్లి గ్రామంలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. పంట పొలానికి ఏర్పాటు చేసుకున్న నీటికుంటలోకి దిగిన ముగ్గురు విద్యార్థులు ఊపిరాడక మృతి చెందారు.





ఆదివారం సెలవు దినం కావడం.. గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వాన ఆదివారం మధ్యాహ్నం తర్వాత తగ్గడంతో కొందరు విద్యార్థులు ఆటలాడుకుంటూ గ్రామ సమీపంలోని ఓ రైతు ఏర్పాటు చేసుకున్న నీటికుంట వద్దకు చేరుకున్నారు. ఓ విద్యార్థి ప్రమాదవశాత్తు కాలుజారి నీటికుంటలోకి పడి మునిగిపోవడంతో ఆ విద్యార్థిని రక్షించడానికి మరో ఇద్దరు ప్రయత్నించిన క్రమంలో వారు కూడా నీటికుంటలోకి పడిపోయారు. మొత్తం ముగ్గురూ మునిగిపోయారు. ఈ సంఘటనతో నిశ్చేష్టులైన మిగతా విద్యార్థులు పరుగులు పెట్టి గ్రామస్తులకు చెప్పారు. వారంతా సంఘటన స్థలానికి చేరుకుని, ఆ విద్యార్థులను బయటకు తీసి, మార్కాపురంలోని ప్రభుత్వ వైద్యశాలకు తీసుకువెళ్ళారు. అయితే, విద్యార్థులు మృతి చెందినట్టు వైద్యులు తెలపడంతో బోరున విలపించారు.

మార్కాపురంలోని ఓ ప్రైవేటు విద్యాసంస్థలో ఆరో తరగతి చదువుతున్న కొత్తపల్లి శివ(11), స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న ఆరవీటి ఏడుకొండలు(9), కొత్తపల్లి మను(9) మృతి చెందారు. సమా చారం తెలుసుకున్న సబ్ కలెక్టర్, రెవెన్యూ, పోలీసు అధికా రులు గ్రామానికి చేరుకుని నీటికుంటను పరిశీలించారు.

### మంతి లోకేష్ దిగ్భ్రాంతి

ప్రకాశం జిల్లా పెద్దారవీడు మండలం ఎస్.కొత్తపల్లిలో కొత్తపల్లి శివ, కొత్తపల్లి మను, ఆరవీటి ఏడుకొండలు మృతి చెందిన ఘటన తీవ్ర ఆవేదనకు గురిచేసిందని రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ ఒక ప్రకటనలో తెలిపారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నానని, వీరికి ప్రభుత్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఫోన్

- **అవసరమైతే సహాయక చర్యలు అందిస్తామని హామీ**

**హైదరాబాద్, మహానాడు:**
రాష్ట్రంలో వర్షాలు, వరద పరిస్థితుల దృష్ట్యా సీఎం రేవంత్ రెడ్డికి కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఫోన్ చేశారు. పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో వరదల తో వాటిల్లిన నష్టాన్ని ముఖ్యమంత్రి వివరించారు. ప్రాణ నష్టం జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామని అమిత్ షాకు చెప్పారు. అవసరమైన తక్షణ సాయం అందిస్తామని అమిత్ షా హామీ ఇచ్చారు.

కేంద్ర ప్రభుత్వం తరపున అవసరమైన వరద సహాయక చర్యలు అందిస్తామని తెలిపారు. ఇదిలా వుండగా, రాష్ట్ర



స్థాయి అధికారులు, అన్ని జిల్లాల కలెక్టర్ల తో నేరుగా మాట్లాడి ఎప్పటికప్పుడు పరిస్థితిని ముఖ్యమంత్రి సమీక్షిస్తున్నారు. అవాంఛనీయ పరిస్థితులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం అప్రమత్తం చేశారు. బాధిత కుటుంబాలను ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

## 100 పునరావాస కేంద్రాలకు 13,227 మంది తరలింపు

- **రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి అనిత వెల్లడి**


**అమరావతి, మహానాడు:**
రాష్ట్రంలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ముంపు బారిన పడిన 294 గ్రామలకు చెందిన 13,227 మందిని పునరావాస కేంద్రాలకు తరలించామని రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు.

తాడేపల్లిలోని విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలోని స్టేట్ ఎమర్జన్సీ ఆపరేషన్ సెంటర్ నుంచి ఆదివారం వరద పరిస్థితులను సమీక్షించారు.

ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ ఎన్టీఆర్, కృష్ణా, బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల్లో అధిక వర్షాల కారణంగా ఇంత వరకు 100 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి 13,227 మందిని తరలించామన్నారు. ఆయా ప్రాంతాల్లో 61 మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేశామన్నారు. ఇంతవరకు భారీ వర్షాల కారణంగా తొమ్మిది మంది మరణించారని తెలిపారు. పోలీస్, ఎస్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బెటాలియన్ల బృందాలు ముంపు ప్రాంతాల్లోని 600 మందిని రక్షించి సురక్షిత ప్రాంతాలకు తరలించాయన్నారు.

మొత్తం 17 బృందాలు 7 జిల్లాల్లోని 22 ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టాయన్నారు. ఎటువంటి అత్యవసర పరిస్థితులనైన ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, దీనికి అవసరమైన 05 బోట్లు , 01 హెలికాప్టర్ సిద్ధంగా ఉంచామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో అధిక వర్షాల కారణంగా ఏర్పడిన పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తూ మంత్రులు అధికారుల సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టాలని నిర్దేశించారన్నారు. వర్షాలు పూర్తిగా తగ్గిన తరువాత పంటనష్టంపై ఎన్యూమరేషన్ చేపడతామని చెప్పారు.

ఇప్పటి వరకు అందిన ప్రాథమిక సమాచారం ప్రకారం 14 జిల్లాల్లోని 62,644 హెక్టార్లలో వరిపంట నీట మునిగిందని, 7218 హెక్టార్లలో ఉద్యాన వన పంటలు నీట మునిగిందని మంత్రి అన్నారు. రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్, పంచాయతీరాజ్, మున్సిపల్, వైద్య, విద్యుత్ మొదలగు ప్రభుత్వ శాఖలన్ని సమన్వయంతో పనిచేసి యుద్ధ ప్రాతిపాదికన చర్యలు తీసుకోవడం వలన ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించగలిగారని అన్నారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లోను కమాండ్ కంట్రోల్ రూమ్, టోల్ ఫ్రీ నెంబర్లు ఏర్పాటు చేసి



నోడల్ అధికారులను నియమించి ఎప్పటికప్పుడూ పరిస్థితులను సమీక్షిస్తూ సహాయక చర్యలను చేపడుతున్నామన్నారు.

రాయనపాడు రైల్వే స్టేషన్లో వరద నీరు చేరడంతో తమిళనాడు ఎక్స్‌ప్రెస్‌ను నిలుపుదల చేసిన కారణంగా ప్రయాణికులను వారి వారి గమ్యస్థానాలకు ఆర్టీసీ బస్సుల ద్వారా తరలించేందు ప్రత్యామ్నయ ఏర్పాటు చేశామన్నారు. ప్రయాణికులకు ఆహారం, మంచినీరు ఏర్పాటు చేశామన్నారు. పలు ప్రాంతాల్లో వాగులు, వంకలు పొంగిపొర్లి ప్రవహిస్తున్నందున ప్రజలు వాటిని దాటే విషయంలో ప్రభుత్వ హెచ్చరికలు పాటించాలని, ప్రభుత్వానికి సహకరించాలని మంత్రి వంగలపూడి అనిత కోరారు.

ఈ సమీక్షలో సీసీఎల్ఏ చీఫ్ కమిషనర్ జి.జయలక్ష్మి, సీసీఎల్ఏ కమిషనర్ శ్రీకేష్ బాలజీ, విపత్తుల సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్, తదితరులు పాల్గొన్నారు.

జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ | సోమవారం 02, సెప్టెంబర్ 2024

# వీఆర్‌కు గుంటూరు పట్టాభిపురం సీఐ?

**అమరావతి, మహానాడు:**
గుంటూరు పట్టాభిపురం సీఐను ఆ శాఖ ఉన్నతాధికారులు వీఆర్‌కు పంపించారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం భూమిని అమ్మ లేదన్న కారణంతో ఓ కుటుంబంపై గుంటూరు పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే భర్త దాడికి దిగారు. బాధితులు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో కేసు నమోదు చేయాలని న్యాయస్థానం ఆదేశించింది. దీంతో శాసన సభ్యురాలు భర్తపై గుంటూరు నగరంలోని పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారంలో బాధితులకు అండగా నిలవాల్సిన పోలీసులు బాధితుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించారని పట్టాభిపురం సీఐని విఆర్‌కు పంపినట్టు సమాచారం. ఇప్పటికే ఈ వ్యవహారం నగరంలో హాట్ టాపిక్‌గా మారింది.







## అత్యవసరమైతే తప్ప బయటకు రాకండి

● కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

**హైదరాబాద్, మహానాడు:**
భారీ వర్షాలు, వరదల దృష్ట్యా ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దనికేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులుడు జి.కిషన్ రెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వృద్ధులు, చిన్నారులను ఎట్టి పరిస్థితుల్లోనూ బయటకు పంపకండి.. ప్రాణ నష్టం సంభవించకుండా అధికారులంతా చర్యలు తీసుకోండి. బీజేపీ కార్యకర్తలారా.... జాగ్రత్తగా ఉంటూ సహాయక చర్యల్లో నిమగ్నమవ్వండి. రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తుండటంతోపాటు మరో 24 గంటలపాటు అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ హెచ్చరించిన నేపథ్యంలో లోతట్టు ప్రజలంతా అత్యంత అప్రమత్తంగా ఉండాలి. నాలాలు, డ్రైనేజీ పొంగుపొర్లు తున్నందున జాగ్రత్తగా ఉండాలి. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తూ సహాయ చర్యలు చేపట్టాలి. అనేక చోట్ల విద్యుత్ తీగలు తెగిపడి కరెంట్ తీవ్ర అంతరాయం కలిగింది. నాలాలు, డ్రైనేజీలు పొంగిపొర్లి ఇండ్లల్లోకి నీళ్లు వస్తున్నాయి. కొన్ని చోట్ల చెరువులు తెగాయి. ఈ నేపథ్యంలో ప్రాణ నష్టం సంభవించకుండా ఉండేలా యుద్ధ ప్రాతిపదికన అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.



శనివారం కురిసిన భారీ వర్షాలకు నీట మునిగిన పొలాలను బాపట్ల శాసనసభ సభ్యులు శ్రీ వేగేశన నరేంద్ర వర్మ రాజు స్వయంగా వీడియో తీసి అధికారులకు పంపించారు.



భారీ వర్షాలకు జలమలమైన రామలక్ష్మి వీవర్స్ కాలనీ దక్షిణ తెలుగు పాలెం ప్రాంతాలను పరిశీలించిన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ కమిషనర్ గోపాలరావు టిడిపి నాయకులు





నిన్నటి నుంచి కురుస్తున్న భారీ వర్షాల వల్ల జగ్గయ్యపేట మండలం చిల్లకల్లు చెరువుకి గండిపడటం వల్ల వర్షపు నీరు ఊళ్లోకి రావడం వల్ల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని తెలుసుకొని చెరువు ప్రాంతాన్ని పరిశీలించిన ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మాజీ మంత్రి నెట్టెం శ్రీ రఘురామ్

## వర్షాల నుంచి ప్రజలను అప్రమత్తం చేయండి

● ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



**నందిగామ, మహానాడు:**
ఏపీలో నిన్నటి నుంచి భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తున్న దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అంబారుపేట ఐతవరం హైవే పై జలదిగ్బంధంలో చిక్కుకున్న ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్య స్థానాలకు చేరవేయాలని ఎన్టీఆర్ జిల్లా నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అధికారులకు ఆదేశించారు. ఆదివారం మధ్యాహ్నం నుంచి అనుకోని వరదతో అంబారుపేట ఐతవరం నేషనల్ హైవే 65 పూర్తిగా జలదిగ్బంధంలో చిక్కుకుపోయిందని తెలిపారు. రెవెన్యూ, పోలీస్, నేషనల్ హైవే అధికారులు నిరంతరం పరిస్థితులను పర్యవేక్షించాలని కోరారు.

నది, మునేరు ప్రాంత ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, మత్స్యకారుల వేటకు వెళ్ళొద్దని సూచించారు.

## వరద ముప్పు లేకుండా పటిష్ఠ డ్రైనేజీలు


● ఎమ్మెల్యే కొలికపూడి

**తిరువూరు, మహానాడు:**
ఎన్టీఆర్ జిల్లా తిరువూరు పట్టణంలోని చింతలకాలనీలోని ముప్పు ప్రాంతాలను, మధిర రోడ్డులో డ్రైనేజీలను ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఆదివారం పరిశీలించారు. చింతలకాలనీలో యుద్ధప్రాతిపదికన జెసీబీ సహాయంతో నీటిని బయటకు పంపే ఏర్పాటు చేయించారు. లోతట్టు ప్రాంతాల కాలనీల్లోని కొన్ని కుటుంబాలను స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి తరలించినట్టు తెలిపారు. డ్రైనేజీల్లో పూడికలను ఎమ్మెల్యే స్వయంగా పార పట్టుకొని తీవారు. ఈ సందర్భంగా ఆయన మీడియా సమావేశంలో ఏమన్నారంటే.. బాధితులకు రెండు, మూడు రోజులపాటు తాత్కాలిక పునరావాస కేంద్రం ఏర్పాటు చేసి వారికి భోజనం అన్ని సౌకర్యాలను కల్పించనున్నాం.. రాబోయే రోజుల్లో తిరువూరు పట్టణంలో పటిష్ఠ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తామన్నారు.

## ఎప్పటికప్పుడు సహాయక చర్యలు చేపట్టండి

● ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

**వినుకొండ, మహానాడు:**
భారీ వర్షాలు, వరద పరిస్థితుల నేపథ్యంలో సహాయక చర్యలపై అన్ని ప్రభుత్వ విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఆదేశించారు. వరద నష్టం, సత్వర సహాయక చర్యలపై ఆదివారం హైదరరాబాద్ నుంచి అధికారులతో ఆయన సమీక్షించారు. వ్యవసాయం, రెవెన్యూ, పంచాయతీరాజ్, జలవనరులు, విద్యుత్, పోలీస్ సహా పలు శాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఎప్పటికప్పుడు వివరాలు తెలుసుకున్నారు. రైతులకు పంటనష్టం విషయంలో వేగంగా స్పందించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీవీ వ్యవసాయ అధికారులకు సూచించారు. పంచాయతీరాజ్ అధికారులు గ్రామాల్లో సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మరీ ముఖ్యంగా మంచినీరు, పారిశుద్ధ్యం విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు.



## కేసానుపల్లి ఎస్టీ కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యే డా.చదలవాడ అరవింద బాబు

**నరసరావుపేట,మహానాడు:**
సమస్యలేని కాలనిలను సృష్టించుకుందామని నరసరావుపేట ఎమ్మెల్యే డా.చదలవాడ అరవింద బాబు అన్నారు. కేసానుపల్లి పంచాయతీ పరిధిలోని ఎస్టీ కాలనీలో పర్యటించారు.వర్షాలు తీవ్రంగా కురుస్తున్న నేపథ్యంలో పారిశు



ధ్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. గ్రామాల్లో చెత్త పేరుకుపోకుండ చూసుకోవాలని సూచించారు.గ్రామాలే అభివృద్ధికి నిలువెత్తు చిహ్నాలనీ వాటి పరిరక్షణ బాధ్యతను ప్రతి పౌరుడు తీసుకోవాలని ఎమ్మెల్యే డా.చదలవాడ అరవింద బాబు సూచించారు.

## రిస్క్ సెల్ఫీలు వద్దు

● ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి


**హైదరాబాద్, మహానాడు:**



వాగులు, నదులు పొంగి పొర్లుతుంటే పలుచోట్ల ప్రజలు వంతెనలు ఎక్కి చూడడంతో రిస్క్ సెల్ఫీలు తీసుకుంటున్నారు. ఆ సమయంలో ఎక్కడైనా వంతెన కొట్టుకుపోతే జరిగే ప్రాణనష్టం చాలా ఎక్కువగా ఉంటుంది. ఇప్పటికే ఈ విధమైన సంఘటనలు అక్కడక్కడ ఎదురవుతున్నాయి. దయచేసి వాగులు చెరు వులు నదుల వద్దకు వెళ్ళవద్దని, ముఖ్యంగా సెల్ఫీలు ఫోటోగ్రాఫ్ లను తీసుకోవద్దని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి కోరారు.

## ప్రభుత్వం అత్యవసర బృందాలు ఏర్పాటు చేయాలి

● మాజీ మంత్రి హరీష్ రావు



**దేవరకొండ, మహానాడు:**
వాయుగుండంతో రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్నాయని, ప్రభుత్వం వెంటనే స్పందించి ఎక్కడికక్కడ అత్యవసర సేవలందించేందుకు బృందాలు ఏర్పాటు చేయాలని మాజీ మంత్రి హరీష్ రావు కోరారు. ఈ మేరకు ఆయన నల్గొండ జిల్లా దేవరకొండలో మీడియాతో మాట్లాడారు. అవసరమైతే సైన్యం సహాయం తీసుకోవాలి.. ప్రత్యేక హెలికాప్టర్‌లు తెప్పించాలి. పూర్తిగా నిండిన చెరువులు కాలువలు తెగకుండా ఇరిగేషన్ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలి. బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఎక్కడికక్కడ ఆపదలో ఉన్న బాధితులకు సహాయక చర్యలు అందించాలి.. మరో రెండు రోజులు భారీ వర్షాలు ఉన్నాయి అంటున్నారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేస్తున్నాం. అధికారులకు సెలవులు రద్దుచేసి 24 గంటలు అప్రమత్తంగా ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

ప్రమాదకరంగా ప్రవహించే వరదల్లో, చెరువులు, కాలువలు వద్దకు ఎవరు వెళ్ళవద్దు. పోలీసులు ప్రత్యేక బారికేడ్లు ఏర్పాటు చేసి ప్రజలను సురక్షితంగా కాపాడాలి.



భారీ వర్షాల కారణంగా గుంటూరు తూర్పులో ముంపునకు గురైన ప్రాంతాలను పరిశీలించిన కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, గుంటూరు తూర్పు శాసనసభ్యులు మొహమ్మద్ నసీర్



జగన్ జరదేఖో, మంత్రిలంటే ఇలా వుండాలి.... ప్రజలకు కష్టం వచ్చినపుడు మంత్రులు ఎమ్మెల్యేలు ఎంపీలు..ముందు ఉండాలి...

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ | సోమవారం 02, సెప్టెంబర్ 2024



## నష్టపోయిన ప్రతి ఒక్కరికీ

# న్యాయం చేస్తాం..

(మొదటిపేజీ తరువాయి..)

బుడమేరు ముంపు ప్రాంతాల గురించి అడిగి తెలుసుకున్నారు. వరద ప్రవాహం వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్న అనంతరం తాజా వర్షాలు ఓ పాఠంగా అధికారులు అధ్యయనం చేయాలని సూచించారు.ప్రాణనష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ప్రతి ఒక్కబాధితుడికి సాయం అందించాలన్నారు. తుపాను తీరం దాటినచోట కంటే ఇతర చోట్ల ఎక్కువ వర్షాలు జలాశయాలన్నీ దాదాపు నిండిపోయాయని ఈ నేపథ్యంలో వాగులు, చెరువులకు నీరు వెళ్లే దారిలో సత్వర చర్యలు చేపట్టాలని, సాధారణ పరిస్థితులు నెలకొనేవరకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన వర్షాల వల్ల రాష్ట్రం మొత్తం అతలాకుతలం అయింది. ఎప్పుడూ పడనటువంటి వర్షపాతం ఇక్కడ నమోదైన పరిస్థితి. వత్సవాయిలో 32.3 సెం.మీ అంటే 323 మి.మీ లు, జగ్గయ్యపేటలో 20.27 సెం.మీ అంటే 261మి.మీలు, తిరువూరులో 26.0 సెం.మీ, గుంటూరులో 26.0 సెం.మీ వర్షపాతం నమోదు అయింది. 14 మండలాల్లో సగటున 24 గంటల వ్యవధిలో 20 సెం.మీ కంటే ఎక్కువ వర్షపాతం నమోదు అయింది.

మరోపక్కన 62 ప్రాంతాల్లో 112 సెం.మీ నుండి 20 సెం.మీ ల వర్షపాతం నమోదు అయింది. 94 స్టేషన్ లలో 14 జిల్లాల్లో 7 నుండి 12 సెం.మీ ల వర్షపాతం నమోదు అయింది. గతంలో హైదరాబాద్ లో 20 సెం.మీల కంటే ఎక్కువ వర్షపాతం నమోదు అయినప్పుడు సర్ఫస్ వైరు బ్రీచ్ చేసి ఎవాక్యువేషన్ వాటర్ చేశాం. దీనివల్ల విజయవాడ, గుంటూరు నగరాలు మెరుగైన పరిస్థితికి వచ్చాయి. గుంటూరు – విజయవాడ, విజయవాడ – హైద్రాబాద్ నేషనల్ హైవేలో కాజ, జగ్గయ్యపేట వద్ద మెరుగైన పరిస్థితి వచ్చింది. ఇది బాధాకరమైన విషయం.

నిన్నటి నుండి ఇప్పటివరకు 4 సార్లు టెలికాన్ఫరెన్స్ లు నిర్వహించాను. ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేశాను. చీఫ్ సెక్రటరీ, రెవెన్యూ సెక్రటరీ, కమిషనర్, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి వనిత డిజాస్టర్ మేనేజ్ మెంట్ కంట్రోల్ రూమ్ లో ఉండి పరిస్థితిని పర్యవేక్షించారు. పకడ్బందీ మానిటరింగ్ వల్ల చాలా వరకు మరణాల సంఖ్యను తగ్గించగలిగాం.

ఒకే చోట ల్యాండ్ స్లైడ్ జరిగి ఐదుగురు చనిపోవడం, ఇంకో చోట ముగ్గురు వీరిలో ఇద్దరు వాగులో కొట్టుకుపోవడం, మరో చోట మంగళగిరిలో 80 యేళ్ల వృద్ధురాలు ల్యాండ్ స్లైడ్ బోల్డర్స్ పడి చనిపోవడం దురదృష్టకరం. మొత్తంగా 9 మంది, ఒక మిస్సింగ్ కేసు ఉండటం బాధాకరం. ప్రాణనష్టాన్ని కొంత వరకు తగ్గించాం. ఈ 9 మంది కూడా చనిపోకుండా ఉండి ఉంటే బాగుండేది.

ఈరోజు రిజర్వాయర్స్ అన్నీ నిండుకున్నాయి. ఈ పరిస్థితిల్లో వచ్చిన వాటర్‌ను వచ్చినట్లే ఎవాక్యువేషన్ చేయాల్సిన అవసరం ఉంది. ఉదాహరణకు శ్రీశైలం నుండి క్రిందికి వాటర్ ఫుల్ గా వస్తోంది. అక్కడి నుండి నాగార్జున సాగర్, అక్కడి నుండి పులిచింతల ఫుల్ అయింది. మధ్యలో నల్గొండ, ఖమ్మం జిల్లాల నుండి బుడమేరు, ఇతర వాగుల ద్వారా నీరు వచ్చి చేరింది. దీంతో 1 లక్ష నుండి 2 లక్షల క్యూసెక్కులు లేదా 3 లక్షల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుందా ? అన్న పరిస్థితిని అంచనా వేయలేకపోతున్నాం.

దీంతో ఈరోజు మధ్యాహ్నం 3 గంటల వరకు ప్రకాశం బ్యారేజ్ కు 8,90,000 క్యూసెక్కుల నీరు వచ్చి చేరిన పరిస్థితి. రేపటికి 10 లక్షలు గానీ 10.5 లక్షల క్యూసెక్కుల నీరు వచ్చి చేరే అవకాశం. కొన్ని చోట్ల చిన్న చిన్న సమస్యలు ఉన్నాయి. బుడమేరు దగ్గరకు భారీగా నీరు చేరడంతో వీటీపీఎస్ లో విద్యుత్ ఉత్పత్తి ఆగిపోయింది. బుడమేరు నుండి నేరుగా కొల్లేరు సరస్సు కు వెళ్లాల్సిన నీరు వెళ్లకుండా విజయవాడ పైన పడిన పరిస్థితి.. ఇప్పటికే సబ్ మెర్జన్స్ లో ఉంది.

బుడమేరు బ్రీచ్ వల్ల మళ్లీ నీరు వస్తున్న పరిస్థితి. ఇప్పుడు అక్కడకు వెళ్లి గండి పూడ్చడానికి కూడా వీలులేని పరిస్థితి. దీనిని పరిష్కరించేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నాం. ప్రకాశం బ్యారేజ్ కు 10 లక్షలు లేదా 10.5 లక్షల క్యూసెక్కుల నీరు వచ్చి చేరినప్పుడు కొన్ని వీక్ బండ్స్ ఉన్నాయి. ఇసుక బస్తాలు పెట్టి ఏమేం చేయాలో అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

కలెక్టర్లను అప్రమత్తం చేశాం. బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించే ప్రయత్నం చేస్తున్నాం. వీక్ బండ్స్ ను పటిష్ఠం చేస్తాం. ఇది మీ ప్రభుత్వం.. అన్ని విషయాల్లో శ్రద్ధ తీసుకున్నాం. వరద ముంపు నుండి జనాలను రక్షించేందుకు తీసుకుంటున్న సహాయక చర్యల్లో ప్రజలు కూడా భాగస్వామ్యులు కావాలని విజ్ఞప్తి చేస్తున్నాం. వీలైనంత వరకు ప్రాణ నష్టాన్ని, పశువుల నష్టాన్ని కాపాడగలిగాం.

వరదల వల్ల ఆస్తి నష్టం, పంటలు బాగా దెబ్బతిన్న పరిస్థితి. 1,11, 259 హెక్టార్లో వ్యవసాయ పంట నష్టం సంభవించింది. హార్టి కల్చర్ లో 7,360 హెక్టార్ల పంట దెబ్బతింది. పెదకాకాని వద్ద ఒక సమ్మర్ స్టోరేజ్ దెబ్బతింది. అదే విధంగా పెద్ద ఎత్తున రోడ్లు ధ్వంసమయ్యాయి. 2, 3 రైళ్లు ఆగిపోయాయి. యుద్ధ ప్రాతిపదికన పునరావాస చర్యలు చేపట్టాం.

107 క్యాంపులు పెట్టాం. 17,000 మందిని క్యాంపులకు తరలించాం. ఎక్కడ కూడా క్యాజువాలిటీ జరగకూడదనే ఉద్దేశంతో ఇష్టం లేని వారిని కూడా క్యాంపులకు తరలించాల్సి వచ్చింది. అన్ని చోట్ల ముందస్తు చర్యలు చేపట్టాం. పంటలు దెబ్బతిన్న చోట్లకు 8 మోటరైజ్డ్ బోట్లను పంపించాం. రెండు చాపర్లు కూడా పని చేస్తున్నాయి. ఇవన్నీసమన్వయంతో ఎక్కడా నష్టం వాటిల్లకుండా సమర్థవంతంగా పనిచేస్తున్నాయి. అన్ని విధాల చర్యలు తీసుకుంటాం. ప్రాణ నష్టం లేకుండా చూస్తాం.

రిహాబిలిటేషన్ చర్యలు కూడా చేపడతాం. పరిహారం అందించే ప్రక్రియ ప్రారంభిస్తాం. పరిహారం కూడా పెంచాం. ప్రతి ఒక్కరికీ 25 కేజీల బియ్యం, ఒక కేజీ పప్పు, ఒక కేజీ పంచదార, ఒక కేజీ ఉల్లిపాయలు, ఒక కేజీ పొటాటో, ఒక కేజీ ఆయిల్ ఈ ఐదు వస్తువులు ఇస్తాం. వీవర్స్ కు పనులు ఒకట్రెండు నెలలు ఉండవన్న ఉద్దేశంతో వారికి అదనంగా మరో 25 కేజీల బియ్యం అందిస్తాం. మత్స్యకారుల కూడా అదనంగా మరో 25 కేజీల బియ్యం అందిస్తాం. గతంలో లేని విధంగా 5 లక్షల ఎక్స్ గ్రేషియా అనౌన్స్ చేశాం. వీలైనంత త్వరగా బాధితులకు ఇవన్నీ పంపిణీ చేస్తాం. ఎవరికీ ఏ ఇబ్బంది లేకుండా పటిష్ఠ చర్యలు తీసుకుంటాం.

కళింగపట్నం దగ్గర తుఫాన్ తీరం దాటింది. వర్షాలు మాత్రం గుంటూరు, కృష్ణాలో పడ్డాయి. తీరం దాటిన తర్వాత నల్గొండ, ఖమ్మం లో వర్షాలు పడుతున్నాయి. తీరం దాటిన చోట ఇంత వర్షపాతం లేదు. అక్కడ పెద్దగా గాలి కూడా లేదు. ఒక్కోసారి గాలి, మేఘాలు కదిలిన పరిస్థితులను బట్టి ఇలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయి.

ఈ సంవత్సరం భారీగా వర్షాలు పడ్డాయి. మామూలు అయితే ఈ నెలలో 5 మి.మీల వర్షపాతం నమోదు కావాలి కానీ 43.2 మి.మీల వర్షపాతం ఇప్పటివరకు నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా చూస్తే 28.5 అదనంగా వర్షపాతం నమోదైంది. 3 జిల్లాల్లో 60 శాతం కన్నా ఎక్కువ వర్షపాతం నమోదైంది. 19 జిల్లాల్లో 20– 50 శాతం ఎక్కువ వర్షపాతం నమోదైంది. 4 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. భవిష్యత్‌లో కరవు రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ను తీర్చిదిద్దుతాం.

తుఫాన్‌లు, విపత్తులు వచ్చినా ముందు జాగ్రత్తలు తీసుకునేలా ఇలాంటి విపత్తు నిర్వహణ కేంద్రాలను మరింత బలోపేతం చేస్తాం. ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, నివేదికలు రప్పించుకొని మానిటరింగ్ మెకానిజాన్ని డెవలప్ చేసుకుంటాం. వర్షపాతం నమోదైనప్పుడు ఆస్తి,ప్రాణ నష్టాలు లేకుండా చూస్తాం. గ్రామాలు, పట్టణాల్లో వాగులు, వంకల్లో వీక్ బండ్స్ ను పటిష్టం చేస్తాం.. గత 5 ఏళ్లుగా శ్రద్ధ పెట్టని కారణంగా వారసత్వంగా కొన్ని సమస్యలు వచ్చాయి. వాటన్నింటిని క్లియర్ చేస్తాం.గత 5 ఏళ్లలో బుడమేరు ఛానల్ ను సరిచేయకపోవడం వల్ల దాని పర్యవసానం వీటీపీఎస్ మునిగిపోయే పరిస్థితికి వచ్చింది. విజయవాడ పట్టణం ముంపుకు గురయ్యే పరిస్థితి వచ్చింది. అది సరిగా చేసి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదు.

కూటమి ప్రభుత్వం వచ్చి 3 నెలలు కూడా కాలేదు అప్పుడే విమర్శలు మొదలుపెట్టారు. అన్ని సమస్యలు అధ్యయనం చేస్తున్నాం. ఒకప్పుడు వరదలు వచ్చినప్పుడు డ్రైనేజీలు కూడా సరిగా లేకపోతే ముఖ్యమంత్రి, మంత్రులు రోడ్ల మీదకు రాలేదు. నేడు ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రజాప్రతినిధులు, మొత్తం పరిపాలన యంత్రాంగం ఫీల్డ్ లో ఉంది.

ఇది బాధ్యత కలిగిన ప్రభుత్వం. ప్రతి అంశాన్ని సున్నితంగా పరిశీలిస్తాం. అట్ మోస్ట్ కేర్ తో హ్యాండిల్ చేస్తాం. పరిస్థితి సాధారణ స్థితికి వచ్చేంత వరకు అన్ని జాగ్రత్తలు తీసుకుంటాం. సూపర్ సైక్లోన్, హుద్ హుద్, ట్రిప్లిన్ మొదలుకొని ఏ సైక్లోన్ ను అయినా సమర్థవంతంగా హ్యాండిల్ చేశాం. ఈ తుఫాన్ ను కూడా అదే మాదిరిగా హ్యాండిల్ చేస్తాం. భవిష్యత్ కు కూడా ఒక డాక్యుమెంటేషన్ తయారు చేసుకుని ముందుకు వెళ్తాం.

ప్రకాశం బ్యారేజ్ కు 10 లక్షలు లేదా అంతకు పైగా క్యూసెక్కుల నీరు వస్తే ఎలా హ్యాండిల్ చేయాలన్నదే మా తక్షణ కర్తవ్యం. అలాగే నష్టపోయిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేసే దిశగా ముందుకు వెళ్తాం. రైతులను ఆదుకునేందుకు ఏమేం చేయాలో చేస్తాం. మళ్లీ వ్యవసాయాన్ని కాపాడుతాం. పంటను కాపాడటమే కాదు ఇన్ ఫుట్ సబ్సిడీ ఇచ్చి పంటను రివైవ్ చేయడానికి ఏం చేయాలో చేస్తాం.

**మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు:**

50 సంవత్సరాల్లో ఎప్పుడూ రానటువంటి వరద వచ్చింది. ప్రజలు కూడా ఎన్నో వరదలు చూశామన్న భావనలో ఉన్నారు కానీ ఒకే ప్రాంతంలో ఇంత ఎక్కువ వర్షపాతం పడటం ఇదే మొదటి సందర్భం. గుంటూరు, విజయవాడలో 37 సెం.మీల వర్షపాతం నమోదవడం అబ్ నార్మల్. ఇదే క్లౌడ్ బ్రస్టింగ్.. నేషనల్ హైవేస్ అన్ని డిజైన్ ల 50 సంవత్సరాల డేటా తీసుకొని ఆ హైట్ పెడతారు. అలాంటిది ఓవర్ ఫ్లో అయ్యే పరిస్థితి వచ్చింది.

దీంతో సబ్ మెర్జన్స్ కు తీసుకెళ్లే పరిస్థితికి వచ్చాయి. బ్రిటీష్ వాళ్లు కట్టిన రైల్వే బ్రిడ్జెస్ చూస్తే వాళ్లు 100 సంవత్సరాలకు పెట్టుకొని దానికంటే 25– 50 శాతం యాక్సెస్ కెపాసిటీ పెట్టారు. ఆల్ అవుట్ లెట్స్ చూస్తే బ్రిటీష్ వారు కట్టిన బ్రిడ్జిలు ఎక్కడా ఓవర్ ఫ్లో కావడం లేదంటే అంత దూరదృష్టితో కట్టారని అర్థం. మనం కూడా కట్టినప్పటికీ ఒక్కోసారి మనం ఊహించని విధంగా వాతావరణ మార్పుల కారణంగా ఇలా జరుగుతుంటాయి.

ప్రజలందరికీ కూడా ఒకటే విజ్ఞప్తి చేస్తున్నాను.. వాళ్లల్లో కూడా ఒక వాస్తవం ఉంది.. గవర్నమెంట్ అంటే వీళ్లకు ఏమీ తెలియకుండా మాట్లాడుతారనే ఫీలింగ్ ఉంది. మేం అన్నీ చూశాం వీళ్లకేం తెలుసని. మేం కూడా డేటా బేస్ చేసుకొని సైంటిఫిక్‌గా అప్రోచ్ అవుతాం. ఇప్పటికి కొన్ని తప్పులు జరిగినా భవిష్యత్ లో మాత్రం సిస్టమేటిక్‌గా చేయడానికి ప్రయత్నం చేస్తాం.

అందులో నో సెకండ్ థాట్. ప్రజలు, పిల్లల భద్రతే మాకు ముఖ్యం. వారి భద్రతకు విఘాతం కల్గించే ప్రయత్నం ఎవరు చేసినా ప్రభుత్వం ఉపేక్షించదు. చాలా కఠినంగా వ్యవహరిస్తాం. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. జాగ్రత్తగా ఉండమని అందరినీ కోరుతున్నాను.

ఎల్లుండి వర్షాలు తగ్గుతాయని పాఠశాలలకు, కళాశాలలకు రేపు హాలిడే డిక్లేర్ చేశాం. నిన్న మధ్యాహ్నం నుండి వర్షం ఆగింది. కానీ క్యాచ్ మెంట్ ఏరియాలో పడినటువంటి వర్షాల వల్ల నదులన్నీ పొంగే పరిస్థితికి వచ్చాయి. ఈ నేపథ్యంలోనే రేపటి వరకు హాలిడే ప్రకటించాం. ఈ అంశంపై ఎల్లుండి రివ్యూ చేసుకుందాం. సహాయక చర్యల్లో టెక్నాలజీని వాడుతున్నాం. 14 వేల సీసీ టీవీ కెమెరాల ద్వారా సమాచారం సేకరిస్తున్నాం. ఎక్కడైతే రోడ్ల మీద నీళ్లు నిలిచాయో అలాంటి చోట్లకు సిబ్బందిని పంపించి చర్యలు తీసుకుంటున్నాం. మనుషులు ఎన్యుమరేట్ చేయడంతో పాటు టెక్నాలజీ సాయంతో డ్రోన్స్ ద్వారా ముంపుకు గురైన ప్రాంతాలు , పంటలను పరిశీలించి మరింత సమర్థవంతంగా గణాంకాలు సేకరిస్తున్నాం. టైమ్ మేనేజ్ మెంట్ మరియు క్వాలిటీ పెంచి ఎక్కడికక్కడ న్యాయం చేసే ప్రయత్నాలు చేస్తున్నాం. ఎక్కడా అవినీతి జరగకుండా పద్ధతి ప్రకారం చేయడానికి ఇవన్నీ ఉపయోగపడతాయి. ఇదో కేస్ స్టడీ. యూస్ కేసెస్ క్రింద స్టార్ట్ చేశాం. సైక్లోన్ సమయంలో వినియోగించే ఈ టెక్నాలజీ భవిష్యత్ లో రియల్ టైం గవర్నెన్స్ లో కూడా వస్తుంది.

ప్రతిరోజూ గవర్నెన్స్ కూడా ఉపయోగిస్తాం. డ్రోన్స్ ఎక్కడికక్కడ పెస్ట్ డిటెక్ట్ చేస్తుంది. మస్కిటో డిటెక్ట్ చేస్తుంది. అక్కడే స్ప్రే చేసే పరిస్థితి వస్తుంది. ఇలాంటి అనేకమైన కేసెస్ కి నాంది పలుకుతున్నాం. ఏదిచేసినా కాస్ట్ ఎఫెక్టివ్ గా ఉంటుంది. నాణ్యత పెంచుతాం. అదే టైంలో రియల్ టైంలో సొల్యూషన్స్ ఇచ్చే పరిస్థితి వస్తుంది.

తుంగభద్ర ఘటనలో ఫోన్ చేసి కన్నయ్యనాయుడుని పంపించి నీళ్లు వచ్చే సమయంలోనే గేట్లు పెట్టించే పరిస్థితికి వచ్చాం. అది మా చిత్తశుద్ధి. దానివల్ల తుంగభద్రతకు 95 – 96 టీఎంసీల నీళ్లు వచ్చాయి. రేపో, ఎల్లుండో 100 శాతం ఫుల్ అవుతుంది. ఆ కార్యక్రమానికి కూడా శ్రీకారం చుట్టాం.

కొందరు అమరావతి మునిగిపోయింది.. ఇక్కడేం రాజధాని కడతారు అంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారు .. బుద్ధి, జ్ఞానం ఉండేవారు ఇలా మాట్లాడరు.. ఏదైనా మీ వల్ల అయితే సహాయం చేయండి ..నేరస్తుల పార్టీ, నేరాల పార్టీ, భ్రష్టు పట్టిన పార్టీ రాష్ట్రంలో ఉంది. వాళ్లకు ఇదే పని. ప్రజలను మభ్య పెట్టడం, మోసం చేయడం, తప్పుడు వార్తలను ఇవ్వడం, ఆ ఫ్రాడ్ న్యూస్ దేశమంతా వ్యాపింప చేయడం, ఏదో జరిగిపోయిందని కథలు చేయడం వంటివి చేస్తుంటారు.

వాస్తవాలు రాస్తే నేనేం మాట్లాడను. తప్పుడు వార్తలు రాసేవారిపట్ల కఠినంగానే ఉంటాం. దాన్ని నిరూపించాల్సిన బాధ్యత కూడా వారిపై ఉంటుంది. ఆధారాలు లేకుండా, ఆధారాలు నిరూపించకుండా ఏదంటే అది మాట్లాడటం సరికాదు.

కృష్ణా నదిలో, కొండవీటి వాగులో నీళ్లు ఎక్కువ వచ్చినప్పుడు , రెండు ప్రవాహాలు అడ్డుపడినప్పుడు నీళ్లు నిలిచిపోతాయన్న ఉద్దేశంతో కొండవీడు లిఫ్ట్ ఇరిగేషన్ పెట్టాం. ఉదయం వచ్చేటప్పుడు చూస్తే కృష్ణా నది పక్కన సముద్రం మాదిరిగా ఉన్నా లిఫ్ట్ ఇరిగేషన్ వైపు నీళ్లు లేవు. అది మా కమిట్ మెంట్. అదే ముందుచూపు.

గుడ్లవల్లేరు ఘటన బాధాకరం. ఈ రాష్ట్రంలో ఆడబిడ్డలకు రక్షణ కల్పించాలి. ఎక్కడైనా, ఎవరైనా సరే ఆడబిడ్డలను అవమానంగా ప్రవర్తించే విధంగా వ్యవహరించే చర్యలు, అనుమానం వచ్చే విధంగా ప్రవర్తించే చర్యలు ఈ ప్రభుత్వంలో ఉండవు. ఏదున్నా నివృత్తి చేసే బాధ్యత మాది. ఈ ఘటన జరిగినప్పటి నుండి ఫాలో అవుతున్నాను. అక్కడికి టీం ను పంపించి ఎంక్వైరీ చేయించాను. నిన్న పిల్లలు ఎమోషనల్ లో ఉన్నారు.

ఎమోషనల్ డిస్టర్బెన్స్ ఉన్నప్పుడు అధికారులు ఓర్పుతో వ్యవహరించాలి. కొందరు ఇష్టానుసారంగా 300 వీడియోలు తీసేశారు. రాష్ట్రమంతటా ఇలాగే జరుగుతుందని మాట్లాడుతున్నారు. అలా విమర్శలు చేసే వారికి బుద్ధి, జ్ఞానం ఉండాలి. మన ఇంట్లో కూడా ఆడబిడ్డలు ఉన్నారన్న విషయం మర్చిపోవద్దు. మీ దగ్గర ఎవిడెన్స్ ఉంటే ఇవ్వాలి..లేకపోతే చెప్పాలి.

తెలియకుండా కావాలని దుష్ప్రచారం చేయడం చాలా నేరం. ఆడబిడ్డల శీలాన్ని తాకట్టు పెట్టే విధంగా లేదంటే అవహేళన చేసే విధంగా చేయడం కరెక్ట్ కాదు. దీనిని చాలా తీవ్రంగా ఖండిస్తున్నా. హెచ్చరిస్తున్నాను. మంచిది కాదని చెబుతున్నా.. ఇలా ఘటనల విషయంలో ఉపేక్షించే పరిస్థితి లేదు. ఢిల్లీలో సీఈఆర్టీతో మాట్లాడాం. కంప్యూటర్ ఇంజనీరింగ్ రెస్పాన్స్ టీం తో మాట్లాడి సీనియర్ సైంటిస్టులు ఎస్ఎస్ శర్మ, విద్యాసాగర్ , సురేంద్ర వర్మ, రవిచంద్రలతో మాట్లాడాం.

ఒకరిని సీఏడీసీ (సెంటర్ ఫర్ డెవలప్ మెంట్ ఆఫ్ అడ్వాన్స్డ్ కంప్యూటింగ్) నుండి టెక్నికల్ పీపుల్ ను తీసుకుంటాం. స్థానికంగా ఉండేవారిని కాకుండా బయటి పోలీస్ ను కూడా 102 ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ ను పెడతాం. వీళ్లంతా వెళ్లి అక్కడ ఏం జరిగిందో అంతా తీసుకొని అక్కడుంటే ఎక్విప్ మెంట్ కూడా తీసుకొని డౌట్ ఉండే వాళ్ల సెల్ ఫోన్, ఐప్యాడ్, కంప్యూటర్ ను తీసుకుంటారు. మొత్తం అనలైజ్ చేసి వాస్తవాలు ఉంటే ఎవరి ఇన్వాల్వ్ మెంట్ ఉన్నా వదిలిపెట్టం. వాస్తవాలను వెలికితీస్తాం. దుష్ప్రచారాలు చేయడం మాని ఆధారాలు ఉంటే ఇవ్వాలని కోరుతున్నాను. వాళ్లపై ఎంత కఠిన చర్యలు తీసుకుంటామో చూడండి.

బాబాయ్ ని గొడ్డలితో చంపి గుండెపోటు అని నమ్మించారు. ముఖ్యమంత్రిగా నన్నే మభ్య పెట్టారు. రెండో రోజున నారాసుర రక్త చరిత్ర అని ముఖ్యమంత్రి పేరు పెట్టి పత్రికల్లో రాశారు. ఆరోజే బొక్కలో పెట్టి ప్రూవ్ చేయమని అనాల్సింది. కానీ అది నా మంచితనం. అది చేయలేదు కాబట్టే ఈ పరిస్థితికి వచ్చాను. ఇప్పుడు కూడా అలాంటి సంఘటనలు జరుగుతున్నాయి.

నేను రౌడీలను, ముఠా నాయకులను, మత కలహాలు సృష్టించే వాళ్లను అణచివేశాను. తీవ్రవాదులపై పోరాడాను. రాజకీయ ముసుగులో ఉండే నేరస్థులను ఖబర్దార్ జాగ్రత్తగా ఉండమని హెచ్చరిస్తున్నాను.. రాష్ట్రాన్ని తగలబెట్టారు. ఎక్కడ చూసినా గంజాయి మయం అయింది. డ్రగ్స్ మయం అయింది. చీప్ లిక్కర్ మయం అయింది. ఇవన్నీ ప్రక్షాళన చేసుకుంటూ వస్తున్నాను. నేరస్తులే పొలిటికల్ పార్టీలు హ్యాండిల్ చేస్తున్నప్పుడు ఇలాంటి ఘోరాలు, నేరాలు చేసి వేరే వాళ్లపైపెడుతూ ఉంటారు.

ఈ ప్రభుత్వం అంత తమాషాగా ఉండదు. మీరు అనుకున్నట్లు మీ ఆటలు సాగనీయం. ఒకట్రెండు రోజులు అనలైజ్ చేయడానికి టైమ్ పడుతుంది. ఇంతలోనే ఆరోపణలు సరికాదని చెబుతున్నాను. ఏదైనా జరిగితే అదే చివరిరోజు అవుతుందని హెచ్చరిస్తున్నాను.ఎవరైతే కావాలని అవాస్తవాలని, ఫ్రాడ్ న్యూస్ ను పదే పదే ప్రచారం చేస్తారో చట్టప్రకారం చర్యలు కఠినంగా ఉంటాయి. సోషల్ మీడియాలో వచ్చే వాటిని కూడా కంట్రోల్ చేస్తాం. వాస్తవాలు ఎవరైనా రాయవచ్చు..వాళ్ల వ్యూస్ ఉంటే చెప్పుకోవచ్చు. అమరావతి మునిగిపోవాలన్నదే నా కోరిక అని రాయాలనుకుంటే రాసుకోవచ్చు. అది స్మశానం కావాలన్నది వారి కోరిక. అమరావతి భవిష్యత్ రాజధానిగా తయారవు తుంటే చూసి ఓర్వలేకపోతున్నారు. అందుకే మునిగిపోతుందని ప్రచారం చేస్తున్నారు. ఆడబిడ్డలను అవమానించడం మీ కల్చర్.. మీ ఎమ్మెల్యేలు చేసే పని అంతా అదే.. ఇప్పుడు ఏ ఆడబిడ్డకు క్యారెక్టర్ లేదని ఎస్టాబ్లిష్ చేయాలని చూస్తారా ? ఈరోజు మా ప్రభుత్వంలో ఏమైనా బూతులున్నాయా ? ఆడబిడ్డలపై అఘాయిత్యాలు ఉన్నాయా ఈ ప్రభుత్వంలో ?

ఎవడైనా చేస్తే అదే లాస్ట్ డే అవుతుందని చెప్పా.. ఇప్పుడు కూడా అదే చెప్తున్నా.. నా దగ్గర ఉదాసీనత ఉండదు ఫర్మ్ గా యాక్ట్ చేస్తా.. ఒకరిద్దని అవసరమైతే ఏం చేయాలో చేసి చూపించడానికైనా సిద్ధంగా ఉన్నాం. అప్పుడే మీకు భయం వస్తుంది. రాజకీయ ముసుగులో నేరస్థులుగా ఉండే వీళ్లు సేవ్ చేస్తారనుకోవడం కలే అవుతుంది.

ఈ రాష్ట్రంలో ఏది ఐదేళ్లుగా ఫెయిర్‌గా జరిగిందో చెప్పాలి. ఫెయిర్‌గా యాక్ట్ చేసే ఆఫీసర్‌ని ఈ రాష్ట్రంలో చేయనిచ్చారా? వ్యక్తిగత ప్రయోజనాల కోసం పనిచేయించారు. మేం చట్టప్రకారం అన్ని విషయాల్లో ఫర్మ్‌గా ఉంటాం. చట్టప్రకారం ముందుకు వెళతాం. నాకు ఎవ్వరిపై రాజకీయ వివక్ష లేదు. కక్ష లేదు. కానీ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవాలంటే మాత్రం చాలా స్పష్టంగా కఠినంగా ఉంటాం.

## విజయవాడలో 2.76 లక్షల మంది వరద బాధితులు

- వీరందరికీ ఆహారం అందించేందుకు ఏర్పాట్లు
- బుడమేరు నిర్వహణను వైకాపా ఐదేళ్లపాటు పట్టించుకోలేదు
- గండ్లు పడిన ప్రాంతాల్లో మరమ్మతులు చేయలేదు : సీఎం చంద్రబాబు

**విజయవాడ,మహానాడు:**

నగరంలోని వివిధ ప్రాంతాల్లో 2.76లక్షల మంది వరద బాధితులు ఉన్నారని, వీరందరికీ ఆహారం అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు.

నగరంలోని వివిధ ప్రాంతాల్లో 2.76లక్షల మంది వరద బాధితులు ఉన్నారని, వీరందరికీ ఆహారం అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. ఆదివారం రాత్రి విజయవాడ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

“సింగ్‌నగర్‌లో పరిస్థితిని పరిశీలించా.. బాధితులతో మాట్లాడా. వరదనీరు ఇంకా పెరిగే అవకాశం ఉంది. యుద్ధ ప్రాతిపదికన నష్ట నివారణ చర్యలు చేపట్టాం. బుడమేరుకు గండ్లు పడి వరదనీరు పోటెత్తింది. 1998 తర్వాత మళ్లీ ఆ స్థాయిలో ఇప్పుడు భారీ వర్షాలు పడ్డాయి.

శ్రీశైలం, సాగర్, పులిచింతల నుంచి, మున్నేరు, బుడమేరు నుంచి కూడా భారీగా వరదనీరు వస్తోంది. బుడమేరు నుంచి కొల్లేరుకు వెళ్లాల్సిన నీరు విజయవాడకు చేరుతున్నాయి. బుడమేరు నిర్వహణను వైకాపా ప్రభుత్వం ఐదేళ్లపాటు పట్టించుకోలేదు.

గండ్లు పడిన ప్రాంతాల్లో మరమ్మతులు చేయలేదు. కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో మాట్లాడి వరద పరిస్థితి వివరించా. ఆరు హెలికాప్టర్లు, 40 పవర్ బోట్లు, పది ఎన్డీఆర్ఎఫ్ టీమ్‌లు పంపిస్తామని అమిత్ షా చెప్పారు. అడిగిన వెంటనే కేంద్రం సాయం చేసేందుకు ముందుకొచ్చింది” అని చంద్రబాబు వివరించారు.

11
జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ | సోమవారం 02, సెప్టెంబర్ 2024

## ఎలాంటి పరిస్థితులు ఎదురైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండండి

- అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- రెస్క్యూ టీం లను ఏర్పాటు చేసుకోవాలని హైడ్రాకు ఆదేశం
- ఎలాంటి పరిస్థితులను ఎదుర్కోవడానికైనా కలెక్టర్లు సిద్ధంగా ఉండాలి
- వరద ముంపు ప్రాంతాల్లో విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించాలని కలెక్టర్లకు ఆదేశం
- వరద నీరు ఉధృతంగా ప్రవహించే రోడ్ల పైన వాహనాలను అనుమతించొద్దని పోలీస్ శాఖకు ఆదేశం
- ఖమ్మం నుంచి అన్ని జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**ఖమ్మం,మహానాడు:**
రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు నేపద్యంలో ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కలెక్టర్లను ఆదేశించారు. ఖమ్మం నుంచి ఆదిలాబాద్ వరకు గోదావరి నది తీరం వెంబడి అధికారులు 24/7 అప్రమత్తంగా ఉండాలన్నారు.

లిరాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలు గురించి ఖమ్మం కలెక్టరేట్ కార్యాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, రాష్ట్ర ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు.

సచివాలయం నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్ లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి లు పాల్గొన్నారు. సోమవారం కూడా రాష్ట్రంలో భారీ వర్షాలు ఉన్నట్టు వాతావరణ శాఖ చేసిన సూచనలను పాటించి లోతట్టు ప్రాంతాలు వరద ప్రభావిత ముంపు గ్రామాల్లో విద్యా సంస్థలకు సెలవులను ప్రకటించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. చెరువుల ఆక్రమణలు తొలగించే పనిలో నిమగ్న మైన హైడ్రా ప్రస్తుతం తొలగింపులను రెండు మూడు రోజుల పాటు విరామం ప్రకటించి ఈ విపత్తును ఎదుర్కొనేందుకు రెస్క్యూ ఆపరేషన్ టీమ్‌లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో ముందు జాగ్రత్తగా తీసుకోవాల్సిన చర్యల గురించి హైడ్రా యాక్షన్ ప్లాన్ తయారు చేసుకోవాలని పేర్కొన్నారు.

వరద ముప్పు ప్రాంతాల్లో సహాయక చర్యలను ముమ్మరం చేయాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి, అవసరమైన ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలకు తరలించి తగిన భోజన వసతి, వైద్య సదుపాయం ఏర్పాటు చేయాలని చెప్పారు. వరద ముంపు ప్రభావిత ప్రాంతాల్లో ముమ్మరంగా సహాయక చర్యలను చేపట్టాలని అత్యవసర సేవలకు కావాల్సిన నిధులను ఆర్థిక శాఖ ఇవ్వడానికి సిద్ధంగా ఉందన్నారు.

వర్షాల నేపథ్యంలో విద్యుత్ అంతరాయం లేకుండా చూసుకోవాలని ఉదయం మధిర తహశీల్దార్ కార్యాలయం నుంచి ఎన్పీడీసీఎల్ పరిధిలో ఉన్న విద్యుత్ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించినట్లు వెల్లడించారు. విద్యుత్తు, మంచినీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని కలెక్టర్లకు సూచించారు.

వరద నీరు ఉధృతంగా ప్రవహించే రోడ్ల పైన వాహనాలను అనుమతించొద్దని పోలీస్ శాఖను ఆదేశించారు. ఖమ్మం జిల్లాలో శనివారం అర్ధరాత్రి నుంచి పరిస్థితిని స్వయంగా తాను పర్యవేక్షిస్తున్నానని చెప్పారు. మధిర మండలం వంగవీడు గ్రామంలో వాగులో చిక్కుకున్న మత్స్య కార్మికుడు వెంకటేశ్వర్లను రక్షించినట్లు చెప్పారు.

### రాష్ట్ర ప్రభుత్వం చాలా అలర్ట్ గా ఉంది

రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలపై రాష్ట్ర ప్రభుత్వం చాలా అలర్ట్‌గా ఉన్నదనీ, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన జాగ్రత్తలు, చర్యలు తీసుకున్నదని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఖమ్మం కలెక్టరేట్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ముగిసిన తర్వాత మీడియాతో డిప్యూటీ సీఎం మాట్లాడారు.

వరద ముంపు, లోతట్టు ప్రాంతాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి అధికారులను అప్రమత్తం చేసి ముమ్మరంగా సహాయక చర్యలను చేపడుతున్నట్లు వివరించారు. జంట నగరాల్లో వరదల వల్ల ఏర్పడే విపత్తును ఎదుర్కోవడానికి హైడ్రా ను సన్నద్ధం చేశామని వెల్లడించారు. ఆపరేషన్ రెస్క్యూ టిమ్ లను అందుబాటులో ఉంచామని చెప్పారు.

## ఎమ్మెల్యే వసంత ఆన్ డ్యూటీ

- వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎమ్మెల్యే వసంత విస్తృత పర్యటన.
- వర్షం పడుతున్నా ఆగని వసంత అడుగులు
- ప్రజలకు సేవలను అందించే క్రమంలో రాజీలేని తత్వం
- కృష్ణానదికి వరద ఉధృతి... మరింత అప్రమత్తంగా ఉండండి

**ఇబ్రహీంపట్నం,మహానాడు:**
వరద ప్రభావిత ప్రాంతాల్లో మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఓ వైపు జోరున వర్షం పడుతున్నప్పటికీ ఆయన అడుగు ఆగడం లేదు. ఐదు పదుల వయసులో కూడా ఎంతో ఉత్సాహంగా పర్యటిస్తూ బాధిత ప్రజలకు భరోసా కల్పిస్తున్నారు. శనివారం ఉదయం నుంచి ప్రారం



భమైన ఆయన పర్యటన ఆదివారం కూడా నిరంతరాయంగా కొనసాగుతూనే ఉంది.

వరద బాధితులకు అందుతున్న సహాయక చర్యలను ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. వాతావరణ ప్రతికూల పరిస్థితుల్లో సైతం ఎంతో ఓపికతో పర్యటిస్తూ ప్రజలకు



అండగా నిలుస్తున్నారు. ఓ వైపు పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తూనే, మరో వైపు అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. వరద బాధిత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తూ ప్రాణనష్టాన్ని నివారిస్తున్నారు. ముందుగా ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

ఐదు దశాబ్దాల్లో కనీ వినీ ఎరుగని రీతిలో ఎదురైన జల ప్రళయాన్ని సమర్ధవంతంగా ఎదుర్కోవడంలో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు సఫలీకృతం అయ్యారని చెప్పవచ్చు. ప్రజలకు యుదప్రాతిపదికన వసతి ఏర్పాట్లు చేయించారు. ఆహారం, తాగునీరు అందజేశారు. రెస్క్యూ టీములను పంపి వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించారు. ఎన్.డి.ఆర్.ఎఫ్ బృందాలను రంగంలోకి దింపారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులను తగు చర్యలకు ఆదేశించారు.

ముఖ్యంగా వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ గేట్లు ఎత్తేసే క్రమంలో ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ ముందుగానే ప్రజలను అప్రమత్తం చేశారు. వరద బీభత్సం క్రమేపీ పెరుగుతున్న దృష్ట్యా గేట్లు ఎత్తాల్సి వచ్చింది. కవులూరు, ఈలప్రోలు, రాయనపాడు తదితర గ్రామాల ప్రజలను, రైతులను అప్రమత్తం చేసి నష్టనివారణకు తన వంతు ప్రయత్నం చేశారు.



**తుఫాను ప్రభావం దృష్ట్యా భారీ వర్షాల కారణంగ పెడన నియోజకవర్గం బంటుమిల్లి మండలం పెద్దతుమిడి గ్రామం మల్లపరాజుగూడెం గ్రామంలో పంట పొలాలు, డ్రైన్లు జలమైన ప్రాంతాలలో అధికారులతో కలిసి పర్యటిస్తున్న పెడన నియోజకవర్గ శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్**

## బాధితులను అన్ని విధాలా ఆదుకుంటాం

- గండ్లు పడకుండా చెరువులు, కాల్వ గట్ల పటిష్ఠతకు చర్యలు
- లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలింపు
- సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి



**నూజివీడు/ఏలూరు,మహానాడు:**
భారీ వర్షాలు, వరదల కారణంగా చెరువులు, కాల్వల గట్లకు గండ్లు పడకుండా గట్ల పటిష్టతకు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు.

భారీ వర్షాల కారణంగా నీట మునిగిన నూజివీడు పట్టణంలోని గాంధీనగర్, ఎన్టీఆర్ కాలనీ, అప్పారావు పేట, నూజివీడు మండలంలోని బత్తులవారిగూడెం, యలమందల తదితర పలు గ్రామాలలో ఆదివారం మంత్రి పార్థసారధి విస్తృతంగా పర్యటించి బాధితులను కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకుని, లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు అధికారులు తరలించేలా దగ్గరుండి చర్యలు తీసుకున్నారు.

ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ.. భారీ వర్షాల కారణంగా నష్టపోయిన ప్రతీ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు.

వర్షాలు తగ్గే వరకు ముంపునకు గురయ్యే ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తర లించిభోజన, వసతి సౌకర్యాలు కల్పించడం జరుగుతుం దన్నారు.

చెరువులు, కాల్వలను డీసిల్టింగ్ చేయడం, గట్లను పటిష్టం చేయడం ద్వారా వర్షాల ద్వారా కలిగే నష్టాలను నివారించడం, ప్రజల కష్టాలను తీర్చడంతోపాటు వర్షం ద్వారా కురిసిన నీటిని సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. చెరువులు, కాల్వగట్లపై ఆక్రమణలు తొలగించాల్సిన అవసరం ఉందన్నారు.

నూజివీడులోని జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాన్ని మంత్రి పరిశీలించి వారికి కల్పిస్తున్న సౌకర్యాలను గురించి అడిగి తెలుసుకున్నారు. నూజివీడులోని మోటుపల్లి తాతారావు జూనియర్ కళాశాల వరదనీటిలో మునగడంతో హాస్టల్ విద్యార్థులు 70 మందిని నిన్న ఉదయం సాంఘిక సంక్షేమ హాస్టల్ కి తరలించారు.

హాస్టల్ సందర్శించి విద్యార్థుల యోగ క్షేమాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు కావలసిన త్రాగునీరు బట్టలు మరియు నిత్యావసర సరుకులు బియ్యం తక్షణమే అందజేస్తున్నట్లు మంత్రి తెలిపారు.

విద్యార్థులకు అవసరమైన మందులు అందజేయమని అధికారులుకు ఆదేశించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా నిరంతరం వారి యోగ క్షేమాలు పర్యవేక్షించాలని అధికారులకు ఆదే శించారు తదనంతరం హెల్పింగ్ హేండ్స్ వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు బట్టలు, నగదు ను మంత్రి అందజేశారు.

## రాజకీయాలకు అతీతంగా ప్రజాసేవ

- బ్రాహ్మణపల్లిలో విపిఆర్ కు ఘన స్వాగతం
- విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండు వాటర్ ప్లాంట్లు ప్రారంభం
- ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాలకు సురక్షిత తాగునీరు అందివ్వడమే నా లక్ష్యం
- నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి



**నెల్లూరు, మహానాడు:**
రాజకీయాలకు అతీతంగా ప్రజాసేవ చేయడం తన అభిమతమన్నారు నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి. మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తో కలిసి మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలో విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండు ఆర్‌ఓ ప్లాంట్స్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ తాను రాజకీయాలలోనికి రాక ముందు నుంచే సేవా రంగంలో వున్నట్టు తెలిపారు. ఉదయగిరి ప్రాంతంలో ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాలకు సురక్షిత తాగునీరు అందివ్వాలనే లక్ష్యంతో 2017 నుంచి అమృతధార పేరిట తన స్వంత నిధులతో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు.

అనంతరం విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అమృతధార కార్యక్రమాన్ని జిల్లా అంతటా విస్తరించినట్లు వివరించారు. స్థానిక అవసరాలను గుర్తించి ఎస్సీ కాలనీలో ఒకటి బ్రాహ్మణ పల్లి గ్రామంలో మరొక వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

తాము ఏర్పాటు చేసే వాటర్ ప్లాంట్లలో శుద్ధి చేసిన తాగునీరు ఉచితంగా తీసుకెళ్లవచ్చన్నారు. వాటర్ ప్లాంట్ల నిర్వహణ తమ ఫౌండేషన్ చూసుకుంటుందన్నారు. ఎన్నికల్లో గెలిచాక తొలిసారిగా వచ్చిన తన పట్ల బ్రాహ్మణపల్లి వాసులు చూపించిన ఆదరాభిమానాలు అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా బ్రాహ్మణపల్లి వాసులు ఎంపీ వేమిరెడ్డి ని పూల మాలలతో సన్మానించి తమ అభిమానం చాటుకున్నారు.

ఈ కార్యక్రమంలో ఆనం టిడిపి నాయకులు ఆనం రంగ మయూర్ రెడ్డి, కేతంరెడ్డి వినోద్ కుమార్ రెడ్డిలతో పాటు స్థానిక ప్రజా ప్రతినిధులు మరియు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

### ముఖ్యమంత్రిగారూ.. ఫించన్ల పంపిణీ సరే..

## మిగతా హామీల మాటేమిటి?

- రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ నేత డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి



**వేంపల్లి,మహానాడు:**
ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్న హామీ మేరకు ప్రతి నెలా మొదటి తేదీన ఇంటివద్దనే లబ్దిదారులకు సామాజిక ఫించన్లు పంపిణీ చేయడం హర్షణీయం. మ్యానిఫెస్టోలో పేర్కొన్న మిగతా హామీల మాటేమిటి బీసీ,ఎస్సీ,ఎస్టీ,ముస్లిం మైనారిటీలకు 50 ఏళ్లకే ఫించన్ ఇస్తామని మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చారు.జూలై, ఆగస్టు,సెప్టెంబర్ 3 మాసాలు గడిచిపోయాయి.అమలు కాలేదు.

యువ గళం క్రింద నిరుద్యోగ యువతకు నెలకు 3వేల రూపాయలు నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు.ఇప్పటివరకు అమలు కాలేదు. తల్లికి వందనం పథకం క్రింద స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ15,000లు ఇస్తామన్నారు. ఇవ్వలేదు. అన్నదాత సుఖీభవ పథకం క్రింద ప్రతి రైతు కు ఏటా రు 20,000 లు ఆర్థిక సాయం చేస్తామని హామీ ఇచ్చారు.ఖరీఫ్ సీజన్ ముగింపు దశకు చేరుకుంది.ఇంతవరకు 20 రూపాయల సాయం కూడా చేయలేదు.

19 నుంచి 59 సంవత్సరాల మధ్య వయసు ఉన్న ప్రతి మహిళకు నెలకు రూ 1500 ఇస్తామన్నారు.ఇవ్వలేదు. ప్రతి ఇంటికీ ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు సరఫరా చేస్తామన్నారు.చేయలేదు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అన్నారు. అమలు కాలేదు. హామీలను వీలైనంత త్వరగా అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తోంది.

## భవిష్యత్ మనదే..

- కష్టాలను ధైర్యంగా ఎదుర్కొందాం.. మళ్ళీ మంచి రోజులు వస్తాయి
- ఎవరూ అధైర్యపడొద్దు, రాబోవు కాలం మనదే
- ప్రతి కుటుంబంలో మనం చేసిన మంచి ఉంది
- మన పట్ల ప్రజలకు విశ్వాసం ఉంది,
- పులివెందుల పర్యటనలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్



**పులివెందుల:మహానాడు:**
భాకరాపురంలో ఉన్న క్యాంపు కార్యాలయంలో మాజీ ముఖ్య మంత్రి వైఎస్ జగన్... కార్యకర్తలు, ప్రజలు, నేతలు, అభిమానులతో మమేకమయ్యారు. అందరినీ పేరుపేరునా పలకరించి వారి కష్టసుఖాలను తెలుసుకున్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, మాజీ నేతలతో కూడా చర్చించారు.

కార్యకర్తలు, నాయకులు ఎవరూ అధైర్యపడవద్దు, పార్టీ అండగా ఉంటుందని, అందరం కలిసి కట్టుగా ముందుకు వెళ్ళాల్సిన అవసరం ఉందని వివరించారు. రానున్న కాలంలో ప్రతీ కార్యకర్తకు తనతో పాటు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తోడుగా ఉంటుందని వైఎస్ జగన్ భరోసానిచ్చారు.

మనం చెప్పిన మంచి పనులన్నీ చేశాం, మనం చేసిన మంచి ప్రతీ కుటుంబంలో ఉంది, అందుకే ప్రజలకు మన పైనే విశ్వాసం ఉందని వైఎస్ జగన్ అన్నారు. నిరంతరం ప్రజా శ్రేయస్సుకు అనుగుణంగా అడుగులు వేయాలని శ్రేణులకు ఆయన దిశానిర్ధేశం చేశారు.

ఈ సందర్భంగా పులివెందులలోని క్యాంపు కార్యాలయం కార్యకర్తలు, పార్టీ శ్రేణులు, ప్రజలతో కిక్కిరిసిపోయింది. కష్టకాలంలో పార్టీ కార్యకర్తలకు నేతలు అండగా నిలబడాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులకు వైఎస్ జగన్ సూచించారు.

12
జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ | సోమవారం 02, సెప్టెంబర్ 2024

# నందిగామ - మధిర రహదారి బంద్

● వరద నీటిలో చిక్కుకున్న అంబులెన్స్

నందిగామ,మహానాడు:
శివారు మధిర రోడ్డులో పెట్రోల్ బంకులు వద్ద భారీగా రోడ్డుపైకి నీరు చేరడంతో రహదారులు తాత్కాలికంగా పని చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అత్యవసరమైతే తప్ప ఎటు వంటి వాహనాలకు అనుమతులు లేవని ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని స్థానిక తాసిల్దార్ అన్నారు.

అంబులెన్స్ వరద నీటిలో చిక్కుకోవడంతో పోలీసులు సైతం అంబులెన్స్ వాహనాన్ని సకాలంలో బయటకు పంపించడం జరిగింది. ఈ సంఘటన చూసిన ప్రజలు పోలీసులకు, హెడ్ కానిస్టేబుల్ తొర్లికొండ సీతారామయ్య ను పలువురు అభినందించారు. క్రమక్రమంగా వరద వృద్ధికి పెరుగుతుంది



కాబట్టి మధిర నుండి వచ్చే ప్రజలు నందిగామకు రావద్దని అలాగే నందిగామ నుండి మధిర రోడ్డులో ప్రయాణించే ప్రయాణికులు తమ ప్రయాణాలను వీలైనంతగా ఆపుకోవాలని అధికారులు కోరుతున్నారు.



## కొండ చర్యలు విరిగిపడకుండా
# చర్యలు చేపట్టాలి

● బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి

విజయవాడ,మహానాడు:
వర్షాలు కారణంగా కొండచరియలు విరిగి పడి క్షతగాత్రులైన వారిని బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పరామర్శించారు. వారిని పరామర్శించిన సందర్భంలో పురందేశ్వరి చలించిపోయారు. జరిగిన సంఘటన



అడిగి తెలుసుకున్నారు. వైద్యం అందుతున్న వివరాలపై ఆరా తీశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్య అధికారులను ఆదేశించారు. పేషేంట్ అటెండెంట్‌లకు కూడా ఆహారం అందించాలని పురందేశ్వరి సూచించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ..బెజవాడలో కొండ చరియలు విరిగిపడటం బాధాకరం. కొన్ని దశాబ్దాల తర్వాత భారీ వర్షాలు పడుతున్నాయి. బండరాళ్లు విరిగిపడి గాయాలతో 9 మంది ఆసుపత్రికి వస్తే.. ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. నలుగురికి గాయాలయ్యాయి. ప్రభుత్వం కొండ చర్యలు విరిగిపడకుండా చర్యలు చేపట్టాలి. కొండ ప్రాంతాల్లో నివాసాలు ఉంటున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలి. బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా కృషి చేస్తామన్నారు. రాష్ట్ర అధ్యక్షురాలు వెంట బిజెపి రాష్ట్ర మీడియా ఇంచార్జి పాతూరి నాగభూషణం, బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బాజీ,బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మిట్టా వంశీ, బిజెపి నేతలు మువ్వల వెంకట సుబ్బయ్య, పీయూష్ దేశాయ్, నూతలపాటి బాలకోటేశ్వర రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బోగవల్లి శ్రీధర్, మాదాల రమేష్ నేషనల్ కౌన్సిల్ నెంబర్ పసుపులేటి రఘు రాముడు, కార్యదర్శి వేరుకొండ ఉమాకాంత్ జిల్లా యువమోర్చా అధ్యక్షుడు నరస రాజు తదితరులు పాల్గొన్నారు.




# భవనంపై చిక్కుకున్న కుటుంబం

జక్కంపూడి, కొత్తూరు తాడేపల్లి, పాముల వంతెన సమీపంలోని కేవెన్ ఎస్టేట్స్ లోని భవనంపై రెండు కుటుంబాలకు చెందిన 10 మంది చిక్కుకున్నారు. అర్ధరాత్రి దాటిన తర్వాత వారి ఇళ్లలోకి నీరు చేరడంతో... తెల్లవారుజామున 4.30 గంటల నుంచి భవనంపైనే రెస్క్యూ టీంల కోసం ఎదురు చూస్తున్న పరిస్థితి. వారికి రెస్క్యూ టీమ్‌ల నుంచి కాల్స్ వస్తున్నాయి. కానీ... తమ వద్దకు ఎవరూ రావట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

# భారీ వర్షాలతో రైళ్లు రద్దు

● ట్రాక్టర్లలో ప్రయాణికుల తరలింపు

విజయవాడ,మహానాడు:
భారీ వర్షాలు, పట్టాలపై వరద చేరడంతో రాయన్పాడు సమీపంలో అధికారులు రైళ్లను నిలిపివేశారు. అక్కడి నుంచి ప్రయాణికులను ట్రాక్టర్లలో విజయవాడ స్టేషన్కు తరలించారు. ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టినట్లు రైల్వే తెలిపింది. వారికి టిఫిన్, భోజన ఏర్పాట్లు చేసినట్లు పేర్కొంది. కాగా రైలు ప్రయాణికులను ట్రాక్టర్లలో తరలించిన వీడియోలు వైరల్ అయ్యాయి.

# ఇంటి నుంచి బయటకు రావద్దు

● చిరంజీవి విజ్ఞప్తి

హైదరాబాద్, మహానాడు:
తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు బీభత్సం సృష్టిస్తుండడంతో ప్రజలకు 'ఎక్స్'లో మెగాస్టార్ చిరంజీవి కీలక విజ్ఞప్తి చేశారు. "మీ కుటుంబసభ్యుడిగా నా మనవి ఒక్కటే... అత్యవసరమైతే తప్ప ఇంటి నుంచి బయటకు రావద్దు. వైరల్ ఫీవర్స్ వచ్చే ప్రమాదం ఉండటంతో అప్రమత్తంగా ఉండాలి. విపత్తులు వచ్చినప్పుడు ప్రజలకు మా అభిమానులు ఎల్లప్పుడూ అండగా ఉంటూ వస్తున్నారు. ఇప్పుడూ అండగా ఉంటారని ఆశిస్తున్నాను" అని ట్వీట్ చేశారు.



## సీఏఏ కింద పాకిస్తాన్ క్రైస్తవునికి
# గోవాలో పౌరసత్వం

పౌరసత్వ సవరణ చట్టం 2019 కింద గోవాలో పాకిస్తాన్ క్రైస్తవునికి భారత పౌరసత్వం లభించింది. 78 సంవత్సరాల జోసెఫ్ ఫ్రాన్సిస్ పెరీరాకి గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ పౌరసత్వ ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. గోవా నుంచి పౌరసత్వం అందుకున్న మొదటి వ్యక్తిగా పెరీరా రికార్డుల్లోకి ఎక్కారు. సీఏఏ కింద దరఖాస్తు చేసుకున్న ఒక నెల తర్వాత తనకు పౌరసత్వం లభించిందని జోసెఫ్ తెలిపారు. 1946లో జన్మించిన పెరీరా ఉన్నత చదువుల కోసం 1960 లో పాక్ వెళ్లారు. దాంతో ఆయనకు ఆ దేశ పౌరసత్వం లభించింది. తర్వాత 37 ఏళ్ల పాటు బహ్రెయిన్‌లో పనిచేశారు. 2013లో పదవీ విరమణ పొందాక, తన కుటుంబంతో నివసించడానికి గోవాకు తిరిగి వచ్చేశారు.



## అన్నీ ఉన్నాయ్..
# ఇంటి ముందు డ్రైనేజీ తప్ప

మా ఇల్లు మూడు కోట్లు అయ్యింది.
మా కారు యాభై లక్షలు.
మా ఇంట్లో ఎవరి ఫోన్ చూసినా లక్షకు పైనే.
మా అబ్బాయిది స్పోర్ట్స్ బైక్, అదికూడా రెండు లక్షలు పైనే. మొన్ననే పది లక్షలు పెట్టి హోమ్ థియేటర్ చేయించాం.
మాకు అన్నీ ఉన్నాయ్..!



ఇంటి ముందు డ్రైనేజీ తప్ప. మేమే గొప్ప,
అహం బ్రహస్మిః అంటూ ఎక్కడ కక్కడ ప్రకృతిని చెరబట్టి చెట్లు నరికివేసి ఆటలాడుకొన్న, నయా సంపన్న వర్గాలు ప్రకృతి పగ బడితే ఎలా ఉంటుందో శాంపిల్ ఇది.
ఇకనైనా మేలుకోండి.
సముద్రం పెరుగుతుంది. ఋతువులు మారుతున్నాయి. ప్రకృతి హెచ్చరిస్తున్నది.
అర్థం చేసుకొని ప్రకృతికి అనుకూలంగా జీవనం అలవాటు చేసుకోండి.

# అర్ధరాత్రి వరద సహాయక చర్యలను పర్యవేక్షించిన భట్టి విక్రమార్క

- జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ తో పరిస్థితిని సమీక్షించిన డిప్యూటీ సీఎం
- వెంకటేశ్వర్లు చిక్కుకున్న బుగ్గ వాగును అర్ధరాత్రి సందర్శించి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించిన డిప్యూటీ సీఎం
- వాగు నుంచి వెంకటేశ్వర్లను రక్షించేందుకు దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షించిన డిప్యూటీ సీఎం
- మధిర 100 పడకల ఆసుపత్రిలో పునరావాస కేంద్రం సందర్శించి ప్రజల బాగోగులు తెలుసుకున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- పొంగిపొర్లుతున్న నదులు, వాగులు, కొట్టుకుపోయిన రోడ్లు, నీట మునిగిన సబ్ స్టేషన్ ను అర్ధరాత్రి పరిశీలించిన డిప్యూటీ సీఎం
- యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని అధికారులకు ఆదేశం

మధిర, మహానాడు:
మధిర బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వల్ల ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాల వల్ల మధిర లో నదులు, వాగులు, వంకలు పొంగి పొర్లుతున్న విషయాన్ని తెలుసుకున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అర్ధాంతరంగా కరీంనగర్ పర్యటనను రద్దు చేసుకొని అర్ధరాత్రి మధిరకు చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు.

మధిర మండలం వంగవీడు గ్రామానికి చెందిన మత్స్యకార సభ్యుడు తోటపల్లి వెంకటేశ్వర్లు వలను తొలగించేందుకు బుగ్గ వాగు లోకి వెళ్లి చిక్కుకున్నాడు. విషయం తెలుసుకున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క జిల్లా కలెక్టర్, ఖమ్మం పోలీస్ కమిషనర్ ను, అప్రమత్తం చేశారు. బుగ్గ వాగు మధ్యలో చిక్కుకున్న వెంకటేశ్వర్లు బయటకు తీసుకు రావడానికి జాగ్రత్తలు, సూచనలు ఎప్పటికప్పుడు అధికారులకు ఆదేశిస్తూ పర్యవేక్షించారు. అర్ధరాత్రి రెండు గంటల సమయంలో బుగ్గ వాగు వద్దకు



చేరుకున్న డిప్యూటీ సీఎం జిల్లా కలెక్టర్ ఖమ్మం పోలీస్ కమిషనర్ తో పరిస్థితిని సమీక్షించారు.

### కలెక్టర్, సిపితో పరిస్థితిని సమీక్షించిన డిప్యూటీ సీఎం


మంచిర్యాల జిల్లా చెన్నూరు వెళ్లవలసిన పర్యటనను అర్థాంతరంగా వాయిదా వేసుకుని హుటాహుటీన మధిరకు పయనమైన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మార్గ మధ్యలో ఖమ్మం కలెక్టర్, ఖమ్మం పోలీస్ కమిషనర్, ఖమ్మం కార్పొరేషన్, మధిర రెవిన్యూ, మునిసిపల్ అధికారులతో ఫోన్లో మాట్లాడి పరిస్థితిని సమీక్షించి వారికి పలు సూచనలు చేశారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

అధికారులు అలెర్ట్‌గా ఉండాలని ఆదేశించారు. వాగులు, వంకలు నదులు పొంగుతున్న నేపథ్యంలో ప్రజలకు ప్రత్యామ్నాయ రవాణా మార్గాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను క్యాంపులకు తరలించాలని.. అక్కడ వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు.

### అర్ధరాత్రి రెండు గంటలకు బుగ్గ వీటి వాగుకు చేరుకున్న డిప్యూటీ సీఎం

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంలోనే కరీంనగర్ నుంచి వరంగల్, తొర్రూరు, ఖమ్మం మీదుగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మధిర మండలం వంగవీటి గ్రామంలోని బుగ్గ వాగుకు అర్ధరాత్రి రెండు గంటల సమయంలో చేరుకొని వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులను ఓదార్చి మనోధైర్యం కల్పించారు.

అప్పటికే అధికారులు వెంకటేశ్వర్లను వాగు మధ్యలో నుండి



బయటకు తీసుకురావడానికి వివిధ మార్గాల్లో సహాయక చర్యలు చేపట్టారు. డ్రోన్ సహాయంతో తాడును పంపించేందుకు ప్రయత్నం చేశారు. చిమ్మని చీకటి తో పాటు కురుస్తున్న భారీ వర్షంతో ఆ ప్రయత్నం విఫలం కావడంతో గజ ఈత గాళ్లను పిలిపించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పర్యవేక్షణలో అధికారులు గజ ఈతగాళ్లు సహాయంతో అర్ధరాత్రి రక్షించారు. గంటల పాటు ప్రయాసపడి వాగు మధ్యలో నుంచి అతి కష్టం మీద బయటకు తీసుకువచ్చి వెంకటేశ్వర్లు ప్రాణాలను కాపాడిన గజ ఈత గాళ్లను మరియు అధికార యంత్రాంగాన్ని డిప్యూటీ సీఎం అభినందించారు.

వెంకటేశ్వర్లను రక్షించినందుకుగాను ఆయన కుటుంబ సభ్యులు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు రెండు చేతులెత్తి దండం పెట్టి రుణపడి ఉంటామన్నారు.

### అర్ధరాత్రి పునరావాస కేంద్రం పరిశీలన

లోతట్టు ప్రాంతాల ప్రజలను మధిర 100 పడకల ఆసుపత్రిలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేయగా అర్ధరాత్రి కేంద్రానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేరుకున్నారు. పునరావస కేంద్రంలో ఉన్న లోతట్టు ప్రాంతాల ప్రజలతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. ప్రభుత్వాన్ని విధాలుగా ఆదుకుంటుందని ఎలాంటి ఆందోళన అవసరం లేదన్నారు. పునరావస కేంద్రంలో ఉన్న వారికి ఆహారం అందించడంతో పాటు వారి ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని అధికారులకు సూచించారు

### యుద్ధ పాతిపదికన విద్యుత్ పునరుద్ధరించాలని అధికారులకు ఆదేశం

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా మధిర నియోజకవర్గంలో ఏర్పడిన విద్యుత్ అంతరాయంపై ఎన్పీడీసీఎల్ సిఎండి వరుణ్ రెడ్డితో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమీక్షించారు.

మధిర పట్టణంలోని విద్యుత్తు సబ్ స్టేషన్ లోకి వరద నీరు ప్రవేశించడంతో అందులోనే రెండు ట్రాన్స్ఫార్మర్‌లు కొంత మేర నీటిలో మునిగాయని,. సబ్ స్టేషన్ పరిధిలోనే ఉన్న 11 ఫీడర్ లకు అంతరాయం వాటిల్లిందని, ఇందులో రెండు ఫీడర్లు గ్రామీణ ప్రాంతానికి చెందినవని, పట్టణ ఫీడర్లకు ప్రత్యామ్నాయ ఫీడర్ ద్వారా విద్యుత్తును పునరుద్దించామని వివరించారు.

మధిర, ఎర్రుపాలెం బోనకల్లు మండలాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడగా విద్యుత్ శాఖ సిబ్బంది భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా శ్రమించి అన్ని గ్రామాలకు యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ సరఫరా చేశారని వివరించారు.

13

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ | సోమవారం 02, సెప్టెంబర్ 2024



## కాలం రాసిన కథలు సక్సెస్ సెలబ్రేషన్స్

యమ్ యన్ వి సాగర్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఆసక్తికరమైన చిత్రం 'కాలం రాసిన కథలు.' నూతన నటీనటులు ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన ఈ సినిమా ఇటీవలే విడుదలై అందరినీ అలరించింది. ఈ సినిమా కి హిట్ టాక్ రావడం తో ఈ ఫిలిం యూనిట్ ఈ రోజు సక్సెస్ మీట్ నిర్వహించారు. దర్శక నిర్మాతలు ఎం.ఎన్.వి సాగర్ మాట్లాడుతూ, "ఈ సినిమా కోసం గత రెండు సంవత్సరాలుగా నేను పని చేస్తున్నాను. సినిమా విడుదక అయ్యాక ప్రేక్షకుల స్పందన బాగుంది. చిన్న సినిమాల్లో మా సినిమా మంచిగా రాణిస్తుంది.

మంచి రిలీజ్‌ని మాకు అందించినందుకు డిస్ట్రిబ్యూటర్‌కి థాంక్స్ చెప్పుకుంటున్నాను. ఈ సినిమా విజయం నేను తదుపరి చేయబోయే సినిమాల మీద విశ్వాసాన్ని పెంచింది. ఈ సినిమా లో పెద్ద స్టార్స్ లేకున్నా, కొత్త వాళ్ళని కూడా ప్రేక్షకులు బాగా ఆదరించారు. ఈ చిత్రం లో అన్ని పాత్రలు ప్రేక్షకులకి దగ్గరయ్యాయి. ముఖ్యనగ, కిరాక్ కిరణ్ పాత్ర క్లైమాక్‌లో బాగా పండింది.

ఈ సినిమా లో చేసిన ముగ్గురు హీరోయిన్స్‌కి స్పెషల్‌గా థాంక్స్ చెప్తున్నాను. హన్విక తనకి ఇచ్చిన పాత్ర లో అందరినీ మెప్పించింది. ఉమా కూడా అద్భుతమైన నటన కనబరిచి బేబీ సినిమా లో వైష్ణవి చైతన్య లాగా, ఆర్ఎక్స్ 100 లో పాయల్ రాజ్పుట్ లాగా మెప్పించింది. రాబోయే వారాల్లో కూడా ఈ సినిమా ఇంకా బాగా ఆడాలని కోరుకుంటున్నాను." అన్నారు.

### రీసెంట్ టైమ్స్‌లో బెస్ట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్

## 'మారుతి నగర్ సుబ్రమణ్యం': మహేష్ బాబు

రావు రమేష్ ప్రధాన పాత్రలో నటించిన హిలేరియస్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'మారుతి నగర్ సుబ్రమణ్యం'. ప్రేక్షకుల విశేష ఆదరణతో ప్రస్తుతం థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శింపబడుతోంది. ఇటువంటి విజవంతమైన, చక్కటి కుటుంబ వినోదాత్మక సినిమా తీసినందుకు 'మారుతి నగర్ సుబ్రమణ్యం' చిత్ర బృందాన్ని సూపర్ స్టార్ మహేష్ బాబు అభినందించారు. చిత్ర బృందం మీద ప్రశంసలు కురిపించారు. మంచి సినిమాలకు మద్దతు ఇవ్వడంలో సూపర్ స్టార్ మహేష్ బాబు ఎప్పుడూ ఓ అడుగు ముందుంటారు. సినిమాలో ఆయనకు నచ్చిన విషయాలు చెప్పడంతో పాటు తన అభిప్రాయాన్ని వెల్లడిస్తారు.

తాజాగా 'మారుతి నగర్ సుబ్రమణ్యం' సినిమాకు మహేష్ బాబు రివ్యూ ఇచ్చారు. ఈ మధ్య కాలంలో వచ్చిన మంచి వినోదాత్మక చిత్రాల్లో 'మారుతి నగర్ సుబ్రమణ్యం' ఒకటి అని సూపర్ స్టార్ మహేష్ బాబు తెలిపారు. 'హిలేరియస్ రైడ్' అంటూ సినిమాకు షార్ట్ అండ్ స్వీట్ రివ్యూ ఇచ్చారు. తన ట్వీట్‌లో సమర్పకురాలు తబితా సుకుమార్, చిత్ర బృందానికి శుభాకాంక్షలు చెప్పారు. మహేష్ ట్వీట్ చూస్తే... ఆయన సినిమాను చాలా ఎంజాయ్ చేసినట్టు అర్థం అవుతోంది. ఆయన ప్రశంసలతో 'మారుతి నగర్ సుబ్రమణ్యం' చిత్ర బృందం అమితానందంలో ఉంది.



## పాయల్ రాజ్ పుత్ ఫోటోగ్రఫీ స్టైల్

### అందంగా ఫోటోలు తీయబడును!

అనే బోర్డ్ ఆ ముఖంలో స్పష్టంగా కనిపిస్తోంది. ప్రొఫెషనల్ అంటే ఇలా ఉండాలి! అనేంతగా ఒదిగిపోయి కనిపిస్తోంది. ఒక పక్కా ప్రొఫెషనల్ కెమెరాఉమెన్‌లా అలా మెడలో కొడాక్ కెమెరాను తగిలించుకుని వీధుల వెంబడి పరిశీలనకు బయల్దేరింది.

కానీ ఇలా నవ్వులు చిందిస్తుంటేనే అసలు సమస్య వచ్చి పడింది. అంతేకాదు.. అప్పుడే స్కూటీ దిగి వచ్చిందేమో.. ఆ హెల్మెట్ కూడా ఇంకా తీయలేదు. ఎరుపు రంగు టాప్ అండ్ బాటమ్ చూడగానే కుర్రకారు కిసుక్కున నవ్వుకోవాల్సిందే. ఇంతగా చిట్టి పొట్టి దుస్తుల్లో ఇటీవల కనిపించనందుకు పాయల్ అభిమానులు అలకబూనారు పాపం! పాయల్ కి ఉన్నట్టుండి ఇలా ఫోటోగ్రఫీ పిచ్చి పట్టిందేమిటో! అలా కెమెరా మెడలో వేసుకుని ఆరు బయటకు వచ్చేసింది. అలా వచ్చేప్పుడు పూర్తిగా బట్టలు అయినా తొడుక్కోవడం మర్చిపోయిందేమిటో! అంటూ కొందరు నెటిజనులు పంచ్‌లు విసిరేస్తున్నారు.

ఏది ఏమైనా ఈ యూనిక్ లుక్ ఇన్ స్టంట్‌గా బ్లాక్ బస్టర్ అయింది. ఇక కెరీర్ పరంగాను పాయల్ తిరిగి అద్భుతమైన బ్లాక్ బస్టర్ తో కంబ్యాక్ అవుతుందేమో చూడాలి.





## పవర్‌స్టార్ బర్త్‌డే స్పెషల్ అప్‌డేట్స్

టాలీవుడ్‌లో ఉన్న స్టార్ హీరోలు అందరిలో కొందరు మాత్రమే ప్రత్యేకమైన ఫ్యాన్‌బేస్‌తో దూసుకుపోతోన్నారు. అలాంటి వారిలో పవర్ స్టార్ పవన్ కల్యాణ్ ఒకరు. మెగాస్టార్ చిరంజీవి తమ్ముడిగా సినిమాల్లోకి వచ్చినా తనదైన శైలిలో ఆడియెన్స్‌ను మెప్పించి స్టార్‌గా మారారు. ఈ మధ్య కాలంలో తన రేంజ్‌ను పెంచుకున్న పవన్ కల్యాణ్ వరుస సినిమాలతో సత్తా చాటుతున్నారు. పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ జన్మదినం అంటే అభిమానులకు పండుగ రోజు. ఈ ఏడాది ఇది మరింత ప్రత్యేకం. పదేళ్ల పోరాటం ఫలించి పవన్ కళ్యాణ్ పిఠాపురం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొంది సగర్వంగా ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో అడుగుపెట్టారు. శాసనసభ్యుడిగా గెలవడంతో పాటు ప్రభుత్వంలోనూ భాగమై చంద్రబాబు నాయుడు కేబినెట్‌లో డిప్యూటీ సీఎంగా , ఆరు కీలక శాఖలకు మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇంతటి చారిత్రాక విజయం నేపథ్యంలో ఈసారి జనసేనాని పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించాలని అభిమానులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఓ వైపు అభిమానులు సంబరాలు చేసేందుకు సిద్ధంగా ఉండగా, మరోవైపు పలు మూవీ మేకర్స్ కూడా ఆయన బర్త్‌డే రోజున పలు కీలక అప్‌డేట్స్ ఇచ్చేందుకు రెడీగా ఉన్నారు. ఇంతకీ అవేంటంటే?

అభిమానులను గతకొన్ని నెలలుగా వెయిట్ చేయిస్తున్న 'హరి హర వీరమల్లు' మేకర్స్ పవన్ బర్త్‌డే రోజు ఈ సినిమాకు సంబంధించిన ఓ స్పెషల్ పోస్టర్‌ను రిలీజ్ చేయనున్నారట. ఇప్పటికే దీనికి సన్నాహాలు కూడా జరుగుతున్నాయని సమాచారం.

ఆ తర్వాత డైరక్టర్ హరీష్ శంకర్ తెరకెక్కిస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' గురించి అప్‌డేట్ ఉంటుంది. ప్రీ ప్రొడక్షన్ పనులన్నీ పూర్తి చేసుకుని సినిమా షూటింగ్ మొదలుపెట్టే పనిలో పడింది మూవీ యూనిట్. ఇందులో భాగంగానే బర్త్‌డే రోజునే సినిమా షూటింగ్ స్టార్ట్ చేసే టైమ్‌ను అనౌన్స్ చేస్తారని సినీ వర్గాల టాక్. స్వతహాగా పవన్ కల్యాణ్ ఫ్యాన్ అయిన హరీశ్ ఇంకొంచెం ఎక్స్‌ట్రా ఫోకస్‌తో సినిమాకు పని చేయాలని ప్లాన్ చేస్తున్నారట.

ఇవన్నీ ఓ ఎత్తు అయితే సుజిత్ డైరక్షన్‌లో రెడీ అవుతున్న 'ఓజి' సినిమా అప్డేట్ మరో ఎత్తు. ఇప్పటికే ఈ మూవీ ప్రొడక్షన్ టీమ్ కూడా అభిమానులను తెగ వెయిట్ చేయిస్తున్న నేపథ్యంలో వీరి నుంచి ఓ సాలిడ్ అప్డేటే రానున్నట్లు తెలుస్తోంది. అది కూడా ఓ క్రేజీ వీడియో అని సినీ వర్గాల టాక్. పవన్ బర్త్ డే సందర్భంగా స్పెషల్ వీడియో ఆ రోజే రిలీజ్ చేసి అభిమానులకు కన్నుల పండుగ చేయాలనుకుంటున్నారట డైరెక్టర్ సుజిత్.

ప్రస్తుతం రీ రిలీజ్‌ల ట్రెండ్ నడుస్తుండటంతో పవన్ కళ్యాణ్ హిట్ మూవీ గబ్బర్ సింగ్‌ను 4కే వెర్షన్‌లో రిలీజ్ చేయాలని ఆ చిత్ర నిర్మాత బండ్ల గణేష్ డిసైడ్ అయ్యారు. పవన్ కెరీర్‌లో గబ్బర్ సింగ్‌కు ప్రత్యేక స్థానముంది. ఆ సినిమాకు ముందు పవర్‌స్టార్ ఫ్లాపుల్లో ఉన్నారు. వచ్చిన ప్రతి మూవీ ఇలా వచ్చి అలా వెళ్లిపోయినా పవన్ స్టార్‌డమ్ రవ్వంత కూడా తగ్గగపోగా మరింత పెరిగింది. ఇది ఫ్యాన్స్‌ని సంతోషపెట్టినా.. తమ హీరో హిట్ కొడితే బాగుండునని వారు ఏదో మూలన అనుకుంటూనే ఉన్నారు. ఈ సారిమాత్రం ఈ వేడుకలు ప్రత్యేకం అంటూ సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తున్నారు.. రాష్ట్ర వ్యాప్తంగా సెప్టెంబర్ 2 ముస్తాబవుతుండగా పిఠాపురంలో మాత్రం పవన్ పుట్టిన రోజు వేడుకలు మా ఎమ్మెల్యేగారి తాలూకా అంటూ అక్కడి ప్రజలు పండుగలా జరుపుకునేందుకు సిద్ధమవుతున్నారు.

## "డీమాంటీ కాలనీ 2"కు ఘన విజయాన్ని అందించిన ఆడియెన్స్‌కు థ్యాంక్స్ - హీరో అరుల్ నిధి

హారర్ థ్రిల్లర్ "డీమాంటీ కాలనీ 2" సినిమాకు ఘన విజయాన్ని అందించిన తెలుగు ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు హీరో అరుల్ నిధి. గత నెల 23న "డీమాంటీ



కాలనీ 2" తెలుగులో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వచ్చింది. ఈ సినిమాను ఎన్ శ్రీనివాస రెడ్డి సమర్పణలో శ్రీ బాలాజీ ఫిలింస్ బ్యానర్ పై ప్రొడ్యూసర్స్ బి సురేష్ రెడ్డి, బి.మానస రెడ్డి తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. "డీమాంటీ కాలనీ 2" బాక్సాఫీస్ వద్ద సక్సెస్ సాధించిన నేపథ్యంలో తాజా ఇంటర్వ్యూలో సంతోషాన్ని వ్యక్తం చేశారు హీరో అరుల్ నిధి.

– డీమాంటీ కాలనీ 2 సినిమాకు వస్తున్న రెస్పాన్స్ చాలా సంతోషంగా ఉంది. తెలుగులో మా సినిమా స్కేల్ తో చూస్తే చాలా పెద్ద సక్సెస్ ప్రేక్షకులు ఇచ్చారు. ఇక తమిళంలో మా సినిమా వండర్స్ క్రియేట్ చేస్తోంది. మాతో పాటు విక్రమ్ గారి తంగలాన్ సినిమా కూడా మంచి విజయాన్ని అందుకుంది.

– డీమాంటీ కాలనీ 2 సినిమాను తెలుగు ఆడియెన్స్ దగ్గరకు ప్రొడ్యూసర్ సురేష్ రెడ్డి గారు బాగా తీసుకెళ్లారు. తెలుగులో మంచి ప్రమోషన్ చేశారు. మా కంటే ఎక్కువగా మా సినిమాను ఆయన బిలీవ్ చేశారు. ఈ సందర్భంగా సురేష్ రెడ్డి గారికి థ్యాంక్స్ చెబుతున్నాం. ఆయన వల్లే తెలుగులో మా సినిమా ఇంత పెద్ద సక్సెస్ అందుకుంది. తెలుగులో సక్సెస్ సెలబ్రేషన్స్ చేసేందుకు సురేష్ రెడ్డి గారు మమ్మల్ని ఇన్వైట్ చేస్తున్నారు. ఇక్కడ కొన్ని అనివార్యమైన పనులతో హైదరాబాద్ రాలేకపోయాం. త్వరలోనే హైదరాబాద్ వచ్చి సక్సెస్ మీట్ నిర్వహిస్తాం.

– డిమాంటీ కాలనీ 2 పర్ఫెక్ట్ సీక్వెల్ అనే పేరు వస్తోంది. డీమాంటీ కాలనీ 2తో పాటు 3, 4 సినిమాలు రాబోతున్నాయి. ఈ ఫ్రాంచైజీలో డీమాంటీ కాలనీ 3 బిగ్ స్పాన్ మూవీ అవుతుంది. ఎన్నో ట్విస్టు లు టర్న్ లతో ఈ సినిమా ఉండబోతోంది. కొత్త కొత్త స్టోరీస్ , క్యారెక్టర్స్ డీమాంటీ కాలనీ 3లో యాడ్ అవుతాయి. డీమాంటీ కాలనీ 2 సక్సెస్ మాకు ఎంతో సంతృప్తినిచ్చింది. టెక్నికల్ గా సామ్ సీఎస్ మ్యూజిక్ హైలైట్ గా నిలిచింది. రీ రికార్డింగ్ తర్వాత సినిమాలోని కంటెంట్ చాలా ఎఫెక్టివ్ గా మారింది. సామ్ కు థ్యాంక్స్ చెబుతున్నాం.

Published by **Bodepudi Venkata Subbarao Managing Director** on behalf of Mahanadu Media pvt ltd. **Editor: Marthi Subrahmanyam** Phone: 9705311144